ఆంధ్రజ్యోతి జూలై 1945

## యువ ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| 1. | పాపం | 'చలం' | 0-12-0 |
| 2. | కన్నీటికాలువ | .. | 0-12-0 |
| 3 | అరుణ | .. | 0-12-0 |
| 4 | హంపీ కన్యలు | .. | 0-12-0 |
| 5. | బ్రాహ్మణీకం | .. | 0-12-0 |
| 6. | మైదానం | .. | 1-0-0 |
| 7. | మారుపేర్లు | కుటుంబరావు | 0-12-0 |
| 8. | కులంలేని మనిషి | .. | 0-12-0 |
| 9. | వరప్రసాదం | .. | 0-12-0 |
| 10. | కవిరాట్టు | .. | 0-12-0 |
| 11. | నీకేం కావాలి | .. | 0-12-0 |
| 12. | బడదీదీ | 'శరత్‌బాబు' | 0-12-0 |
| 13. | పరిణీత | .. | 0-12-0 |
| 14 | పతివ్రత | .. | 0-12-0 |
| 15. | వారీక్ మూల్య | .. | 0-12-0 |
| 16. | దేవదాసు | .. | 1-8-0 |
| 17. | పల్లీయులు | .. | 1-8-0 |
| 18. | లోకచక్ర | 'చక్రపాణి' | 0-12-0 |
| 19 | పాతమంగలి | .. | 0-12-0 |
| 20 | వనపూల్ రచనలు | .. | 0-12 0 |
| 21. | ప్రగల్భప్రేతము | .. | 0-12-0 |
| 22. | బెంగాలీ కథలు | .. | 0-12-0 |
| 23. | పరాజయం | .. | 0-12-0 |
| 24. | నారీద్వేషి | .. | 1-8-0 |
| 25. | మూగజీవాలు | గోఖలే | 0-12-0 |
| 26. | మంగమ్మ | చలం | 1-0-0 |
| 27. | చిత్రాంగి | .. | 1-8-0 |
| 28. | కదంబం | నార్ల | 0 12-0 |
| 29. | అనాపీలరు | పౌరీన్ | 0-12-0 |
| 30. | సుందర్ | .. | 3-0-0 |

ప్రతులకు

యువ బుక్ డిపో
43 ఆచారప్పన్ స్ట్రీట్: జి. టి. మద్రాస్.




నాగయ్య నటించిన

# త్యాగయ్య

డైరక్షన్ :- నాగయ్య

# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపాదకుడు : చక్రపాణి

సంపుటి 5] జూలై 1945 [సంచిక 1

## మా మనవి

ఆంధ్రజ్యోతి పాఠకులను దర్శించుకుని దాదాపు రెండు సంవత్సరాలైంది. ఈ మధ్యలో మనదేశం ఎన్నో కరువులకూ, కాటకాలకూ జాడ్యాలకూ గురి అయింది. దేశనాయకులంతా జైళ్లలో బంధింప బడ్డారు. కాని ఈనాడు పరిస్థితులు చాలా మారినట్టు కనిపిస్తున్నై. నాయకులు చాలాభాగం విడుదల అయారు. సన్నని ఆశాజ్యోతికూడా సిమ్లా కొండలమీదినించి కనిపిస్తోంది. ఈలాంటి ఉత్తమ వాతావరణంలో మేము ఆంధ్రజ్యోతిని చేతబూని ఆంధ్రులద్వారం ముందు నిలబడ్డాము. ఈ ఆంధ్రజ్యోతి ఆంధ్రులకు కొత్తగా మార్గం చూపిస్తుందనిగానీ, కనీసం పెద్దవెలుగు నిస్తుందనిగానీ, మేము చెప్పలేము. కాని పెద్దలునడిచే మార్గాలనూ, నాయకులువేసే దోవలనూ మాత్రం ఇది చూపించగలదు. ఇదే మేము ఆంధ్రులకు చేయగలిగినసేవ. ఇది సరిగాచేయగలిగిననాడు ఆంధ్రమాత పట్లా ఆంధ్రజాతిపట్లా మాకున్నకర్తవ్యం కొద్దిగానైనా నిర్వహించామని సంతృప్తి పడతాము.

* * *

యూరపుయుద్ధం ఆగిపోయి రెండు మాసాలైంది. దానితోపాటు బ్రిటనులో కొయలిషన్ ప్రభుత్వం అంతమైంది. ఇప్పుడు తాత్కాలిక చర్చిలు ప్రభుత్వం అమలులోఉంది. చిత్రమేమంటే యుద్ధంలో శాంతిగా ఐక్యతగాఉన్న బ్రిటిషు ప్రజలు ఈ విరామంలో విశ్రాంతిలో శాంతికోసం దెబ్బలాడుకుంటున్నారు! రేపు మిత్రరాజ్యాలుకూడా శాశ్వతశాంతి స్థాపించటంకోసం కొద్దిగా కీచులాడుకున్నా మనం ఆశ్చర్యపడవలసిన అవసరం ఉండదు! ధ్వసంనించి సృష్టి, విప్లవంనించి శాంతీ పుట్టటం స్వాభావికమే కదా!

అయితే యూరపులో యుద్ధం ముగిసినా ఇంకా మనకు ముగియలేదు. జపాను ఇంకా ఉండనే ఉంది. యథార్థం చెప్పవలసివస్తే మనం యుద్ధంలో ఇప్పుదే అడుగుపెట్ట బోతున్నాము. వివిధపక్షనాయకులూ వైస్రాయి ఆహ్వానం పొంది సిమ్లాచేరారు. సిమ్లా సంప్రదింపులు ఫలించే సూచనలు కనిపిస్తున్నై. గాంధీ, నెహ్రూ, ఆజాద్‌లు కాంగ్రెసు ప్రతిష్ఠకు, భారతస్వాతంత్ర్యానికి భంగంరాని పద్ధతిలో ఇతరపార్టీలతో కలిసి పనిచేయటానికి చాలా ఉత్సుకత చూపుతున్నారు. వైస్రాయి లార్డ్ వేవెలుదొరగారు అన్నిపార్టీలూ కలవక తప్పదంటున్నారు. ఈమధ్య జిన్నా సాయిబుగారుకూడా కొంచెం నమ్రత చూపిస్తున్నారు. త్వరలో ఈ రాజకీయ ప్రతిష్టంభన అంతం కావచ్చును. మళ్ళీ మనరాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వం రావచ్చును. ప్రధానమంత్రిగా రాజగోపాలాచారిగారే ఉంటారా? ప్రకాశంగారు వస్తారా? లేక పట్టాభిగారిని ఉండమని కోరతారా? అనేవి ఖులాసా ప్రశ్నలు. ప్రజాసేవ చేయటానికి బాధ్యతతెలిసిన వ్యక్తులు ఎవరున్నా ఒకటే. ప్రజాసేవ మంత్రిగాఉండే చేయనక్కరలేదు. నాయకుడుగాఉండే చేయనక్కర లేదు. మామూలు వ్యక్తిగా ఉండికూడా చేయవచ్చును. కాని ఈనాడు మనవారిది పూర్తిగా మరిచిపోయినారు. నాయకత్వం సంపాయించాలనే చింత మనవారిలో జాస్తి అయింది! ఆంధ్ర ప్రజాసామాన్యం ఎవరిఅండను బ్రతకాలో ఎవరిదండను నిలవాలో తెలియక దిగ్భ్రమచెంది చూస్తున్నది. ప్రజాశక్తిలాంటి అభ్యుదయ వారపత్రిక మెరికెలాంటి అభ్యుదయ కవిచేత భట్టుకవిత్వం వ్రాయించి ప్రకటించటం మొదలుపెట్టింది. మా తోపాటు మా పాఠకుల జిహ్వాచాపల్యం పోవటానికీ, చెవులతుప్పు వదలటానికీ ఆ కవిత్వంలో కొన్నిలైన్లు ఇస్తున్నాము.

జై జై పుచ్చలపల్లి
నీచూపే మాపాలవెల్లి-
తెనుగు పొలాలకు
చేవగెస్తివీ,
ధనికని యాంతల
పొగరుతీస్తివీ— జై జై॥
చెట్టు కొకరుగా
చెదరిన జాతిని
చేరదిసి ఒక
దారిచూపితివి— జై జై।
కలిసికట్టుగా
తెలుగు జాతినొక
క్రాంతి పథానికి
నడుపుచుంటివి— జై జై।

సామ్రాజ్యాలకు
గుండెగాలమై
ప్రజాసేనలకు
నేతవై తివీ— జై జై
స్వార్థపరులకూ
విద్రోహులకూ
నీ పేర్వింటీ
నిద్రపట్టగు— జై జై॥
ఐక్యత కొరకై
స్వాంతంత్ర్యముకై
ఆంధ్రజాతినీ
అందనున్నదీ— జై జై॥
జై జై పుచ్చలపల్లి
నీ చూపే మా పాలవెల్లి—


మాకు తెలిసినంతవరకు ఈ కవిత్వంచూసి సుందరయ్య లాంటి త్యాగి గర్విస్తాడనిగానీ, సంతోషిస్తాడనిగానీ అనుకోను.

సుందరయ్య ఎన్నోసామ్రాజ్యాలకు గుండెగాలమైనాడట. ఎంతోమంది స్వార్ధపరులూ విద్రోహులూ ఈయనపేరు విని నిద్రపోవటం లేదట. ఉపమాలంకారాలకుకూడా ఒకహద్దు ఉండదా ? అందులో ప్రోగ్రెసివ్ పత్రికకు !

*                    *                    *

ఏమైనా ఈనాడు ఆంధ్రులంతా దిక్కుతోచకుండా ఉన్నారు. రోజూరోజూ వచ్చేవార్తలను వింటుంటే ఆంధ్రజాతికి ముసలం పుట్టినలక్షణాలు కనిపిస్తున్నై. తెలుగుపత్రికలు అంత పట్టించుకున్నట్టు—కనపడదు. ఇంతవరకు ఆంధ్రజాతికి నాయకత్వం వహించింది, కాంగ్రెసుపెద్దలు. వారు జైలులోఉన్నా. బయటఉన్నా ఒకటిగానేఉంది. కనీసం జైలులోఉన్నా వారువచ్చి ఏదో చేస్తారనేఆశ ఉండేది. ఈనాడు అదికూడాలేదు.

పోతే ఇప్పుడున్న ఆశాజ్యోతి ఒకటే. డాక్టరు పట్టాభిగారు. వారు ఇప్పుడే జైలునించి వచ్చారు. కొత్తఉత్సాహంతో చెదరీ, బెదరీఉన్న ఆంధ్రజాతిని కూడగట్టుకుని సక్రమ పథంలో నడిపిస్తారని ఆశిస్తున్నాము. వారికి ఇదే మా స్వాగతము.




డి రామసుబ్బారెడ్డిగారితో కలిసి ఉండే అవకాశం లభించినందుకు నేను చాలా సంతసిస్తున్నాను. ఆయన మూర్తీభవించిన అనాసక్తయోగి. గీతను అనుసరించువారిలోనూ ప్రేమించువారిలోనూ అగ్రగణ్యుడు.

—వినోబా భావే.

వ్యక్తిగత సత్యాగ్రహంలో మొదటి సత్యాగ్రహీ, ధార్మిక, తాత్విక విషయాల్లో మహాత్మునికి సలహాదారూ ఐన వినోబాగారిచేత ఇంత ప్రశంస పొందిన **డి.** రామసుబ్బారెడ్డిగారిని **గు**రించి చాలామందికి తెలియదు. తెలిసే అవకాశంకూడా లేదు. ఎందుకంటే వారిని గురించి పబ్లిసిటీ ఏమీ జరగలేదు. పబ్లిసిటీ చేయించుకోటం వారికి ఇష్టమూ లేదు. అంచేత వారి ఖ్యాతి కడపజిల్లా, ముఖ్యంగా రాయలసీమ దాటిపోలేదు. నిరాడంబరజీవి; బీదలపాలిటి కల్పవృక్షము. తోటిమనిషి శారీరకంగాగానీ, మానసికంగాగానీ ఎన్నడూ నొప్పించి ఎరగడు. వారి ఇల్లు ఒకసత్రం. అతిథులేమి, అభ్యాగతులేమి, దేశసేవకులేమి, కోర్టుసేవకులేమి ఎవరైనా సరే భోజనం వేళకు అంతా హాజరు కావచ్చును. తినవచ్చును, పోవచ్చును. మళ్ళీ రాత్రికి దయచేయవచ్చును. వారి ఇల్లు 'శాంతి నికేతనం' తలుపు ఎప్పుడూ మూసి ఉండదు. వారి సజ్జనత్వాన్ని, ఔదార్యాన్ని ఎంతోమంది, ముఖ్యంగా ధనికులే, పెద్దలే దుర్వినియోగ పరిచారు. మంచిని సద్వినియోగ పరుచుకోటం మనకు చాతకాదు కదా!

ఏమైనా ఈనాడు రామ సుబ్బారెడ్డిగారు మనలోలేరు-వారు దేశంకోసం, ప్రజలకోసం చేసిన త్యాగం మాత్రమే వారికి దక్కింది. ఆ త్యాగఫలితం మనకు. ఈనాడు ఆ ఫలితాన్ని మనతో బాటు అనుభవించటానికి వారు లేకపోయారు. వారి సేవాఫలం చూసుకుని ఆ లోకంలోనైనా వారి ఆత్మసంతృప్తి పడుతుందనీ-వారి ఆశీస్సులు వారితో పాటు కష్టపడ్డ స్వాతంత్ర్యయోధులకు లభిస్తాయనీ ఆశిస్తున్నాము.


# జీవితసంగ్రహము

రామసుబ్బారెడ్డిగారు కడప జిల్లా పులివెందల తాలూకా కోర గుంట్ల పల్లెలో 1-7-1902 తేదీన జన్మించారు. బాగా కలిగిన కుటుంబం. చిన్నతనం నుంచీ చదువుమీద మహాప్రీతి. అల్లరి ఆగాలకు పోయేవాడుకాదు. హైస్కూలు విద్య కడపలోనూ కాలేజీ విద్య మద్రాసు పచ్చయప్ప కళాశాలలోనూ పూర్తిచేసి 1926 లో బి. యల్ డిగ్రీ పుచ్చుకున్నారు. విద్యార్థిగాగానీ, రాజకీయవేత్తగాగానీ వారెప్పుడూ అపజయం ఎరగరు.

1926 చివర కడపలో న్యాయవాద వృత్తి ప్రారంభించి అనతికాలంలోనే మంచిపేరు ప్రతిష్టలు సంపాదించారు. స్థానిక రాజకీయాలలో మార్గదర్శకులయినారు. 1930 లో కడప జిల్లా బోర్డు మెంబరుగానూ, 31లో కడపజిల్లా కాంగ్రెస్ కమిటీకి ప్రెసిడెంటుగానూ, 1932 లో కడప జిల్లాబోర్డుకు ప్రెసిడెంటుగానూ ఎన్నుకోబడ్డారు. వారు పాలించిన ఆ మూడు సంవత్సరాలూ కడపజిల్లాబోర్డు చరిత్రలో స్వర్ణయుగమని చెప్పవచ్చును. విద్యా విషయంలోనూ రోడ్ల పెంపుదల విషయంలోనూ వారు చూపించిన శ్రద్ధ ప్రత్యేక ప్రశంసకు పాత్రమైనది. హరిజనోద్ధరణకై వారు చేసిన కృషి, పడినశ్రమ అపారం.

గాంధీమహాత్ముడు 1934 లో హరిజన నిధి సంచారంకోసం వచ్చినప్పుడు రామ సుబ్బారెడ్డిగారి "శాంతినికేతనం"లోనే బసచేశారు. అప్పుడు రెడ్డిగారు మహాత్మునికి రాజకీయంగానే కాక ఆధ్యాత్మికంగాకూడా శిష్యులైనారు. నాడు మొదలు మహాత్ముని ఉపదేశాలను అక్షరాలా అనుసరించారు. అధికారం పెరిగినకొలదీ అహంకారం మరచి ఆదర్శ శిష్యుడనిపించుకున్నారు.

1940 సంవత్సరం నవంబరు 29 వ తేదీన వారి జీవితంలో నూతనాధ్యాయం మొదలయింది. కాంగ్రెస్ ఆదేశానుసారం కడపజిల్లాలో ప్రథమ సత్యాగ్రహిగా కృష్ణజన్మస్థానం అలంకరించాడు. శిక్షాకాలం పూర్తిచేసుకుని పట్టుమని పదిమాసాలైనా యింట్లో ఉండకుండా చెడిపోయిన ఆరోగ్యమైనా లెక్కచేయకుండా-మళ్ళీ 1942 ఆగస్టులో చెరసాలకు వెళ్ళాడు. నాటి నుంచీ వారికి కలిగిన కష్టాలకు లెక్క లేదు. ఆరోగ్యం పూర్తిగా నష్టమైంది. పొత్తికడుపులో-రొమ్ములో నొప్పి తీవ్రమైంది. 1944 మార్చిలో ప్రభుత్వం వారు వారిని విడుదలచేసింది. ఆ బాధతోనే 1945 జూన్ 8 వ తేదీ సాయంత్రం స్వగృహమైన శాంతినికేతనంలో దేహయాత్ర ముగించారు.



# నిరాడంబర సేవకుడు

ఖాసా సుబ్బారావు

ఆడంబరంలేని జీవనంతో అందరినీ ఆనందపెట్టిన ఆంధ్రవీరుడు శ్రీ డి. రామసుబ్బారెడ్డి. నిష్కాపట్యానికిది నిజమైనపరీక్ష. సాధారణంగా జీవిత పరివర్తనాల్లో, ఇతరులు చూస్తున్నారంటే, మరీ లోకం తన్ను పరీక్షిస్తున్నదంటే, మానవుడు ప్రవర్తించే తీరు వేరు. ఎవరూచూడని ఏకాంతసమయంలో వ్యవహరించే దారివేరు. ఈ రెండు ప్రవృత్తులలోనూ గలతేడా వారి స్వభావాన్ని ప్రచురంచేస్తుంది.

ఈ భేదంవల్ల ఒకప్పుడు ప్రజాకార్యాలకు కొంతలాభంకూడా కలుగుతూనేఉంటుంది. మరేవిధానా తమ డబ్బుసంచుల మూతులువిప్పనిధనవంతులు ప్రజాదరంకోసం, కీర్తికోసంమహత్తర దానాలుచేసి, ఎన్నో ప్రజాహితకార్యాలను పోషించడం చూస్తున్నాం.

అయితే రామసుబ్బారెడ్డి ఆ తెగవాడుకాడు. ఆయనలోకమే ఆయనిది. ప్రజాభిప్రాయంతో ఆయనకు నిమిత్తం లేదు. పుట్టుకతోవచ్చిన ఆయన మంచితనమే ఆయన నడవడికను తీర్చిదిద్దింది. అన్ని పరిస్థితుల్లోను సమానంగా వికాసం పొందగలిగింది. తద్వారాకలిగే భావన ఆయనకు సత్యం. ఇతరులతో


కలిసిఉన్నా, ఒంటరిగా ఉన్నా తాను తానే. ఏమీ మారడు ఆత్మనిశ్చయం లేనిది దేనికీ పూనుకోడు. పూనినపని ఏదీ మానుకోడు.

ఆయనలో వంచన అణుమాత్రమైనా లేదు. ఆయనరక్తంలో నమ్మకం పారుతుంది. ఒకసారి ఆయన ఎరుక దొరికితే చాలు. అలివిమాలిన నమ్మకం కుదురుతుంది. అపరిమేయమైన ఆ విశ్వాసపాత్రతే ప్రతివారినీ ఆకర్షించి, ఆయనకు మిత్రులనుచేసింది. అరమరలు లేకుండా ఆత్మలు ,కలిపివేసింది. అలివిమాలిన అధికారాన్ని ప్రజలమీద కట్టిబెట్టింది. విశ్వాసపాత్రతే ఆయన విజయ రహస్యం.

కనికరానికి పెట్టినపేరు రామసుబ్బారెడ్డి. నిరుపేదలంటే-కరిగిపోయేవాడు. కష్టస్థితిలోవున్న ఎవరికైనాసరే నేనున్నానని ముందంజవేసేవాడు. దరిద్రనారాయణసేవకు తన జీవితసర్వస్వం ధారపోశాడు. తన పరిచయులనే కాదు. ఆర్తులనందరినీకూడా తన కుటుంబంలోవారనిగా చూచుకున్న మహోదారహృదయుడు. మొహం ఎరగనివారిని కూడా ప్రాణస్నేహితులనుగా మార్చడంలో ఆయన ఘటికుడు. ఆకళలో ఆయన కుజ్జీలేరనే చెప్పాలి.

ఇన్ని మంచిగుణాలున్నా ఏమీ పొంగేవాడు కాదు. ఇంతటివాడని ప్రజలకు తెలియనిచ్చేవాడు కాదు. ఆయన సత్యశీలమే సామర్థ్యం ప్రసాదించింది. సవ్యంగా చేయగలననే నమ్మకం లేనిదే ఏపనికీ ఒప్పుకునేవాడు కాడు. ప్రాపంచిక విజ్ఞానం, సమర్థత, ఆయనలో మూర్తీభవించి క్రియాశూరుడైన శక్తిమంతుణ్ని చేసినవి.

మిర్రుపల్లాలలో కొట్టుమిట్టాడుతూ తారుమారవుతున్నా నేటి రాజకీయాలలో ఆయినవంటి అసాధారణస్నిగ్ధ సుందరమూర్తిని, నిశ్చలచిత్తుణ్ని మళ్లీ దర్శించగలగడ దుర్లభం. ఆయనే మరికొంత కాలం జీవించివుంటే ఇంకెంతో పైకి రాగలిగేవాడు. ఆయన అకాలమరణం ఆపుణ్యశాలి మధురహృదయాన్ని చూరలాడగలిగిన వారందరికీ తీరనినష్టం కలిగించింది. రాయలసీమ ప్రజాజీవనరంగంలోనుంచి ఒక నిర్మలహృదయుడు నిష్కపటసేవకుడు, విశ్వాసపాత్రుడైన మిత్రుడు. అంతర్హితుడైనాడు. ఆలోటు ఇంతలో తీరడం చాలాకష్టం.



# అరిది అతిథి

## సదానందం

ముట్నూరి కృష్ణరావుగారిని గూర్చి తెలుచుకొనవలసినదే గాని మాట లలో వ్యక్తీకరించలేము. అది మహా పురుషుల లక్షణము. వారిని గురించి ఎంతచెప్పుకున్నను చాలదు. ఇంకను ఏమో జీవాంశము అవ్యక్తముగనున్నట్లే ఉండును.

తనివిదీర నేత్రపర్వముగ సందర్శిం చుటకు భాసమానమైన ఆ ముఖము, చేతులు జోడింపజేయు ఆమూర్తి ఇక కనరావు. కౌతుకముదీర శ్రోత్రపేయ ముగ ఆలకించుటకు ఆ భావనాతరంగిత మైన ఊర్జస్వలవాక్కులిక వినరావు. భూమిపై నవతరించే అరిది అతిథులలో కృష్ణరావు గారొకరు. వారి ఆత్మ సాధ నను గురించి, బుద్ధి యోగమును గురించి, బల్లిదమైన వాక్కునుగురించి, లేఖినీ తేజోప్రసృతిని గురించి చెప్పిన దేమియు అతిశయోక్తి కాజాలదు.

వారి ప్రతిభ హృత్కవిలె కావలసి నదే. వారి స్వీయచరితము లోకానికే కాదు, సన్నిహితులకును తెలియదు. ఆవిధమైన కౌతుకమును వారు హర్షించు వారు కారు. వారి మానస సంచారమును పేశలహృదంతరమును ఇతరులతో పంచుకొనెడివారు. కాని స్వవిషయమును ఎపుడును దూరగించువారు.

వీరిది ఆబాల్య విశిష్ట జీవితముగా తోచును. నిరంతర జాగరూక, గవేషణా తత్పర, సాధనా పతిష్ఠమైన స్థిరసంకల్ప ముతో వారు ప్రవర్తించినవారు. తెలుగు నుడికారము వారి వ్రాతలో సానలుదీరి, వర్తమాన లోక వ్యవహారమునకు అను గుణముగా వికసించి, తేజస్వంతమైన శైలితో విరాజిల్లినమాట నిజమే. దురవ గాహ మనిపించిన అనేక జటిల విషయ ములు వారి మనోగతమై పామర జన సుబోధకములై జ్ఞాన వికాసములను, కర్తవ్యతా పరిజ్ఞానమును, దేశధర్మ దీక్షను ఉత్తేజపరచినమాట నిజమే. కాని యీ అసాధారణ కావ్యజాతమునకు వారి అంతః సత్వము ఉపోద్బలమై, పోషక మైనది.

ఉత్తమ విచారణ వారిసొత్తు. లోక మహాపురుషులు వారి కాత్మబంధువులు; మహాకవులు వారికి నెచ్చెలులు. గాంధీ మహాత్ముని తత్త్వమును, దాని విశిష్టతను హృద్గతము చేసికొన్నారు. రవీంద్రుని కవి హృదయమును స్పృశింపగలిగినారు. బుద్ధిగ్రహణకు దుశ్శకమైన అరవిందుని ఆధ్యాత్మిక—అతి-మానసిక—అతి-మానవీయ—విజ్ఞానతత్త్వమును గ్రహించుకొనినారు. ఆధునిక పాశ్చాత్య శాస్త్రముల కల్యాణప్రదమైన ప్రయో జనము తెలియనివారు కాదు. ప్రాచ్య ఆర్ష విజ్ఞాన భాండారమును మథించిన వారు. ఐతిహాసికప్రవృత్తి నుపలక్షించి నారు. వ్యక్తిమాత్రుడుగ మానవుడు దాస్యబద్ధుడు. ప్రతిజీవియు ముముక్షువై మోక్షము పొందవలెను. ఇది అంతర్విష యము, అతిలోకము.—లౌకికముగ జీవితము దుర్ణయభూయిష్ఠము. స్వదే శము పరాధీనము. ప్రజల మనోబలము చచ్చినది. తిరిగి చేవ కల్గించవలెను. ఆనంద పరవశమై లౌక్యము నూడ్చి గరుత్మంతముగా విహరించు కావ్యాత్మ హృద్యమేగాని నకనకలాడు పొట్టలను నింపలేదు. ధ్యాననిమగ్నమైపోవు ఆధ్యా త్మిక చింతన జీవి కావశ్యకమేగాని ప్రకృత లోక బాధ తీరదు. కృష్ణరావు

గారు ఇవన్నియు విచారించుకొని గాంధీజీకేసి యొగ్గినారు. గాంధీజీ సాధక మాత్రుడు—కాని గాంధీజీ సత్యాగ్రహ ప్రయోగములో కృష్ణరావుగారికి సర్వజన సులభమైన శక్తి గోచరించుటే కాక అధ్యాత్మయోగమున అదొక విలక్షణ, వినూత్న, విశిష్టపదముగా వారిని ముగ్ధులను జేసినది.

సత్యాగ్రహతత్త్వము దాని ప్రబోధకుని జీవితకాలముననే అన్వర్థమైనది. నిస్సహాయులకు, పరిదీనులకు, అగతికులకు ఆత్మస్ఫురణ కలిగి విక్రమించ గలుగుచో లోకమెత్తివచ్చినను విపత్తు లేదని ధ్రువపడినది.

ఈ జ్ఞానప్రకాశముతోనే కృష్ణరావుగారు జిజ్ఞాస ఒకవైపుకు, రసజ్ఞత మరొకవైపుకు యొగ్గుచున్నను వివిక్త జీవనులుకాక, కర్మణ్య జగమున విశిష్టులైనారు.

ఇదే వారి ఆచారవృత్తమున ప్రతిఫలించినది.

వంకర టింకరలు వారు ఒప్పరు— సూటిమాట, సూటిపని వారికి స్వతః సిద్ధము.

వారు పండితులుకారు. ఆంధ్రాంగ్ల సంస్కృత భాషాప్రకాండులుకారు. కాని మననశీలురు, వేత్తలు. 'నహి నహి రక్షతి డుకృఞ్ కరణే' అన్నది వారికి బాగా తెలియును.

అంతటి ధారాళమైన సువిశాలమైన సత్య విచికిత్సమైన జ్ఞాన పరాయణులు అరుదు. వారిని బోలినవారు మనకు కనరారు. వారిని మురిపించగలవారు ఎవరు వత్తురో కదా! వారి జీవన కథను లిఖించు భాగ్యము ఏ ధన్యజన్మునికో కదా!



# పంతులుగారి భాషాసేవ

బుర్రా వేంకటసుబ్రహ్మణ్యం

కృష్ణారావు పంతులుగారు పోయారంటే ఆంధ్రదేశచరిత్రలో ఒక యుగం నిజంగా అంతరించిందన్న మాటే. పురాణ పురుషులనిపించుకునే వారు కొందరు ఇంకా జీవించియున్న మాట వాస్తవమే. కొండా వెంకటప్పయ్య పంతులుగారున్నారు. పట్టాభి సీతారామయ్య పంతులుగారున్నారు. ఇంకా కొందరున్నారు. అనేక కాలాలపాటు వీరు మన ఆంధ్రజీవితాన్ని అలంకరిస్తూ ఉండాలని కోరుతాము. కాని పట్టాభిగారి వయస్సు ఎంతయినా వారి తెలివితేటలు కొత్త యుగానివి. వారి ధైర్యం కొత్త యుగానిది. వారి పద్ధతులు కొత్త యుగానివి. వెంకటప్పయ్య పంతులుగారు ఏ యుగానికీ చెందినవారుకారు. అన్ని యుగాలకీ, అన్ని న్యాయమైన సంస్థలకీ అన్ని న్యాయమైన కార్యక్రమాలకీ చెందే తత్వం వారిది. కృష్ణారావు పంతులుగారిది ప్రప్రథమంలోనే దేశంలో అంకురించిన దేశీయత. ఆ దేశీయతలో మాతృభాషకి చాలా ముఖ్యమైన స్థానం ఉంది. కళాపోషణకి స్థానం ఉంది. మిగిలిన వారిది రాజకీయాలలో మాత్రమే మునిగితేలే దేశీయత. భాషతోనూ కళలతోనూ వారికిఅంత సంబంధంలేదు.

కృష్ణాపత్రిక ఆదినుంచీ ఉన్న వారపత్రిక. దీనికి కృష్ణారావుపంతులుగారు జీవితం పూర్తిగా ధారపోసేరంటే అబద్ధంకాదు. కృష్ణాపత్రికయొక్క ప్రత్యేకత ఏమిటి? ఆలోచిస్తే భాష అని నాకు తోస్తుంది. చెప్పే విషయం గురించే ఆలోచిస్తారు. ఈ రోజులలో అందరూ చెప్పే మార్గమూ చెప్పే భాషా అంత ముఖ్యమని అనుకోరు. విషయం ఎంత ముఖ్యమో, భాషా అంత ముఖ్యమేననీ, నిజానికి, మారేది విషయమూ నిలిచేది భాషా కనుక, ఇంకా ఆలోచిస్తే భాషే ఎక్కువ ముఖ్యమనీ గ్రహించిన వ్యక్తులు ఇప్పుడిప్పుడు కనపడరు. కృష్ణారావు పంతులుగారికి భాష అంటే ప్రాణం. వారికి తెలుగుభాష అంటే ఉన్న ప్రేమ సంస్కృతజ్ఞానం ఉన్నమీదటా, ఆంగ్ల సారస్వతం నేర్చిన మీదటా కలిగి నిలిచిన ప్రేమ కనుక ఫలించింది. తెలుగుభాష ఏ స్థితిలో ఉందంటే తెలుగుమాత్రమే వచ్చినవాడు పండితుడు కాలేడు. సంస్కృతంకూడా వచ్చినా చాలదు. గత నూరు నూట ఏభై సంవత్సరాలలో యూరపుఖండంలోనూ ఇతర ఖండాలలోనూ వెలుగులా వచ్చిన నూతన విజ్ఞానాన్ని మనదేశం స్వంతం చేసుకోవాలంటే ఇంగ్లీషు భాషని లొంగతీసుకున్నవాళ్ళు తెలుగు భాషని దిద్దివ్రాయాలి. ఈ విజ్ఞానానికి మన భాషలో నూతనమార్గాలు చూపాలి. కాని భాషయొక్క సౌందర్యాన్ని నిలబెట్టడానికి తెలుగులోనూ సంస్కృతంలోనూ పాండిత్యం కావాలి. భాష లత లాంటిది. ఎన్నివంపులకైనా లొంగుతుంది. ఎంత ఎత్తుకైనా లేస్తుంది. ఏటువంటి దాన్నైనా చుట్టుకుంటుంది. లత

లలాగే భాష గుడ్డిది. వదిలేస్తే దానిదోవ దానిదే. ఏది దగ్గరుంటే దాన్ని పట్టుకుం టుంది. మార్గం చూపిస్తే మన మార్గమే దానిది. మార్గం చూపించవలసిన అవ సరం ఇంగ్లీషు భాషద్వారా వచ్చిన విజ్ఞానంవల్ల. మార్గం స్థిరపరచడం సం స్కృతం బాగా తెలిసి ఉండి తెలుగుభాష యొక్క నైజాన్ని విడువకుండా. ఆంధ్ర దేశంలో దేశీయత జనించినప్పుడు ఇం గ్లీషుమీద ఆప్యాయం తగ్గి స్వభాషమీద అనురాగం కుదిరింది. "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుష లోయ్" అన్నారు గురజాడ అప్పా రావుగారు. దేశం అంటే భాష అని కూడా నిర్ధారణ అయిం దప్పుడు. ఇది మొట్టమొదట గ్రహించుకున్న వాళ్ళలో కృష్ణారావుపంతులుగారు ఒకరు. ఆఖరి వరకూ భాషని ఆరాధిస్తూనే వచ్చారు. అందువల్లనే కృష్ణాపత్రికకి అంత పేరు ప్రతిష్టలు వచ్చాయి. భాషకి కృష్ణాపత్రిక చేసిన మేలూ చేయగలిగిన మేలూ ఇంతా అంతా కాదు.

విషయంకంటె భాష ఏ విధంగా ఎక్కువ ముఖ్యమో కార్యసాధనకంటె సాధించేమార్గం ఎక్కువ ముఖ్యమని కూడా పూర్తిగా నమ్మిన వారిలో కృష్ణా రావు పంతులుగారు ఒకరు. గాంధి మహాత్ముడికి నిజమైన శిష్యుడాయన.

స్వభావంవల్ల అంతరంగిక జీవుడా యన. అందువల్ల ఆయనకి గర్వం అని కూడా అనుకునే వారు కొందరు. అంత ఆడంబరంలేని మనిషిని చూడం మనం. మనుష్యుల మీదా సంస్థలమీదా ప్రేమ ఉందో లేదో అన్నట్టుండేవాడు. పైకి అతిగా మాట్లాడక పోవడంవల్ల అను మానం కలిగేది కాని నిజానికి ఆయన ప్రేమ నిర్మలమైనదీ నిబ్బరమైనదీను. ఆయన స్నేహితులకి తెలుసును. ఆయ నతో పనిచేసినవారికి తెలుసును. ఆయనకి కావలసినవారికి తెలుసును.

ఆయనతో ఒక యుగం జరిగి పోయింది. కాని ఆయన వంటివాడి అవ సరం దేశానికి తీరలేదు.

కీర్తిశేషులైన ముట్నూరు కృష్ణరావుపంతులుగారి మరణానికి విచారపడనివా రుండరు. రాజకీయాలలో—సాహిత్యపథాలలో—పత్రికారచనలో తెలుగునాటికివారు చేసినసేవ — నిరుపమానం. ఎవరెన్నివిధాల వ్రాసినా, ఏమిచేసినా, వారిఋణాన్ని తెలుగు వారు తీర్చుకోలేరు. ఆ సౌందర్యశీలికి, ప్రేమమూర్తికి, స్వాతంత్ర్యపిపాసికి నిశ్శబ్దదుందుభికి అఖిలాంధ్రదేశంతో బాటు ఇదే మా అశ్రుతర్పణం. వారి ఆత్మ అఖండబ్రహ్మా నందము ననుభవించుగాత.

# నా తీర్పు

మునిమాణిక్యం

మా నాన్న చాలాకాలం స్కూలు మాస్టరీ ఉద్యోగంచేసి రిటైరు అయినాడు. ఆయన పిల్లలకు బహుఓర్పుగా చదువు చెపుతాడు. కాని ఈ ముసలితనంలో ఆయనకు ఓర్పు కాస్త తక్కువై కోపం ఎక్కువైంది.

మా రఘూకు అక్షరాభ్యాసం చేసి కాస్త దారికి తీసుకొని వచ్చింది మా నాన్నే. ఆయన ముఖ్యంగా మనవడికి లెక్కల్లో మాంచి తరిఫీతు ఇచ్చాడు. ఎంతపెద్ద లెఖ్ఖ అయినా ఇట్టే చేశేసే శక్తి రావాలంటే ముందు భయం ఏ మాత్రం ఉండకూడదు. ఇంత పెద్దలెక్క నేను చెయ్యగలనా అని అధైర్యం ఉండకూడదు. మా రఘూకు ఈ ధైర్యం ఒకటి కుదిరింది. ఎంత పెద్ద లెక్క ఇచ్చినా అధైర్యపడక నోటితోనే చేసి వెయ్యటానికి ప్రయత్నిస్తాడు. అంత అలివిగాకపోతే అప్పుడూ పలకా బలపం తీసుకోటం.

ఎనిమిది తొమ్మిదేండ్ల వయస్సులో పిల్లల మానసికస్థితి బహు విచిత్రంగా ఉంటుంది. తెలిసీ తెలియని వయస్సు. వాళ్ళ ఊహలుకూడా బహు తమాషాగా ఉంటవి. వాళ్ళ పోకిళ్ళు తెలియకపోతే, వాళ్ళు వేసేప్రశ్నలు విసుగుపుట్టిస్తయి.

మానాన్న అసలు ఓపికమనిషే కాని ఒకరోజున ఎందుకో కోపం వచ్చి పిల్లవాడిని కాస్త కోప్పడి ఒకదెబ్బ వేశాడు. ఈవిడ రఘూను మహాగారాబంచేస్తుంది. వాడిమీద ఈగ వాలితే గిలగిల లాడుతుంది.

ఆ రోజున భోజనాలైన తరువాత రాత్రి పది గంటలవేళ మా కాంతం ఈ ప్రసంగం తెచ్చింది. ఎందుకు కొట్టాలె పసివాడిని, ఎందుకు చెయ్యాలంటూ !!

నేను సద్దేసేద్దామని ఎంతో ప్రయత్నం చేశాను. విషయం మార్చాను. నాప్రయత్నాలేవీ అక్కరకురాలేదు. పసివెధవను అనవసరంగా అంతదెబ్బ కొట్టాడని ఆవిడకు కడుపులో బహు ఇదిగా ఉంది.

ఆవిడను శాంతపరచాలంటే సులభంగాలేదు. ఏదో పెద్దవాడు, ముసలాయన ఓదెబ్బవేస్తే ఏంలే, ఆమాత్రానికి నీవు ఊరికే ఇదతావు ఎందుకూ? అని కోప్పడితే ఆ విడ ఇల్లా అన్నది.

"తప్పుఉంటే ఓదెబ్బ వేయవచ్చు. అల్లాంటప్పుడు నేనేమీ అనను. నాకు మాత్రం ఆమాత్రం తెలియక పోలేదు. కాని ఏ హీన్మే తప్పులేనపుడు వాడి చెవులు పట్టుకొని సాగదీయటంఎందుకు?

చెప్పండి. చెవులు రెండూ కందగడ్డ లైనై."

ఉద్రిక్తయై ఈమాటలు చెప్పటంవల్ల, ఆవిడ మనస్సు బాగా కష్టపడ్డట్లు తెలిసింది.

కుర్రవాడిని మానాన్న ఎందుకు కొట్టాడో అంతవరకు నాకు తెలియదు. తెలుసుకోవాలెనని ప్రయత్నమూ చెయ్యలేదు. ఎందుకో కోపంవచ్చి కొట్టాడులే అనుకొన్నాను. ఆవిడ ఆ విషయమై అంతగా రొష్టు పడుతున్నపుడు నేను పట్టించుకోకుండా తోశేసెయ్యటానికీ వీలులేకపోయింది. విషయం అంతా మొదటినుంచి చివరదాకా విని నిజంగా మానాన్న వాడిని అనవసరంగా కొట్టి ఉన్నట్లయితే, నాన్నా వాడిని మరీ గట్టిగా కొట్టబోకు అని చెప్పవలసిన అవసరంవస్తే చెపుదాము, అనుకొన్నాను. అనుకొని కాంతాన్ని నా మంచానికి పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోబెట్టి ఆవిడ చుట్టి ఇస్తూఉన్న తమలపాకుల మడుపులు తీసుకొంటూ "అది సరే, ఆయన అసలు ఎందుకు కొట్టాడు వీడిని. సంగతేమిటో చెప్పు" అన్నాను.

★

ప్రొద్దున నేను నడవలో కూర్చుని కూరలు తరుక్కొంటున్నాను. తాతా, మనవళ్ళు హాల్లో కూర్చున్నారు. విరబోసుకొన్న గిరజాలూ, వీడూ వెధవ ముద్దొస్తున్నాడు. ఆ చిన్నమట్టిలాగూ తొడుక్కొని, తెల్లచొక్కా వేసుకొని బాసినబొట్లు వేసుకొని కూర్చుంటే దొరబాబులాగున్నాడండీ". ఇల్లా అంటూ ఆవిడ కొడుకుని వర్ణించుకోటంలోకి దిగింది, అసలు విషయం వదిలేసి.

నేనుకూడా ఆ ధోరణిలోకి దిగానా, చిన్నప్పటినుంచి వాడుచేసిన అల్లరులూ ముద్దులూ, ఇవి చెప్పుకోటంలోకి దిగుతాము. ఇక దానికి అంతు ఉండదు. అసలు సంగతి తేలక ముందే తెల్లారుతుంది.



అందుకని నేనే అన్నాను, ఆవిడతో, ఇదుగో చూడూ, దొరబాబుగారినిగురించి వర్ణనలు ఆనెకు చెయ్యవచ్చుగాని ముందు అసలు విషయంచెప్పు.

నేను ఇల్లాగ అనటంవల్ల ఆవిడ ఉత్సాహానికి భంగం కలిగినట్లు ఆమె ముఖంలో కనపడ్డది. అయినా ఆవిడ పైకేమీ అనక "అసలు విషయానికేముంది లెండి. ముసలాయన మనవడిని, దగ్గర కూర్చోబెట్టుకొని చదువు చెబుతూఉంటే ముచ్చటగా ఉండి నేనూ అక్కడే కూర్చున్నాను చూస్తూ. వింటున్నారా? నిద్ర వస్తున్నదా? అంటూ తమలపాకు ఈనె ఒకటి నాపైకి విసిరింది.

"వింటూనే ఉన్నాను చెప్పు" అన్నాను.

మీనాన్న ఏదోలెఖ్ఖ ఇచ్చాడండీవీడికి. వీడు వ్రాసుకొన్నాడు. వ్రాసుకొని చెయ్యవచ్చునా. వెంటనే, చెయ్యక అలాగ చూస్తూ ఊరుకొన్నాడు. మీరెప్పుడైనా ఏదో కథ ఆలోచిస్తూ ఉన్నప్పుడు ఎల్లా

చూస్తారో పిచ్చిగా, అంతా సరిగా అల్లాగేచూస్తూ ఊరుకొన్నాడు—అని ఆగి నాముఖంలో ముఖంపెట్టి నవ్వింది కాంతం. కాంతం తనకొడుకును నాలో నూ, నన్ను తనకొడుకులోనూ చూస్తుం ది. నాకుతెలుసు ఈ సంగతి. అందుకని నేనూ నవ్వాను.

లెఖ్ఖ అర్థంగాక అల్లాగ ఆలోచిస్తూ కూర్చుని ఉంటాడు. అన్నాను నేను.

అర్థంగాకపోవటానికి ఏముందండీ ఆలెఖ్ఖలో అన్నది కాంతం.

ఏమిటాలెక్క? అని అడిగాను.

వాళ్లతాతయ్య ఇచ్చిన లెక్కచూ డండి. అంటూ కాంతం రఘూ పుస్తకం తెరిచి చదవటం మొదలుపెట్టింది.

మనం ఈ ఇంటిని రు. 950-2-3కు కొని రు. 520-15-11 కు అమ్మినట్లు అయితే, లాభమా నష్టమా, ఎంత? ఇదీలెక్క.

"ఈలెక్క ఏమంత కష్టమైందికాదే. ఒకదాంట్లో ఒకటి తీసివెయ్యటమేకా?"

ఆ సంగతి తెలియవద్దూ! తెలియకే కామాలు ఏదో ఆలోచిస్తూ ఊరుకొన్నాడు.

ఆ అల్లాకాదు. మనం ఉన్నది అద్దె ఇల్లు కాదా, ఈ ఇల్లు అమ్మటం ఎల్లాగా అని అనుకొని ఉంటాడు.

అవును ఆమాట నిజమే. అమ్మక అమ్మక అద్దెఇల్లు అమ్మటం ఏంధర్మం అండీ?

లెక్కలో ఈఇల్లు కొని అమ్మటం అని ఉంది. అందులో తప్పేమీ లేదు.

'కొనక కొనక ఈయిల్లేనా కొనటం!'

ఊరికే లెక్కకోసం అనుకోటమేగా!

ఊరికే అనుకొనేటప్పుడు ఈయిల్లు కొందాము అనుకోటం ఏమి ఖర్మం అంటా! కేకినీమహల్‌లాంటి ఇంటిని కొంధాము అనుకొంటే సంతోషం కాదండీ.

నిజమేలే, ఇప్పుడదంతా ఎందుకు అసలు సంగతికిరా.

అదీగాక ఎదో ఒకటి స్వగృహం అంటూ ఏర్పడ్డతరువాత దాన్ని అమ్ము దాము అనుకోటం తప్పు. అమ్ముకోటం అంటూ వస్తే నష్టాని కమ్ముకోటం వట్టి తెలివితక్కువ తనం.

ఈ గొడవ ఎప్పుడూ ఉన్నదేకాని వాడిని తాతయ్య ఎందుకు కొట్టాడో చెప్పు. అని నేను ఆవలించి రెండు చిటికలు వేశాను.

నాకు నిద్రవస్తున్నట్లుగ్రహించి ఆవిడ తొందరగా విషయం అంతా నాకు చెప్పే ద్దామని ఆదుర్దాగానే ఇల్లా అన్నది.

రఘు అల్లాగచూస్తూ కూర్చుంటే వాళ్ళతాతయ్య చెయ్యవేంరా లెక్క! అని కోప్పడ్డాడు. వాడు నవ్వుతూ "ఈలెక్క నోటితోనే చెప్పవచ్చు. అందుకని ఆలో చిస్తున్నానూ" అన్నాడు.

మానాన్న ఇచ్చిన తర్ఫీతు అల్లాం టిది. ఆయనదగ్గర చదువుకొన్నవాడికి, ఎంతలెక్క అయినా నోటితో ఇట్టె చేశేసేశక్తి వస్తుంది" అన్నాను.

"నోటితోచేసి చెప్పగలిగితే ఇంకేం కావాలె చెప్పుచూద్దామూఅన్నారు మామ గారు ప్రేమతోనే. వీడు ఆ లెక్కను అంత సులభంగా చెయ్యగలడా అని ఆశ్చర్యం గలిగి నేనూ చూస్తూ ఊరు కున్నాను.

రఘూ కొంచెం ఆలోచించాడు. మీ లాగ తొందరపడే స్వభావం కాదుగా వాడిది !!

అవునులే నీలాగ నిదానించే స్వభావ మేలే.

'కానీ' వాడు అంకెలవంక నిదానించి చూశాడు. చివరకు తల ఎత్తి అన్నాడు. ఈ వ్యవహారంలో కొంత నష్టమూ ఉంది, కొంతలాభమూ ఉంది అని.

వాడి మొఖం నష్టమూ, లాభమూ రెండూ ఎల్లాగ ఉంటాయి? అన్నాను నేను నవ్వుతూ.

వాళ్ల తాతయ్యా ఆమాటే అన్నారు. "నష్టమూ లాభమూ ఏమిట్రా పిచ్చి వెధవా ఏదో ఒకటే ఉంటుంది చెప్పు" అని కోప్పడ్డాడు,

రఘు కాస్త చిన్నపుచ్చుకొని "అది కాదు తాతయ్యా, నష్టమూ, లాభమూ కూడా ఉంది.'' ఎల్లాగా అంటే, ఇల్లు రు. 950-2-3 కు కొని రు. 520-15-11 కు అమ్మాడా, అమ్మితే రూపాయల్లో కాస్త నష్టం వచ్చినా, అణాల పైసలలో మాంచి లాభం వచ్చింది తాతయ్యా అన్నాడు.

నాకు నవ్వొచ్చింది వాడి తెలివి తక్కువ జవాబుకు. నవ్వి, రూపాయలు, అణాలు, పైసలు వేటికవి ప్రత్యేకంగా చూశాడు, పిచ్చివెధవ, అన్నాను.

మా కాంతం అన్నది! చూశారా. మీరు నవ్వినట్లుగానే ఆయనానవ్వి ఊరుకొంటే ఎంత బాగుండేది. ఆయన అల్లాగ చెయ్యక వాడి చెవులు మెలేసి ఏడిపించారండీ వాడిని!!

"ఏం ఏడిపిస్తే, మరేం ఫరవాలేదు. పిల్లవాడిని కాస్త ఓ దెబ్బవేస్తే, నీవు ఇంత గిలగిల్లాడకూడదు'' అని నేను మా ఆవిడనే కోప్పడ్డాను.

కాంతం ఏమీ తృప్తిపడలేదు. పైగా నావంక కూడా చురచుర చూసింది. ఇది నాకు ఏమీ సబబుగా కనపడలేదు. ఆయనకు పిల్లవాడిమీద ప్రేమలేకపోయిందా? చదువు రావాలని ఏదోకాస్త ఇల్లా అంటే ఈవిడ మహారాద్ధాంతం చేయటం ఏమిటి?

పోనీ అంతటితో ఊరుకొన్నా కొంత నయమే. కాంతం ఊరుకోక తన కొడుకును ఆయన కొట్టినందుకు విచారపడుతూ ఊరికే గునుపు సాగించింది, ఎందుకు కొట్టాలె ఎందుకు చెవులు మెలవెయ్యాలె అంటూ.

ఆ గునుపుకు అంతూపొంతూ కనిపించలేదు. నాకు వళ్లు మండుకొచ్చింది. ఆయనకుమటుకు వీడిమీద ద్వేషమా? ఏదో కాస్త చెవులు పట్టుకొంటే వచ్చిన అవమానం ఏముంది. ఊరుకోమంటే ఊరుకోక వచ్చింది ఈవిడ. చివ్వరకు మా కాంతాన్నే కాస్తకోప్పడటం అవసరమనితోచి ఇల్లాగ అన్నాను.

ఏమిటా గునుపు, కాకపోయినా, ఏదో పెద్దపుట్టి మునిగిపోయినట్లు! ఈ మాత్రానికి నీ బిడ్డ మరేమీ కందిపోలేదులే!! అయినా పెద్దవాడిని ఆయనను ఏమంటాము! ఏంజేస్తాము!!

ఈమాటలు కోపంగానే అన్నాను.

ఏమీ అనక ఊరుకొంటారా ఏమిటండి నోరుమూసుకొని, పసివాడిని అల్లాగ నలిపేస్తే? అన్నది పౌరుషంగా.

ఊరుకోక చేసేదేమిటోచెప్పు? కాకపోయినా మహా ఎగురుతున్నావులే!! అని నేను అంతకంటే ఎక్కువ పౌరుషంగా గట్టిగా కేకవేశాను.

కాంతం ముఖం ఇంతజేసుకొని కొంచెంతగ్గి "ఎందుకండీ కోప్పడుతారూ? పసివాడిని బాధపెడితే నాకు ఎంతకష్టంగా ఉందో మీరు గ్రహించాలె" అన్నది.

నేను కొంచెంతగ్గి అన్నాను. "మరి ఏంజేస్తాము. పెద్దవాడిని ఆయనను ఏమంటాము. ఊరుకోవలసిందే! అని నేను నిక్కచ్చుగాచెప్పాను. అంతకంటే ఆ విషయమై వాదన పెరగకూడదని నా నిశ్చయం.

"నే నూరుకోను" అని కాంతం నిక్కచ్చుగా జబాబుచెప్పింది. "ఊరుకోక ఏంజేస్తావు? చెప్పు!" అన్నాను.

ఆమెగారు బుడ్డమూతిపెట్టి తలవంచుకుని నేనూరుకోను అనటం చూస్తే నాకు నవ్వు వచ్చింది.

చెప్పు? అని అన్నానేకాని ఆవిడ మాట్లాడుతుందని కాదు నాఉద్దేశం. ఈ విషయమై ఇంత రాద్ధాంతం చెయ్యకుండా మొదటే ఊరుకోవాల్సిందిసుమా నీవు అని ఆవిడకు నేనుచెప్పటం అది!!

కాంతం ఇంకా తలవంచుకొనేఉంది. చదరంగం ఆటలో షా అన్నట్లు అయిపోయింది.

కాంతం ఇంకా తలవంచుకొనేఉంది. క్రొత్తక్రొత్త సింగారాలతో, గర్వంగా ఎగురుతూ పరుగెత్తుతూ వచ్చే సెలఏటి ప్రవాహానికి కొండ అడ్డమైనట్లుఅయింది.

నేను అధికమైన గర్వంతో ఆవిడను చూస్తున్నాను. కాంతం తలఎత్తి మధురమైన గొంతుకతో అన్నది. "మాట్లాడుతున్నాను వినండి. నాకొడుకు చెవులు నలిపితే, నాకెంత బాధగా ఉందో మామగారికి తెలియదు." అని నావంక నిశితంగా, చురుగ్గా చూచింది. గులాబి పూరేకులలో మధురమైన సువాసన ఎంత రహస్యంగా దాక్కొని తొంగి చూస్తుందో అంత రహస్యంగా దాక్కొని తొంగిచూస్తున్నది చిరునవ్వు ఒకటి ఆమె పెదవులమధ్యనుంచి. "నీ బాధ ఆయనకు తెలియదే అనుకో. అయితే మటుకు నీ వేం జేస్తావు?" అన్నాను.

"తెలిసేటట్లు చేస్తాను" అన్నది ఆవిడ.

"ఎట్లా తెలిసేటట్లు చేస్తావు?" అన్నా నేను.

"ఎట్లాగా? కాజీ తీర్పు ఇచ్చి! చెయ్యికి చెయ్యి, కాలికి కాలు అని వాళ్ళసిద్ధాంతం. ఆయన నాకొడుకుచెవులు నులిపితే, నేను ఆయన కొడుకుచెవులు నులుపుతాను. అప్పుడు తెలిసివస్తుంది ఆయనకి, బిడ్డమీద చెయ్యిపడితే కన్నకడుపుకు ఎంతబాధగా ఉంటుందోఅన్నవిషయం!" అంటూ కాంతం కుర్చీలోనుంచి లేచింది.



# పద-వర్ణం

## రామకృష్ణశాస్త్రి

నేను తాగను : (అని నేనే అనేది!)

తాగనంటే, అదేదో పరమ-నిషేధ మనీ, అసలా అలవాటే ఎన్నడూ యింటా-వంటా లేదనీ కాదు-ప్చ్.... ఏం లేదు, ఈమధ్య ఏందుచేతనో తాగ డం లేదు :

మరి, రోజూ ఆ తాగివచ్చేది?.... అతను, సీనయ్య.

సీనయ్య చాలా పెద్దమనిషి; వర్తి మర్యాదస్థుడు: నేను ఎరుగున్నంతలో, ఆతని కన్నుదోయికి ఎన్నడూ అన్య కాంతలు అడ్డఘంటూ వచ్చిన పాపాన పోలేదు.

సీనయ్య తాగుతూన్నట్టు నిక్కచ్చిగా నాకు ఒక్కడికే తెలుసును: ఆఁ- అంతే లెండి, అలా అనుకునేందుకు సిసలైన కారణములు ఉన్నవి: కాని, ఒట్టుపెట్టు కున్నట్టుగా ముప్పొద్దులూ ఎందుకు తాగుతున్నాడో, నాక్కూడా తెలియదు సుమండీ!

సీనయ్యా నేనూ కలిసి చిన్నప్పటి నుంచి పెద్దరిగే దాకా ఒక బళ్ళోనే ఈడూ-జోడూ-గా చదువుకున్నామనీ, పసితనంనుంచీ కూడా చాలా మమేకంగా ఉండేవాళ్లమనీ.... ఒకళ్ళంటే ఒకళ్లం నాటికీ-నేటికీ ప్రాణం విడుస్తామనీ.... యీ వైనాలన్నీ మా యిరుగూ-పొరుగు వాళ్లకు ఏం తెలుస్తాయి?-అసలే ఆవాడ కట్టున నాకు అంతమంచి పేరులేదు.... కనుక పోయిందేమీలేదు ఇవాళ నాకు కొత్తగా.... మా యింటికివచ్చేవాడు, ఆ సందుకుండా, సజావుగా మామూలుగా అందరు మనుష్యులలాగా, నడవకుండా, కాళ్లు పైకెత్తి చేతుల ఆధారంతో కప్ప దాట్లుగా వచ్చినా, లేక పిల్లి-మంత్రం వేసి మా గుమ్మందాకా దొర్లుకుంటూ వచ్చినా....ఎవళ్లూ విడ్డూర్యంగా చూడ రని నా నమ్మకం: అలాంటప్పుడు ఎవడో ఒక అర్భకుడు ఒక్కవీస పాలు అడుగు - అటూ యిటూ వేస్తూ, గాలి లో, పదేసి అడుగులకు ఓపర్యాయం ఒక్క అంగుళంమేర తూలుతూన్నా డంటే....అదొక లెక్కా జమా?.... కనుక, 'వీడూ ఒహగ్రంధ సాంగుడు లాగానే ఉన్నాడే' అని మా వాడకట్టు జగజెట్టుల ప్రశంసాలేశాన్నైనా సంపా దించుకునే యోగ్యత, సీనయ్యకు అబ్బ లేదు: మావాడ-కట్టు ఒక్కటే ఏమిటి లెండి, అసలు లోకం తీరే యిలాఉంది. తాగిన తరువాతకూడా, తలవంచుకుని తనదారిని తాను పోయేవాడు, దానిదృష్టి లో....మనిషి కాడు, వర్తిపశువు....సరే దానికేంగాని....

'ఎందుకు తాగివస్తున్నావు భాయీ?' అని అడగవలసినఅవసరం నాకు లేదు. మీరు వెయ్యి చెప్పండి-లక్ష చెప్పండి, ఒకమనిషి తాగితే చెడిపోతాడని....నాకు ఎంతమాత్రము, ఈనాటివరకూ, నమ్మ కము లేదు....

....ఒక వేళా - పాళా అనకుండా, పొద్దోయీ-పొరమారీ వచ్చేవాడు. యిష్టం ఉంటే నాతోబాటు వేళకు యింత నలో-

గంజో త్రాగేవాడు. ఇక్కడే నిద్దరోయే వాడు.

'నిక్షేపంగా యిల్లూ వాకిలీ ఉండగా నీకు ఇదేం ఖర్మంరా?' అని నేను అడుగనూలేదు. ఎన్నడూ వాడిని ఏ విషయంలోనూ పల్లెత్తుమాటఅనడం.... అలవాటులేదు.

కానీ, ఇలా ఎన్నాళ్లు జరగాలో అని, నామానాన నేను ఊరుకున్నాను.

అవాళ మధ్యాహ్నం, సీనయ్యపెళ్లాం, మాయిల్లు వెదుక్కుంటూ వచ్చింది.

'రా అమ్మా, రా!' అని నేను పలుక రించనూ లేదు.

'ఏరీ అన్నయ్యా, ఆయన' అని ఆచిన్నది పలువిప్పి అడుగనూ లేదు.

ఆ అమ్మాయి, గుమ్మంలోకి వచ్చిం ది....గుమ్మంలోంచి లోపలి హాల్లోకి వచ్చింది....అక్కడే నిలుచుంది.... పోయి ఆ కుర్చీలో కూర్చుంది....

ఆ పిల్లది అడగలేదన్నమాటే కాని ....నేను ఏదో మహా - హడావడిగా ఉన్నట్టు అటూ యిటూ తిరుగుతూ, అవీ-యివీ అక్కడివిక్కడా - ఇక్కడి వక్కడా సర్దుతూ, ఆవంక చూడకుండా ఉన్నా, నేను ఎటు చూసినా ఎదుటఉన్న ప్రతివస్తువూ.... వేయిగొంతులలో నన్ను ఆ ప్రశ్నే అడుగుతూంది....

'అదిగో ఆలోపల ఉన్నాడు. అవతల గదిలో పడుకున్నాడు' అని నేను వేరే చెప్పక్కర్లేదు. ఆ అమ్మాయి లోపలికి పోయి చూడకూడదూ?

....సీనయ్య....అక్కడికే వచ్చాడు. తనంతట తానే వచ్చాడనుకోను. ఆ అమ్మాయి ఆత్మశక్తి అంత దొడ్డది బొ ననిపించింది....నావళ్లు గిరుక్కున అటు వేపు తిరిగింది....

సీనయ్యను చూడగానే ఆ చిన్నదాని రెండుకళ్లూ ఒక్కచూపున మణి లాగా మెరసినవి....సీనయ్య ఛెళ్లున కమిచీదెబ్బ నిలువునా తిన్నట్టు లోపలికి దూది పింజెకుమల్లే ఎగిరిపోయినాడు. ఓరు గాలికొట్టినట్టు తలుపు ఠఫ్‌న పడ్డది....

నాకు కళ్లు తెరిపినపడి, తల ఎత్తే సత్తువలోకి మెడ సడలే వ్యవధానం లో....సీనయ్య భార్య వెళుతున్నానని అయినా చెప్పకుండా, సడీ చప్పుడూ లేకుండా వెళ్ళిపోయింది....ఆ కుర్చీవంక చూడటానికి జంకాను. అది ఎక్కడ ఎగిరి తంతుందో అని భయంవేసింది....

సావిట్లో బల్లమీదా, కుర్చీల్లో సోఫా ల్లో పడిఉన్న సమస్తసామగ్రీ; పుస్త కాలు కలాలు రాళ్లు-రప్పలూ, దిళ్లూ దిస మొలలూ....అన్నీ, అక్కసుతో ఎగిరి వెళ్ళి 'తీస్తావా తియ్యవా?' అని ఆతలుపు మీద పోయిపడ్డాయి....అది బద్ధకంగా.... అనుమానంగా తెరుచుకున్నది....ఒక్క నిమిషంఉండి సీనయ్య బయటికి వచ్చా డు....

'ఏంరా సిగ్గులేదూ?' అన్నాను. కోపం భగ-భగ లాడుతూంది కాని, అంతకన్న కొట్టినట్టు దురుసుగా ఎలా అనాలో నాకు చేతగాలేదు. సీనయ్య, చీమన్నా కుట్టనట్టుగా వినిపించుకునీ-వినిపించుకో నట్టుగా....నిర్లక్ష్యంగా నన్ను ఎగా-దిగా చూసి 'నువ్వా యింతేనా?' అన్నాడు ఆశ్చర్యంగా.

'అంతేనా అంటే?'....నాకు వాడి ఊహఏమిటో అర్థంకాలేదు.

'అందరిలాంటి ఫూల్ వే అన్నమా ట.'....వాడు నదురూ బెదురూ లేకుండా ధైర్యంగా అనేశాడు. నాకు కోపం రావ

డానికి.... జంకింది; కాని లోలోపల కుత-కుత మంటూంది.

నువ్వా యింతేనా?-' అయ్యోపాపం 'ఆ యిల్లాలు.... ఆ బంగారుతల్లి వెదుక్కుంటూవచ్చి పడిగాపులు పడిఉంటే యీ పనికిమాలినవాడు.... బుద్ధిలేకుండా చూసి తలుపువేసుకుంటాడూ? అంత తామసానికి.... ఆలా కంటిచూపూ-నోటి మాటా లేకుండాపోవడానికి ఆచిన్నది చేసిన మహాపరాధం ఏమిటయ్యా?'.... 'ఇదేనా నీ మ న సు లో ధోరణి?....' సీనయ్య గద్దించాడు:.... ఇన్ని చిలవలు-పలవలుగా ఆలోచించలేదన్నమాటే కాని, అసలు సాపుగా ఊహఅదే కాదని ఎలా అనగలను?.... నా నదురుడు పర కాయించి, సీనయ్య ఇహ ఒంటికాలిమీద లేచాడు....

'ఒరేయ్ నీవు యింకా సత్యకాలపు మనిషివి. ముక్కుకు సూటిగానే ఆలోచిస్తావు. కొందరు ఉన్నారు అక్కడక్కడ మహానుభావులు.... అతిరధులు, మహారధులూను. ఇదే వాళ్ల కంటపడినట్టాయెనా అందలంలో ఎక్కించి పధ్నాలుగు పేటలు ఊరేగించకపోయినారూ?,... పెళ్లాంమీద పుట్టెడుకోపం ఉండి, నమిలివేద్దాం-మింగివేద్దాం అన్న అక్కసులో ఉండి, ఆ యింటిపట్టునఅన్నా ఉండకుండా, నాకంట నరుడూ, నరుడికంట నేనూ పడరాదు అన్నట్లు కన్నానబోయి కన్నాన వచ్చినట్లు, ఏజోలీ-శొంఠీ లేకుండా కాలక్షేపం చేస్తూంటే, 'తగుదునమ్మా అనుకుంటూ, మళ్లా యిక్కడికి ఏం ముఖం పెట్టుకు ప్రత్యక్షమైనావు?—చేసిన నిర్వాకం చాలదా?....' అంటూ సాగదీసి యీచెంపా ఆచెంపా వాయకొట్టకుండా.... సిగ పాయతీసి తన్ని తగిలేయకుండా, తాను ఏ పాపమూ ఎరుగకపోయినా, తనకు ఆచిన్నదాన్ని చూడటానికి మొగం చెల్లనట్టు తలుపుచాటున దాక్కున్నాడేకాని, ఆ రాకాసిని చిన్నమెత్తు మాట అనలేదు. ప్చ్-యీ కలికాలంలో పుట్టవలసినవాడు కాదు.... అని నన్ను చూసి హర్షించనివాళ్లు, జాలిపడనివాళ్లు ఉండేవారు కాదంటావా?....'

ఆ వాగుడుకు ధరీ-అంతూ కనబడటంలేదు.... సరే వాడి కెంతముచ్చటగా ఉందో, వాగి-వాగి వాడిమానాన వాడే ఊరుకుంటాడు లెస్తూ అని వినీవిననట్టు నేనూ ఓచెవి వప్పగించి ఊరుకున్నాను. పోనీ పాపం, వాగనీండి.... మాటలకు యీ నడుమ యిద్దరమూ కూడా మొగం వాచిపోయినాము. వాడు ఎప్పుడూపిలిస్తే వినిపించుకునే ధోరణిలో ఉండేవాడు కాదాయెను. వినిపించుకున్నా ఉలికేవాడూ-పలికేవాడూ అసలే కాదాయెను.... సరే కానీండి, మాటలు ఖంగ్న మార్మోగడం యింటికీ-వంటికీకూడా మంచిది.

'ఏంరా, ఏం మాట్లాడవేం?'

—ఏం మాట్లాడేది? అనలేనిమాటలన్నీ పేని మూలిగాను.

'అవునా, కాదా?'

—తల అయినా వాడికి తెలిసేట్టు ఊపక తప్పేట్టులేదు. సీనాయ్ నావంక అలా రెప్పవాల్చకుండా చూస్తున్నాడు. వాడు చూస్తూన్నంతసేపూ నాతలకాయి వాడి కనుసన్నల్లో మెలగుతూన్నట్లుగా.... ఆడుతూనే ఉంది....

సీనాయ్ కళ్లల్లో పొడి ఆరిపోయింది. జాలిగా చెమ్మగిలినవి.

'నీవన్నమాటలో ఎంతనిజం ఉన్నదో నీకు తెలియదురా!' అంటున్నాడు ప్రాధేయపడుతూన్నట్టు....'అంటే?' అని

నేను మౌనంగా ప్రశ్నించక తప్పదు కదా....

'ఏంరా నాకు సిగ్గులేదూ?'

—దానికి ఉంది-లేదు అని ఖచ్చితంగా సమాధానం చెప్పడానికి నాకు తరంకాదు.

'మా ఆవిడమీద కోపం కాదురా. సిగ్గుపడి అవతలికి తప్పుకున్నాను'....

'నిజం?'

ఆశ్చర్యం వేసి అడిగానన్నమాటే గాని, వాడి వాలకం చూసిన తరువాత ఆ సందేహం ఏమీలేకుండాపోయింది.... ఆ సంగతి ఒప్పుకున్నందుకు ఎంత లజ్జించుతున్నాడో....ఎందుకూ, తెలిసిపోవడం లేదూ?

'నీకు ఎందుకురా మధ్యఅంతసిగ్గు.... కుల-పతివి గాని, సతివికాకపోతివి....'

'తాగుతున్నానని ఆమెకు తెలుస్తుందేమోనని....

'ఏమో తెలిస్తే?'

ఏమా?....ఏమో వెయ్యి కారణాలు వాడికళ్లు చెప్పినవి. 'అయ్యో పాపం' అనుకున్నాను....జాలితో కాదుసుమా, అంతో యింతో గౌరవంతో.

'ఏంరా, పోనీ, నీకూ ఆవిడకూ అంత యిష్టంలేని పని చేయాలిసిన అగత్యం ఏం వచ్చిందీ?....యిది మూణ్ణాళ్ళ ముచ్చటే కాదూ?....ఏం పుట్టినప్పటి నుంచీ తాగుతున్నావా? అది లేకపోతే ఉండలేవు గనుకనా? ఇంతకూ నీకు మీ ఆవిడ ఎక్కువా? ఈతాగుడు ఎక్కువా?

'అలా అడిగితే ఏం'చెప్పనురా. మా ఆవిడను మించిన వస్తువు సృష్టిలో యింకొకటి నాకేం లేదురా. ఆవిడ సౌఖ్యం కోసం నేను ఏ త్యాగానికైనా వెనుదీయనురా?....కాని....'

'ఊఁ- కాని....'

'తాగక తప్పదురా'

'ఆలాగేం?'

'అవునురా. నాబాధ నీకు ఎలా అర్థం అవుతుంది?'

'బాధ ఏమిటో చెపితే....'

'....వంగరాజ్యంలో దుస్సహ దురంత క్షామ తాండవం....అబ్బ అది తలచుకుంటే....ఆమాట వింటే.... హుఁ....అది మరచిపోయేందుకు తాగందే బ్రతకలేనురా....'

—'అవును సీనయ్య-యే ఆమాటలు అంటూన్నది'— అని నాలో మనసుకు నచ్చ చెప్పుకున్నాను....

పెద్దపెట్టున లోకాన్నంతా ముంచి ఎత్తేటంతటినవ్వు ముంచుకురాబోయింది. కాని..మనసులోమనసు' ఏమిటే భడవా, ఏం తెలిసిందని నీకు అంత యద్దేవా? అంటూ చెంపలోపల ఛెళ్లునకొట్టింది.

'అంతేనా మరి! అంతకన్న ఏం చెయ్యమంటావు చెప్పు?'....సీనయ్య ప్రశ్న నన్ను తరుముకు వస్తూంది.... నవ్వుకూడా వస్తూంది....

తాగడం ప్రారంభిస్తే నవ్వడం మరచిపోగలనా - లేదా?....ఛస్, ఆమాట అనుకుంటేనే నవ్వు వచ్చేట్టుంది.

నవ్వితే సీనాయ్‌దీక్షకి అపచారం చేసినట్టు!

అందుకనే....నేనుతాగను!




సాధారణ మానవులు సుఖంగా జీవితంలో adjust అవుతారు. పైనించి కలిగే ఇబ్బందులేగాని, డబ్బూ ఆరోగ్యమూ, వుంటే సుఖంగా గడిపేస్తారు జీవితాన్ని. కాని కొందరికి విపరీతమైన భావనాశక్తి, సృష్టిశక్తి వుంటుంది. దానికీ జీవితానికీ సామరస్యం కుదరదు. పైకి జీవితంలో ఆ శక్తిని వెలిపుచ్చుకునేందుకు, అన్నీ ఆటంకాలు, మార్గమూ తెలీదు. అప్పుడే కళాసృష్టి జరుగుతుంది. జీవితాన్ని వొదిలి, తన కళలో తన అధికశక్తిని సౌందర్య రూపంగా సృష్టిస్తారు. ఆ సృష్టికి కూడా అభ్యంతరాలు కలిగినప్పుడు నరకబాధ పడతాడు ఆర్టిస్టు. కాని ఆ సృష్టి సాగిందా, అద్వితీయమైన ఆనందాన్ననుభవిస్తాడు. ఆ శక్తినే జీవితంలో adjust చేసుకోగల సామర్థ్యం కలిగిందా, ఇంక కళను సృష్టించే అవసరం పోతుంది అతనికి. మౌని ఔతాడు. అతని జీవితమే, మాటలే, ముఖమే, గొప్ప ఔన్నత్యాన్ని వెదజల్లుతుంది. ఆ సామరస్యం కుదరనంతవరకు, అతను గొప్ప ఆర్టిస్టు కావొచ్చు, కాని అతను ఏ మనిషికీ, ముఖ్యం కుటుంబానికీ ముఖ్యం ప్రియురాలికీ స్నేహయోగ్యుడు, కాడు. బైరన్ చేత నాటకంలో అనిపించినట్టు.

I can make no woman happy and no woman can make me happy.

కాని చాలామంది ఆర్టిస్టులు, తమ శక్తిని ఈలోకపు రొదలో నశింపచేసుకుని ఆరిపోతారు త్వరలోనే.

ఏదన్నా పైనించే చూసి ఆ పైనే కళారూపాన కక్కేసే ఆర్టిస్టుకన్న, అనుభవించిందాన్ని లోపలికి తీసుకుని, దాన్ని X కి react చేసి, దాని అందాన్ని రసంతీసి పలికేవాడు గొప్ప ఆర్టిస్టు... కాని అప్పటికీ ఆ అనుభవపు అందాన్ని భరించుకునే లోతులు అతనిలో లేకపోబట్టే పైకి వెళ్ళబుచ్చడం సంభవించింది. పరిపూర్ణమైన స్వభావం లోకపు అందాన్నంతా తాగి తనది చేసుకుని లోపలే నిలుపుకోగల లోతుల్ని కలిగి వుంటుంది. అందువల్లనే ఎదిగే ప్రతి ఆర్టిస్టూ మౌని అవుతాడు.

మనిషులు చూడని అందాన్ని వాళ్లు అందుకోని ఆశయాల్ని వాళ్ల అందుబాటులోకి తీసుకురావాలి. కవిత్వం, వచనరచనలు వాళ్ల ఆలోచనల్ని ఉద్రేకింప చెయ్యాలి. జీవితంలో కొత్త సమన్వయాలు చూపాలి. ముఖ్యం ఈ కాలంలో, పాత మతాలు, పాత నమ్మకాలు, అన్నీ కళ్ళముందే ధ్వంసమై పోతూవుంటే, యువకులు ఎది నిజం, దేనిమీద కాళ్లు నిలిపి తలెత్తడం అని చూస్తున్నారు. ఏ పాతనీతీ, ఏ పాత

సయన్సూ, ఫిలాసఫీ, వాళ్ళకి తృప్తి నియ్యటం లేదు. మొన్నటివరకూ యూరప్ తన Scientific Philosophy లో డెమాక్రసీలో మెషీనరీలో League of nationsలో విశ్వాసముంచింది. ఈ దేశమూ ఆ నమ్మకంలోనే పలవరించింది. కాని యీ యుద్ధంతో అవన్నీ పూర్తిగా తుడుచుకుపోయి నాయి. లోకం ఏం కాబోతోంది ముందు కాలంలో? ఎట్లా లోక కళ్యాణం, క్షేమం కలగచెయ్యాలని ఆలోచిస్తే, ఒక కమ్యూనిజమే మిగిలింది ఆధారంగా. ఎవరు మాట్లాడినా, యోచించినా, లోకంవంక చూసి ఆలోచించే వాడెవడూ, ఆ కమ్యూనిజం భావాల్ని వొదిలి మాట్లాడితే, ఆ మాటల్ని ఓ లెఖ్ఖలోకి తీసుకోవలసిన అవసరం లేదు యువకులకి.

రచయితల వ్రాతలుకూడా, కాలంతో నడవక, ప్రస్తుత పరిస్థితుల్ని గమనించి ముందుకి చూడక వేదకాలం సనాతన ధర్మం, కులాలూ, మతాలూ, మాట్లాడితే, చేసిన పాపాలకి భయపడి మూలిగే ఏ ముసలి గ్రాడ్యుయెట్లో తప్ప ఇంకెవరూ వాటిని చదవనన్నా చదవరు. రామాయణాలు, శివ పురాణాలూ, తాము ఇంకా ఎందుకుమిగిలి వున్నాయో జబాబు చెప్పుకోవలిసిన కాలం వొచ్చింది.

ఏ రచకుడైనా ఇట్లా జరుగుతుందనీ, ఇట్లా జరగాలని చెప్పడం సాహసం. కాని ఆలోచించుకో అని ప్రేరేపించే గుణం కలిగి, చూస్తున్నదానికీ, నమ్మవలసిందానికీ, సమన్వయం కుదర్చాలి శక్తివుంటే. ఎందుకు నీతిగా ప్రవర్తించాలి, ఎందుకు ఇంద్రియాల్ని నమ్మాలి, ఎందుకు యీ తారతమ్యాలు పోయే ప్రయత్నం చెయ్యాలి? అనేవాటికి జవాబు చెప్పాలి.

దేనిని నమ్మినా, దేనికై యువకులు ఉత్సాహంగా ప్రయత్నించినా, వాళ్లని చల్లార్చే శక్తులు చాలా ఉంటాయి. విద్యాధికుల reasoning అన్ని ఆశయాలు దుమ్ముచేసుకున్న 'సినిక్సు' వెక్కిరింపూ, పెళ్లి, ఉద్యోగమూ, జీవితంలో బాధలూ, 'లా'-ఇన్నీ. వీటిని గ్రహించగల ఉత్సాహమూ, ప్రతికక్షుల అభ్యంతరాల్ని ఓడించగల తెలివినీ, యివ్వాలి యువకులకి కొత్త రచనలు.

ప్రజల మంచి నీకెందుకు? ఎల్లుండి చచ్చేవాడికి లోకం ఏమైతే నీకేం? ఈ ఉద్యమమూ తక్కినవాటి మల్లేనే పూడ్చుకుపోదని నీకేం తెలుసు? ఏర్పాట్లు practicalగా ఎట్లా చేస్తావు? అని అడిగితే తృప్తిగా సమాధానం ఎవరూ చెప్పలేరు— తన Subjuctive feelings and understanding మాత్రమే జవాబు.

తిండి, బట్ట, ఇల్లులేక ప్రజలుపడే బాధ, రోడ్డుమీద యీగలు ముసిరే ముసిలిని, విద్యలేక కైదుకుపోయే యువకుణ్ణి చూసినప్పుడు, చుట్టూ వున్న లక్షాధికారుల్ని నరికి, దోచుకుని పంచడం అత్యంత అవసరమైన ధర్మంగా కనపడుతుంది. నిలిచి ఒక్క నిమషం ఆలోచిస్తే ఆపని వ్యర్థత్వం అప్పుడే తడుతుంది.

ఏదోవిధంగా ప్రజలందరికీ శరీరావసారాలు తీర్చామనుకోండి — అప్పుడు, అందరూ వొప్పుకొంటారు, ప్రపంచ సమస్యలూ, బాధా, దుఖ్ఖమూ తీరవని. జీవితం తాళం చెవులు మన చేతికి చిక్కితేనేగాని ఏమీ ఆశలేదు. కాని

శరీరంపడే యీబాధల్ని తప్పించామా, లోకం ఎంతబాధ తరిస్తుంది?

నేను నా హృదయంలోకి చూసుకుంటే, కారణంవుండి నేనుపడ్డ మనోవ్యధా, కారణం లేకుండానే నాలో పుట్టిన ఘోరమైన చీకటీ (gloom) తలుచుకుంటే,శరీరబాధలూ, తిండి లేక పోవడమూ ఎన్నిరెట్లు నయమా? అనిపిస్తుంది. ఇట్లాంటిబాధ అందరు ఆర్టిస్టులూ పడతారు.

ఆకలీ, ఎండా, బాధిస్తే తీరికగా కూచుని artistic, philonthrophic, spiritual బాధ పడడానికి మనసుకి వ్యవధివుండేది కాదేమో! అంటే, అదే నయం అనుకుంటాను. అందువల్ల ముష్టివాళ్ళని చూస్తే అంతజాలీ రాదు, భాగ్యవంతుల్ని చూస్తే అంత కోపమూ రాదు-అందరమూ ఒకటే చోటులో వున్నాము-కొందరికి మాటలున్నాయి. కొందరికి లేవు. కాని అందరమూ తడుస్తునేవున్నాము. వోణుకుతున్నాము.

ఏమైనా ఏనాడైనా, అవన్నీ అనవసరంగా కనపడతాయిగాని, భోజనం పెట్టగానే తక్కిన వాటికోసం వెతకడం మానరు. తక్కిన వివ్వగానే శృంగారం-కవిత్వం-

అనుభవం వున్నవాళ్లు సౌందర్యం, ఆనందం తప్పవు. వాటితోనే higher aspirations-

చివరిది మృత్యువు-మృత్యువు అనే అగాధం యెదట వున్నవాళ్లు-రెండో వొడ్డు వుందా లేదా, వుంటే ఆ వొడ్డున ఏముంది? అని వెతకడం మానడు మానవుడు-ఎంత మతాల్ని ధ్వంసంచేసినా సరే, దేవుళ్లందర్ని నిలబెట్టి నరికినా సరే!

ఈ కర్షక కార్మికులు విద్యనీ, సుఖాన్నీ, సంస్కారాన్నీ పొందిన కొద్దీ భావకవులూ, mystic కవులూ, విమర్శకులూ ఫిలాసఫర్సుగా తయారవుతారు పోతన్న మల్లే.

మనుషుడికి కావలిసింది సుఖం. కాని సుఖమున్నవాడు కూడా ఆ సుఖంలో నిలవక, అశాంతిలోంచి, బాధలోంచి, ఇంక దేనికో వెతకడం చూస్తాము. ఇది బలహీనంకాదు. ఇట్లాంటి వెతకడం అణువునించి కూడా ఈ సృష్టి పరిణామ ప్రయత్నంలో కనిపిస్తుంది. ఈ సుఖాలలో శాంతిలో చాలా రకాలు (Stages) స్టేజస్ వున్నట్లు కనిపిస్తాయి. ఏ స్టేజిలో ఐనా వెతకడం, ఆ వెతకడంలో బాధా కనిపిస్తాయి. Growin Pains అంటారు వాటిని. అట్లాంటి బాధా వెనక్కి చూసుకుంటే సుఖంగా కనపిస్తుంది. పిల్ల పాకుతో సుఖంగానే వుంది. కాని నడక ప్రయత్నించి ఎన్ని దెబ్బలు తగిలించుకుంటుంది? మీకు తిండి పెడతాం, ఇల్లూ బట్టలిస్తాం ఇంక గొడవలేకండా సుఖంగా కూచో అంటే ఏమానవుడూ అక్కడ ఆగడు. తన సౌఖ్యసౌధాల్ని కావలిసి కూలతోసుకుని మళ్ళీ నిర్మించుకుంటాడు. ఇది వ్యక్తులలో, సంఘాల్లో, నేషన్సులో కనపడుతుంది ఈ నిరంతర నిర్నిద్రయత్నం. ఎప్పుడూ మానవుడికి, ఇంకో మానవుడుగాని, సంస్థగాని ప్రభుత్వంగాని యీ సుఖంలో నువ్వు నిలుచుకో అని బైటనించి బలవంతం చెయ్యలేరు. తనస్వంత సుఖాన్ని తన లోపల్నించి కట్టుకోవాలి మానవుడు. మనం ఏర్పరిచిన సుఖపద్ధతి, జంతుప్రదర్శన శాల జంతువుల కిచ్చినంత సుఖాన్నే ఇస్తుంది. తన సుఖానికైనా సరే, బలవంతంగా ఒక ఏర్పాటుచేస్తే దాంట్లో నిలవడు. బాధకైనా సరే, అతనికి స్వతంత్రం కావాలి.



# ప బ్లి

ఒక కమ్యూనిస్టుపత్రిక ప్రచురించిన చిత్రం

దేనికో వెతుకుతోంది ఈ హ్యుమానిటీ-ఏ అందానికో, శాంతికో, ఎక్కడా కనపడని జ్ఞానానికో. సర్వ సామాన్యుల యత్నాల, కలలఫలితంగా యుగానికి ఏకొద్దిమందిలోనో వికసిస్తుంది గొప్ప అందం, ఆదర్శం. వాళ్లు లోకానికి మార్గదర్శకులౌతారు. చెట్టు కలల ఫలితంగా పువ్వులు పూసినట్లు. వాళ్లని అప్పటికి ద్వేషించినా ప్రపంచం వాళ్ళ అడుగుల్లో ముందుకి సాగుతుంది.

ముష్టివాళ్లకి, దిక్కుమాలినవాళ్ళకి ఆశ్రయ మివ్వడానికి ప్రయత్నించే వాళ్ళకి యీ సంగతి చాలా స్పష్టం. తిండిలో, బట్టలో, ఆశ్రయంలో ఆగదు. తిండికన్న నల్లమందో, చుట్టముక్కో అతని కెక్కువ విలువ. ఓసారి ఖాస సుబ్బారావుగారు అన్నారు.

"Chalam. It is the superfluous things that give us real pleasure."

జ్ఞాపకముందా, సుబ్బారావు గారూ, మనం ట్రయిఫెండ్లు జేబుల్లో వేసుకుని ఇంటికి వొస్తో, బజారుమార్గాన్ని తప్పించుకు రావడం-

"Lead me not through the path of temptation" అనే మీగోల.

ఇంకా అంత దయగా మధురంగా చిరునవ్వుతున్నారా?

ముష్టివాళ్లకి 'డబ్బులివ్వకండీ. తాగేస్తాడు, వెధవ' అంటారు మనుషులు.

"ఆ ముసిలమ్మ ఈ డబ్బులతో నల్లమందు కొంటుంది." అంటాడు బారెడు చుట్ట కాలుస్తో పెద్దమనిషి.

నీ జరీ వుత్తరీయాలు, పెళ్ళి ఖర్చులు చావు భజంత్రీలు-అన్నీ అవసరాలా! నీ హక్కులా! కానీపెట్టి ముసలమ్మ నల్లమందేసుకోవడం అన్యాయపు ఖర్చు లాగ తోస్తోందా నీకు?

నిలవలేరు సుఖంలో. తోచదు-గోడ్లంబడి తిరగాలి. పోగుచేసుకోవాలి. సంపాయించుకుంటున్నాననే। విలువ, శక్తి, కాసులు కూడుతున్నాయనే తృప్తి.

# సి టీ



ఒక ఫిలుంకంపెనీ ప్రచురించిన స్టిల్

తనది అనే శాంతి-జీవిత యత్నంలో రంగులు-చివాట్లు, హేళనలు-ఎట్లాగో తనని గుర్తించడం, కోపంతోనైనా సరే-తక్కిన ముష్టివాళ్ళతో కాంపిటిషన్-ఇవీ అతనికి కావలిసింది. అవి తీసేసి తిండిపెడితే నిలవడు, నిలవలేడు.

"ఈ గోడ్లంబడి తిరిగి అడుక్కోడం, దొరక్కపోవడం, చివాట్లు. నీకెందుకు, నేను కడుపునిండా తిండి పెడతాను... ఇల్లు కనిపెట్టుకుని వుండు అని ఎందర్ని అడిగాను? ఒకరు నిలవలేదు" అని తన అనుభవం చెపుతున్నారు లీల.

ఉండమన్నవాళ్లు, వుండి నిలువలేక పోయినవాళ్లు బలవంతాన వుంచితే పారిపోయినవాళ్లు, సహాయమడుగుతూ వచ్చే సంస్కారం కొద్దో గొప్పో గల స్త్రీలు ఇంతే.

"లోకమంతా మోసంచేసే మొగాళ్లు. ఇక్కడ ఆశ్రయం తీసుకో."

ఆ మోసాలూ, మొగవాళ్లే నయం, నిశ్చలం, నిరామయమైన ఈ జీవితం కన్న" అంటుంది వాళ్ల మనసు వాళ్ళకి తెలీకుండానే.

మనం చర్కాతో సంస్కరించబూనిన జీవితాలు జ్ఞాపకంవున్నాయా?

బెజవాడలో పనిగా ముష్టివాళ్ళని చరకాతో బెదిరించి పంపేవాళ్ళం, నేనూ, షే.

ఒక experiment సంగతి చెపుతాను.

వొంటినిండా రోగం పట్టిన ముష్టి అతన్ని చూసి జాలిపడి, ఒకరు తీసుకుపోయి భోజనం పెట్టి, మందిప్పించి బాగుచేశారు. కొన్ని నెలలు పట్టింది. మంచి బలంగల మనిషై, వూరంబడి తిరుగుతున్నాడు. భోజనానికి మాత్రం వొస్తున్నాడు. ఈ దాతలకి అది అన్యాయంగా కనపడి, 'నీ జబ్బు నయమయింది. ఇంక వెళ్లరాదా?' అన్నారు. అతను 'చాలా బాగా నేవుంది. ఇదివరకు నారోగాన్ని చూసి జాలిపడి; డబ్బులు పారేశేవారు. ఇప్పుడు ఎట్లా బతకను?' అన్నాడు.

నే నెరిగిన Huge Joke అది.

వృత్త సరదాలేని సుఖంలో బతకడమే చాతనైతే ఎన్నడో శాంతిలో స్థిరపడిపోయివుండును మానవ జీవితం.

వీళ్ళందర్నీ తన్ని పనిలో ప్రవేశపెడతామంటారు, కమ్యూనిస్టులు. అవును, తంతోనే వుండాలి. ఎన్నాళ్లు వూరుకుంటుంది, తన్నులకి భయపడుతో మానవ స్వభావం? బాంబులకి, మెషీను గన్‌లకి ఎదురుతిరిగే మానవప్రాధ్బలం?

లోకంలోని గొప్ప thinkers యీనాడు చెప్పేదంతా విమర్శించి చూస్తే, ముందు యుగాల సుఖాన్ని కలలుకనే కవుల గానాల్ని వింటే...ప్రతివారి ఆశలూ, పద్ధతులూ, ఏదోవిధంగా ఈసంగతినే సూచిస్తున్నాయి. ఈ దాచుకోడం, తనదిగా చేసుకోడం పోయి—సమస్తజనులకూ సమానమైనస్థితి రావాలని ఆ వొక్కకలే. ఆశేమిగిలింది క్షోభపడే యీ ప్రపంచానికి. కాని యీ philosophers and poets, కమ్యూనిస్టులకన్న దూరం చూడగలరు, చూడలేకండా వుండలేరు. అందువల్లనే చాలామంది కవులు, రాతగాళ్ళూ ప్రస్తుతపు కమ్యూనిస్టులకి నిస్పృహ కలిగిస్తున్నారు, విరోధులౌతున్నారు. 'అన్నీపంచేస్తాం ఇంకేం కావాలి?' అంటే... 'ఇంకేం కావాలి' 'ఏం కావాలి?' అని గొణుక్కొని వెతుక్కొంటున్నాడు కవి.

టాగూరు కలలు, సౌందర్యాన్వేషణ, సమన్వయ ప్రయత్నం యీనాటి యువక వీరులకి వృత్తపనికిరాని మూలుగు ఐ పోయింది. క్రిష్ణశాస్త్రి బాధ వృత్త ఉన్మాదంలాగు కనపడుతోంది. అక్క విరహం చెల్లెలికి నవ్వులాట.

ఈనాటికి కాకపోయినా, మీమనో నేత్రం తెరుచుకునే నాటికైనా, ఎప్పటికో జన్మలుంటే, ఎన్నిజన్మలకో, కృష్ణశాస్త్రి యీనాడు పడుతున్న శృంగార బాధ, సంకుచితత్వాన్ని దాటి వ్యాపించాలని పడే వేదన — మీరు మాత్రం తప్పించుకోగలరా? ఆనాటి మీ చీకటి అన్వేషణకి తోవలో వెలుగు వెయ్యాలని ప్రయత్నం "శాస్త్రిగారి 'ప్రవాసానికి అర్థం. "రండి, తీరాన్నించి దూకండి. మీరూ, నేనూ, ప్రతివారూ తప్పదు—ఆతీరానికి ప్రయాణం ఈచీకటి కెరటాలని చూసి భయపడకండి. బాధే! నా బాధ చూడండి. కాని ఎట్లానూ తప్పని ప్రయాణానికీ జంకకండి—ఆలస్యం చెయ్యకండి—ఆతీరాన నించి వీణాగానం వినపడటం లేదా? మీ రొదమాని, మీ రూపాయలూ, దస్తావేజుల ఆస్తుల పంపకాలూ, తగాదాల శబ్దం తగ్గిస్తే — వినపడుతుంది. నేను వింటున్నాను. మీరు హృదయంలో నిశ్శబ్దంగా ఐనారా—" అంటున్నారు కవులు, టాగూరు, శాస్త్రి.

"మనిషి అన్యాయం చేస్తున్నా సరే, పాపం చేస్తున్నా సరే, చిన్న పసిపిల్లలాగు అల్లరీ, హింసా చేస్తున్నాసరే, బలవంతాన ఆపడంవల్ల ఏప్రయోజనము లేదు. ఓకుర్రాడు, తమ్ముడికి యివ్వక తానే అంతా దాచుకుంటే అన్యాయమని రెండో అతనికి పంచేట్టు చేస్తే, అతనిలో, ఆ పంచడానికి విరోధాలైన అంతరోద్రేకాల్ని రేపుతున్నామని సైకాలజీ చెపుతోంది. కనక అవసరం కొద్దీ మనం బలవంతాన ఇప్పించినా, కుర్రాడి మనస్సులో న్యాయాన్నీ, సానుభూతినీ, ప్రేమనీ, కలిగించే మార్గాలు అన్వేషించాలి.

ప్రజలందరూ సమానులనే భావాన్ని, might is right అనే దాంటో ఘోరాన్ని ప్రచారం చెయ్యాలని అనేకవిధాల చూశాయి అన్నిమతాలూ. కాని

లోకంలో మతాల influence బాగా తగ్గి, నమ్మకాలు శూన్యాలై, బాధపడే వాళ్ళ కష్టాలే గమనించడం మానారు ప్రజలు. ప్రభుత్వాలు దయతలిచి, లేక పోతే భయంతో policy కింద, బీదలకి పారేసే చచ్చు conveniences తప్ప.

ఎన్నాళ్ళు ఇట్లా? అంటాడు యీ ఘోరం చూస్తున్న మనిషి. కాని అంతకన్న ఇంకేమిటి? ఏంచెయ్యాలి? నువ్వు చెప్పే బలవంతపు పంపకం ఇంతకన్న ఘోరం అంటాడు దూరదృష్టిగల జ్ఞాని.

వసంత్ చీమల్ని నలుపుతున్నాడు-రెండేళ్ల వాడు.

"ఆదేమిట్రా అట్లా చూస్తో వూరుకుంటావు?" అన్నాడు సుబ్రమణ్యం.

"చెప్పి చూడు" అన్నాను నేను.

"చెప్పడ మేమిటి? రెండు తన్ని ఇవతలకి లాగక!" అన్నాడు.

"నేను లాగను. నిన్ను లాగనీను" అన్నాను.

ఈ చీమల్ని రక్షిస్తావు. కాని అతని ఎన్నోఏళ్ళ బతుకుతాడు. నీ అధికారంలో వుండడు త్వరలోనే. నువ్వు గోజిల్లా చూస్తో కూచోవు. ఎట్లా ఆపగలవు? తంతే అతనికి తెలిసేదల్లా, వీళ్లు చూసేపుడు చీమల్ని చంపకూడదు, వీళ్ళ అధికారంలో వున్నన్నాళ్ళూ! ఈ కాసిని చీమలమీద దయవల్ల..."

అట్లానే యీనాడు బలవంతాన పంచినా, మానవజీవితం—ఎన్నియుగాలు-అంటాడు కవి. మానవుడు మారంది.

"కాని యీనాడు నేను..."

"అవును. కాని యీ బలవంతంవల్ల—జనించే అగ్నులు...ఎన్ని యుగాలవరకు..." అంటో మానంలోకి పోతాడు కవి.

రష్యా వెళ్ళివొచ్చి హారీన్ "పిట్లాగు-ఏబాధలూ, గొడవలూ లేకండా బతుకుతున్నారు మనుషులు" అన్నాడు గొప్ప enthusiasm తో.

"కాని పిట్టల్లాగు మనుషులు బతకగలిగితే, పిట్టలు మనుషుల్లోకి పరిణామం చెందివుండవు. పిట్టనిచూసి సంతోషించగలం, ఈర్ష్యపడగలం, కాని పిట్టలుగా యెన్నడూ బతకలేము—ముఖ్యం నేనుగాని, హారీన్ గాని."

"కళ ఉద్దేశ్యమేమిటి ఐతే?" అని అడుగుతున్నాడు వసంత్.

కళ ఉద్దేశ్యం అందాన్ని కల్పించడం, అన్నాను నేను

అందం ఎందుకు? అనే ప్రశ్నకి అర్థంలేదు. అందం ఉపయోగపడాలి అనడం మూర్ఖం. ఉపయోగపడకండా అందం ఎన్నడూ ఉండదు-ఎందుకంటే తన ఆనందోపయోగంకోసం మనసు చూసేదే అందం కనక. కాని ఏదో ఒక ఉద్దేశ్యం మనసులో పెట్టుకుని దానికి ఉపయోగపడేట్టు అందాన్ని కల్పించాలంటే, ఆ కల్పన అందమూ కాదు, కళా కాదు. అది కళ అయిందా నువ్వు తలుచుకున్న ఉపయోగాన్ని దాటి తన స్వంత ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకుంటుంది ఆ అందం.

కళకి ఉద్దేశ్యం వుండాలి, ప్రజాసేవ చెయ్యాలి. అని ఆందోళన పడిన కొద్దీ అందానికి దూరమౌతున్నారు రచయితలు. దూరమేకాదు. విరోధులౌతున్నారు. ప్రజలలో ప్రతివారికీ అవసరపడని కళ నిష్ఫలమనేవాళ్ళు—వొడ్డున తగిలే యీ అలలు గాక, తక్కిన సముద్రమంతా అనవసరమన్నట్టుంటుంది. ఈ చిన్న అలలు తప్ప ఏదీ తెలుసుకోలేని మనుషులు ఏనాటికో

ఎదిగి రెక్కలు జాచినప్పుడు సంతుష్టికై వేచి వుండవొద్దా సముద్రం? పత్రికలలో పడే కథలూ, బొమ్మలూ, తప్ప తక్కిన చిత్రాలూ, గ్రంథాలూ, సినీమా పాటలు తప్ప తక్కిన సంగీతమూ లేకండాపోయిన లోకాన్ని ఆలోచించుకోండి. అవీ ప్రతిమనిషినీ రంజింపచేసేవి. తక్కిన Art అంతా కొంచెమో గొప్పో exclusive. అందుకని అనవసరం–ఆ ప్రజాసామాన్యానికి.

కాని యీ అందం అనవసరమంటో వ్రాసే కవిత్వంలో శ్రీశ్రీ పోకడలెందుకు, కథలలో చలం పదజాలమెందుకు?

జీవితమంటేనే అందం. గడ్డిపోచనించి, పురుగునించి, కొత్తఅందాలు అన్వేషించుకుంటో పరిణామం చెందావు. లోకం జన్మజన్మల్లోంచి పెంచుకుంది నిన్ను తన అందాలు చూడగల ప్రియుడిగా ఎదిగేందుకు?

బీదలయెడల, కష్టులయెడల సానుభూతి, దయ, ఏకత్వం, ఇంత ఆకర్షణని ఎందుకు పొందాయి – అవి అందమైన ప్రోత్సాహలు గనక. అవి ఆత్మనే అందంతో నింపుతాయి గనక. అవన్నీ ఉత్తమాటలుగాక నీ హృదయంలో నిజమైన ప్రోత్సాహాలే ఐతే, అందం నీకెన్నడూ విరోధకాదు. పైకి ఆ మాటలు మాట్లాడినా, లోపల దేని మీదనో ద్వేషమో, జెలసీ ఓ, నిన్ను బాధిస్తోవుండడంచాతనే, నీఆత్మ అందవికారం కావడంచాతనే, అందం నీకు అనవసరంగా తోస్తోంది.

ప్రచారకులు అందాన్ని ద్వేషించడం చాలా sensible thing. సృష్టిశక్తుల్ని తను వుపయోగించుకోవాలని చూసిన మానవుణ్ణి, ఆశక్తులు తమకి బానిసని చేసుకున్నట్టే, అందాన్ని ఉపయోగించుకుని, సాధిద్దామని బైలుదేరావా, నిప్పుని కొంగున కట్టుకుంటున్నావు! నీప్రచారం మనసునించి తొలిగిన నిమిషాన, నువ్వు సాధనగా తెచ్చుకున్న అందం స్థిరమైనిలిచి, నీ ప్రచారాన్నిమించినసత్యాలకి నీ ఆరాధకుడికళ్లు విప్పుతుంది. టాగురు గీతాలవంటి ఔన్నత్యానికి అందానికి సహాయంగా రవీంద్రనాద్ టాగూర్ చిత్రాలుగీస్తే, టాగూరుగీతాలు అందర్నీ దాటి, మించి, మింగి, ఏ లోకాలకో తీసుకువెడుతుంది ఆ చిత్రపు సౌందర్య సందేశం.

ఇతరుల హృదయాల గడపతొక్కగలవా అందాన్ని వెంటతీసుకువెళ్లందే?

“ఆకలి, ఆకలి”, అని వూరికే వ్రాయరేం? పద్యాలూ, కథలూ, ఘనమైన పదాలూ, రూపకాలంకారాలూ, అనేటప్పటికి అందాన్ని ఎరువుతెచ్చుకుంటున్నారు మీ ప్రచారంకోసం. కాని అందం మనుష్యసాధారణ స్వభావాలకన్న శక్తివంతం, ఉజ్వలం, లోకాన్ని నింపే విద్యుచ్ఛక్తికన్న శక్తివంతం. అందాన్నిగ్రహిస్తో, అందాన్ని వుపయోగించుకోడం, ప్రస్తుతనాగరికత కూడదని చెప్పడానికి వార్తాపత్రికల్ని గాంధిగారు వుపయోగించడంలాగు వుంటుంది. మీకువుపయోగపడే యీ అల్పసుందరాణువులే ఇంత శక్తివంతములైతే, అసలు సౌందర్యం దివ్యతేజస్సు ముందు మీరూ మీప్రచారం ఎంత అల్పమో వూహించుకోలేరా?

లోకం క్షోభిల్లుతూవుంటే, లక్షలు ఆకలితో చస్తోవుంటే, ఏదో అర్థంలేని హృదయబాధా, ప్రణయగాథా వ్రాస్తావా, కవీ! ఎవరికోసం, ఇదంతా! అంటారు. ఇంతక్షోభ ప్రపంచంలో



"నేను ఇంటికిపోగానే నా పెళ్లాం వచ్చి అమాంతం కావిలించుకుంటుంది!"

"అంత ప్రేమా?"

"కాదు, అనుమానం!"

---

జరుగుతోవుంటే, కోవెల పాడుతోంది, చల్లనిగాలి వీస్తోంది, చిన్నపిల్ల గంతు లేస్తోంది, కుక్క తోకఆడిస్తోంది. తన బాధనీ, సంతోషాన్నీ కవి పాడుతున్నాడు—తనబాధనీ,సంతోషాన్ని గుర్తించగలవారికోసం. బాధలేనివాళ్లందరూ కూడా మూలిగితే బాధలు తప్పతాయా? ఆకలితీరితేమాత్రం, చావులు, రోగాలు, భూకంపాలు, తప్పతాయా? పువ్వులు ఎండిపోవడం, రంగులు పోవడం, ముసలితనం తప్పతాయా? ఇంక నవ్వే దెప్పుడు? కవిని పాడవొద్దను, దయామయా, నీకాఫీ, నీప్రియురాలు, నీపిల్లలు, నీబట్టలు - నీనవ్వులు, నీఅపశ్రుతి కూనిరాగాలు మానావా నువ్వు!

ఈభూమిలో ఓమూల కొన్నిప్రాణులు ఆకలితో క్షోభపడుతున్నది మాత్రమే నీకళ్లబడుతోవుంటే, ఏ స్త్రీలోపిల్లలో నిరంకశపు మూర్ఖంకింద నలగడమే చలం కళ్లపడుతోవుంటే, కవికంటికి, యీపుష్టి ఆనందనాట్యం, గడ్డిలో, అలలమీద, యీనక్షత్రాల వెలుగు వొణుకులో, యీ చావుపుట్టుకల జీవనోద్రేకంలో, నీ బాధలకన్న అపరిమితంగా ఈ క్షోభలనన్నిటినీ మింగేస్తో సమస్త ఆకాశాన్ని నింపుతో ప్రత్యక్షమౌతోంది కవి కళ్లముందు. అదీ అతనిపాట.

నేనూ లీలగారు కర్నాటకసంగీతపు వకాల్తా పుచ్చుకున్నాము. సౌరిస్ బెంగాలీ సంగీతానికి, వసంత్ హిందూస్తానీకి. వాదించామన్నమాటేగాని, యీ అందాలు అనుభవించడంలో ఇన్నేళ్ల influence, prejudices నించి తప్పించుకోడం చాలకష్టమనీ, పసితనంలోని అనుభవాలబలం చాలా గొప్పదనేనమ్మకం నావాదనకి బలహీనం చేస్తోంది. భద్రంగా ఇతరుల అభిప్రాయభావాల నించి, (తలితండ్రుల విముఖంగా) తప్పించిపెరిగిన, షే, వసంత్ tastesకి వుండే స్వేచ్ఛా, వాస్తవమూ, మాఇద్దరికీ ఎట్లా వొస్తాయి?

# హోటలు పరిచయుడు

కె. కుటుంబరావు

నేనూ, నాదెళ్లా, మద్దూరీ, పంచాంగమూ ఆఆరవహోటల్లో భోంచేస్తూ ఉండేవాళ్ళం. పంచాంగంమటుకు హోటల్లోనే గది తీసుకుని ఉండేవాడు. మా ఆదివారాలూ శలవ రోజులూ అక్కడే గడిచిపోతూండేవి. కారణమేమంటే హోటలుకుర్రాణ్ణి కేకేసినప్పుడల్లా కావలిసిన కాఫీ పట్టుకొస్తూండేవాడు. వెళ్లేటప్పుడు తలా ఒక అణా బేడా వాడిచేతిలో పెట్టేవాళ్లం. కాఫీ ఖర్చుమటుకు పంచాంగంవాడి ఖాతాలో పడేది.

అదే ముఖ్యమైనవిషయం. ఆ రోజుల్లో మేం ఆవిధంగా జీవించేవాళ్లం — సాధ్యమైనంతవరకు మాఖర్చు మరెవడిమీదనైనా వేస్తూ. అదేమామూలు మనుష్యులుచేస్తే అది నీచత్వం అనిపించుకోవచ్చు. మరేమన్నా అనిపించుకోవచ్చు. కాని మాకది ఒక జీవితలక్ష్యం, ఒక పరమార్థం. ఆవిధంగా జీవించి డబ్బులు వెనకేసి కొంపలు కట్టిద్దామని కాదు. అందులో నిజంగా పైకి కనిపించేటంత తప్పేమీ లేదు. అందరూ ఆ విధంగా జీవించటం మొదలుపెడితే లేనివాడికూడా కలవాడితోపాటు జీవించేఅవకాశం వొస్తుందని మాకో గట్టివిశ్వాసం. అట్లా జీవించటంవల్ల మనుషులమధ్య సాంఘిక సంపర్కం జాస్తిఅవుతుందని మాకో నమ్మకం కూడా ఉండేది...ఒకవేళ అటువంటి ప్రవర్తనలో ఏమాత్రం తప్పుగాని ఉంటే, అప్రయత్నంగా అందరూ చెయ్యటానికి ప్రయత్నించే పనేగనక, అటువంటివి ప్రయత్నపూర్వకంగా సిద్ధాంతరీత్యా చెయ్యటంవల్ల దానికి కొంత సంస్కారం ఆపాదించుకుంటుందని మా ఆశ.

నిజానికి జీవితంలోగాని మనుషుల్లోగాని మంచిఅంటూ ఆటేఉందనే నమ్మకం మాలో ఎవరికీ లేదు. పెళ్లిళ్ళలో అల్లుళ్లు అలగటంలోనూ, ఆడబిడ్డలు అన్నదమ్ముల దగ్గర్నుంచి వస్తువాహనాలు రాబట్టుకోవటంలోనూ, అక్కరలయినప్పుడు చుట్టపక్కాలొచ్చిపడి తిని కొంచెంలోటొస్తే చెడతిట్టిపోవటంలోనూ మాకేమీ సంస్కారం కనిపించలేదు. కాని సంఘములో అటువంటివి ఉంటూనేఉన్నై. మాలో మేం సినిమాకెళ్లాలనుకున్నా, కాఫీహోటలుకెళ్దామనుకున్నా ఎవడోఒకడికి జరిమానా విధించటంలో అంతకన్న ఎక్కువ సంస్కారమేఉన్నట్టు కనిపించింది. లేనివాడిదగ్గర డబ్బు ఎట్లాగూ వసూలు చెయ్యలేం. ఇవాళ ఫైను చెల్లించుకున్నవాడు రేపు తనవంతు వచ్చినప్పుడు మరొకడిచేత చెల్లింపజేస్తాడు. కేవలమూ సాంస్కారికమైన ఒత్తిడేకాని సాంఘికమైన ఒత్తిడికాదు. ఫైను వేసుకునేతాహతు ఉండికూడా స్వార్థంకొద్దీ తప్పించుకోజూసినవాడు మా సాంగ



"ఏమోయి నాలుగురోజుల్లో ఇస్తానని పదిరూపాయలు తీసుకుంటివి. ఇంకా ఇవ్వలేదేం?"

"ఆగవోయ్ తొందరేముంది! నీకంటే ముందిచ్చినవాళ్లు చాలామంది ఉన్నారు."

త్యానికి దూరమైపోతాడు! వాడి కదే శిక్ష!

మమ్మల్ని చూసి చాలామంది భయపడేవాళ్లు. మాకు రాబందులనీ, తోడేళ్ళనీ, అప్పులవాళ్ళనీ, బాకీదార్లనీ ఇంగ్లీషులోనూ తెలుగులోనూకూడా నామకరణంచేశారు. ఆ నామకరణాలన్నీ మేం బిరుదులకింద స్వీకరించాం. మేం చాలా ఘనులమని అనుకునేవాళ్లం.

ఈ సిద్ధాంతం మా తలకాయల్లో క్రమక్రమంగా ఒకస్వరూపం దాల్చింది. దీనికి ఆ స్వరూపం ఇవ్వటానికి బుర్రతో విశేషంగా పనిచేసినవాణ్ణి నేనే. అయితే మిగిలినముగ్గురూ సంపూర్ణంగా ఆమోదించారు. ఆవిధంగా అది మా ఉమ్మడి సిద్ధాంతమయింది.

* * *

ఆ హోటలుకు ఒక కొత్తమనిషి రాసాగాడు. అతను తెలుగువాడని తెలుస్తూనేఉంది. కాని, నలుగురం సాటివాళ్ళం గట్టిగా మాతృభాషలో అరుస్తూ, వడ్డించేవాళ్ళకి తెలుగు నేర్పుతూ సందడిగా భోంచేస్తున్నాకూడా, అతను మాకేసి చూడనైనా లేదు. పొడిఅరవం ముక్కల్తో పని కానిచ్చుకుని భోంచెయ్యసాగాడు.

అతను భోంచేసేవైఖరిచూస్తే మాకు చాలా "బూర్జువా" గా కనిపించింది. (ఆ రోజుల్లో మా సిద్ధాంతాలకు భిన్నంగా ఉన్నదల్లా మాకు బూర్జువాగా కనిపించేది.) అతను భోంచేస్తూ నెయ్యి వడ్డించేటప్పుడు చాలునన్నేవాడు. వడ్డించేవాడు వేసేదే రెండుగరిటెలు. ఎక్కువ కావలిసినా ఎక్స్ట్రా ఇస్తే తప్ప ఒక్కచుక్కయినా రాల్చడు. అది అందరికీ తెలుసు. అటువంటప్పుడు చాలునని చెయ్యి విస్తరి కడ్డంపెట్టటం బూర్జువా కాదూ? పైగా ఒకరోజా, రెండురోజులా? రోజూ, రెండుపూట్లా ఇదేవరస. అతను అత్తవారింట అల్లుడులాగా భోజనంచేస్తుంటే అతని "మర్యాద" చూసి మొదట మాకు పళ్ళాళ్ళంగా ఉండేది. అది రానురాను తృణీకారభావం కిందికి మారింది.

"వీడికి ఫైను వెయ్యాలిసిందేరా!" అన్నాడు మద్దూరి.

"ముందు వీడిపరిచయం చేసుకుందాం పట్టండి"; అన్నాడు నాదెళ్ల.

ఓరాత్రి భోజనానంతరం అతన్ని పలకరించి పంచాంగంవాడిగదికి తీసుకు పోయి అక్కడ అతని ఆరాకొంత తీశాం. అతనిమాటల తీరులోకూడా ఆ మర్యాదా లోభత్వం కనిపించింది. మాఅందరిదగ్గరా తలా కాస్తాగారవమూ సంపాదించి చంకన పెట్టుకు పోదామని అతని ఉద్దేశం! ఫైను తప్పక వెయ్యాలిసిందే.

ఆ పూటకి అతనిచేత కిల్లీలూ సిగరెట్లూ కొనిపించి ఫైను వేశాం. తీరా చూస్తే అతను కిల్లీ వెయ్యడు, సిగిరెట్టు ముట్టడు, కాని ఫైను చెల్లించాడు—సంతోషంతోనే.

"మాపద్ధతులు మీకు కాస్తవిపరీతంగా తోస్తాయేమో. కాని ఎరిగిన వాళ్లకి ఫైనువెయ్యటం మేము తప్పుగా భావించం. మమ్మల్ని మీరుకూడా వెయ్యొచ్చు. ఉన్నవాడూ లేనివాడూ దాదాపు ఒకేవిధంగా బతకటానికిది మంచిపద్ధతని మేం తేల్చుకున్నాం," అన్నాడు నాదెళ్ళ.

"మీరు మార్క్సు పుస్తకాలు చదివారా ఏం?" అన్నాడతను.

మా సంస్కారమంతా మంటగలిపి మమ్మల్ని కాగ్రేడ్లక్రింద జమకడుతున్నందుకు మాకు కోపంవచ్చింది.

"మేమట్టివంటి చెత్త చదవం. మీరు చదవకండి" అన్నాం.

"మీరొకవేళ సోషలిస్టులేమో అనుకున్నాను" అన్నాడతను.

"ఎంతమాట! కావలిస్తే మాది కల్చరల్ కమ్యూనిజం అనండి," అన్నాం.

"మీ కల్చరల్ కమ్యూనిజం డబ్బుతోకూడి ఉన్నట్లు కనిపిస్తుంది?" అన్నాడతను.

"డబ్బుకు మేం తక్కువ స్థానం ఇస్తాం. సంస్కారం ముందొస్తుంది."

"అదావిషయం?...మంచిది, సెలవు. మళ్ళీకలుస్తాను."

* * *

ఆరోజు లగాయతు అతనికి ఫైనులు తగిలిస్తూవచ్చాం. అతనెక్కడా వెనకాడలేదు. కాని అతను మాకు ఫైను వేసినపాపాన పోలేదు. మానలుగురిలో ఒకరికొకరు ఫైనలు వేసుకోవటం చాలా తగ్గిపోయింది. అందరిదగ్గిరా డబ్బు కనిపిస్తున్నది-ఏడోతారీకు దాటినతరువాత కూడా.

ఎప్పుడన్నా దారితప్పి మాలోమేం ఏ సినిమా ప్రోగ్రాంగాని పెట్టుకున్నప్పుడు మాకొత్తస్నేహితుణ్ణి పిలవాలనే ఆలోచన మాకుకలిగేదికాదు.

నాసిద్ధాంతానికి అపాయం కలుగుతున్నట్టు కనిపించి నేనేకొంచెంసణుగ సాగాను. అతన్నికూడా మా వెంట పిలవటం సంస్కారరీత్యా అవసరంగా కనిపించింది.

"ఎందుకులేరా? పోనిస్తూ! వెధవ సినిమాకు అతను కావాలంటే పోలేడా? డబ్బున్నవాడల్లేనే ఉన్నాడులే. ఎందుకొచ్చినఖర్చు? సిగిరెట్లన్నా తగలెయ్యొచ్చు," అన్నారు నాతోటిసంస్కార్లు. నాకుమండిపోయి "మనం సోషలిస్టులమా?" అని అడిగాను.

"ఎంతమాత్రమూ కాము. అయితే మటుకు డబ్బువృధాగా తగలెయ్యాలా ఏమిటి?" అన్నారు వాళ్ళు.

నేనారోజు వాళ్లవెంట సినిమాకు వెళ్ళలేదు.

"మరో తొమ్మిదణాలు ఆదా!" అన్నారు వాళ్లు నామొహానే!

* * *




నేను చాటుగా మా హోటలు స్నేహితుడితో పరిచయం ప్రారంభించాను.

"మీరుమాకోసం డబ్బెందుకు ఖర్చు చేస్తున్నారు? మేం డబ్బుకోసం మీ వెంటపడటంలేదని మీకెట్లా తెలుసు?" అన్నా నొకసారి.

"డబ్బుకోసమే నా వెంట పడుతున్నారు. కాదని నేనెన్నడూ అనుకోలేదే," అన్నా డతను.

నాకు కోపంవచ్చింది. కాని దాన్ని ప్రకటించేటందుకు నాకర్హత ఉన్నట్లు కనిపించలేదు.

"అయితే మరెందుకు ఖర్చు చేస్తున్నారు?"

"డబ్బుకోసం వెంటపడుతున్నారు గనక డబ్బిస్తున్నాను. డబ్బక్కర్లేని వాళ్లకి డబ్బిచ్చి ఏంలాభం?"

"డబ్బు అందరికీ ఇస్తారా? అంత డబ్బుందా మీదగ్గిర?"

"లేదు. కాని ముందుడబ్బిచ్చి తరవాత సంస్కారంకూడా ఇద్దామనే!"

"మాకు సంస్కారంలేదా?"

"అవసరమైన సంస్కారంలేదు."

"ఏమిటా సంస్కారం?"

"సంస్కారంకన్న డబ్బే ప్రధానమయిందనే జ్ఞానం. మీరు సంస్కారంకోసం దేవులాడుతూంటె మీ చేతికి డబ్బేదొరుకుతున్నది. మీ చేత డబ్బుకోసం దేవులాట ఆరంభింపచేసి సం

సంస్కారం ఇప్పింతామని నాకు ఆలోచనకలిగింది."

నా కనుమానంవేసింది.

"మీరు మార్క్సు పుస్తకాలుగాని చదవలేదు గదా?"

"కొద్దిగా చదివాను."

"సోషలిస్టే?"

"కొంతవరకు"

హతాశుణ్ణయిపోయినాను.

"మాచేత ఏం చేయింతామని మీ ఉద్దేశం?"

"పొలం దున్నింతామని"

"పొలం దున్నించటమే? ఎక్కడ?"

"భద్రాచలందగ్గిర. నూరెకరాలు కొన్నాను, అక్కడి మనుషుల్ని పెట్టి అంతా నేనే చేయించగలను. కాని ఇక్కడ డబ్బుకోసం అగచాట్లుపడే చదువుకున్నవాళ్ళని పట్టుకెళ్ళి వాళ్ళు చేయగలిగినంత భూమి ఇచ్చేసి ఒక కాలనీ ఏర్పరచాలనుకున్నాను. హాయిగా తిన్నది అరిగేట్లు పనిచేసుకోవచ్చు. కూలీలతో సరిసమానంగా జీవించవచ్చు. వాళ్ళకి సంస్కారం ఇవ్వొచ్చు. వాళ్ళుకూడా మనంతవాళ్ళుగా పరిణమిస్తుంటే ఆపరిణామం చూసి ఆనందించవచ్చు. వాళ్ళని మనం దోచుకుండా వుండే వాళ్ళు మనకన్నా సంపాదనల్లో ఎంతముందుకు పోతారో తెలుసుకోవచ్చు. ఇదంతా సంస్కారమూ, అనుభవమూ కాదా?" అన్నాడతను.

"అంతదూరంవెళ్ళి కాయకష్టంపడే కన్న ఇక్కడే తేలికఉద్యోగాలు సంపాదించి హాయిగా పుస్తకాలు చదువుకుంటే—" అని ప్రారంభించాను.

"తేరగా డబ్బొస్తుంటే సంస్కారం రాదు, గమనించే ఉంటారు. పుస్తకాలు ఎన్నటికీ అనుభవంకావు ... ఏమిటి, వస్తారా? మీస్నేహితుల కూడా చెప్పండి, ఆహ్వానించానని. కానీ పెట్టుబడిలేదు. చేసుకున్నంతభూమి ఇస్తాను. వాళ్ళకి డబ్బుమీద ఇష్టంలేకనా ఆహ్వానం రుచించకపోవచ్చు. అయినా చెప్పి చూడండి," అన్నాడు.

"చెబుతానులెండి ... నామటుకు నేను... ఇంకా కనీసం రెండేళ్ళవరకూ ఇంటిపట్టున ఉండి—ఏదీ?—" అన్నాను.

"మీయిష్టం," అన్నాడతను.

అంతే మళ్ళా నాకాగొడవే జ్ఞాపకంలేదు. ఇప్పుడిదంతా ఎందుకు జ్ఞాపకంవచ్చిందంటే ఈమధ్య నేను మద్దూరి వాడికి ఓ పాత్రిక పంపించరా అని రాస్తే లేదని సమాధానంరాసి ఆమర్నాడే కొత్తమేడకు పునాదితవ్వించటం మొదలుపెట్టాడు. నాహోటలు స్నేహితుడికన్నా రాద్దామంటే అతని పేరే జ్ఞాపకంలేదు. కాకపోయినా ఈమధ్యరోజుల్లో నాలుగెకరాలన్నా లేని నాబోటివాడికి మరీ ఇబ్బందిగా ఉంది. రెండెకరాలున్న వాళ్ళుకూడా గొప్పవాళ్ళయి కూర్చున్నారు మరీనూ!



# పెళ్ళాం బూసమ్మ



రేత్తిరి బువ్వల్దిని పొండుకునే యాలయింది. సలి రోజులు. ఎవు రుమటుకు పొండుకోక సేసే దేంది.

బూసమ్మ మొగుడు బసవయ్య సందేల బువదిని 'యిది గిప్పుడు రానంటే,' అని ఎల్లినోడు పొం డుకునే యాల సానాలెక్క మిగిలిపోయినా మల్లీ తిరిగిరాలా.

బుడ్డిదీపం ఎల్తుర్లో పక్కేసిన మంచమ్మీన, రావణాబ్బె వమ్మ వుద్యానకంలో సీతామ్మోరికిమల్లే, అటనే తలొంచు క్కూకుని ఇశార పడ్తుండది బూసమ్మ.

సందేల తలకు బోసుకుని, కల్లక్కాటిక మొగాన సుక్క తల్లో బంతిపూలు సలవకోక, సలవరెయిక, యియన్నీ ఆ యాల సలి ముదరక తలికే సేసి కూకుంది బూసమ్మ.

అప్పుడు పొరిగింటి లచ్చామ్మాయి ముక్కుమీన ఏలేసుకుని ఏమంది? 'యియ్యాల బూసమ్మను జూత్తే—యిగ బసవాయి మేం సెప్పిన మాటేం యిం టాడూ!' అనంది.

మరి ఎల్లిన మనిసి తిరిగి రాలా!

పొద్దుగూకినాక బసవయ్య యింటి కొచ్చి-వొచ్చిన మని సావజానే నిలబడి పోతే-"వుడుకు నీలు పోసుకుందువుదా." అనంది తను, నవుతా. "ఆఁ, నే బోసు కుంటాలే—నువ్వట నిలబళ్ళే-కోక తడు సుద్దేవోఁ—" అనంటంటే, యీపు రుద్దింది తను. మెల్దిరిగిన బసవయ్యోళ్ల గెట్టిగా అదుపుఁతా. బువదింటా, సుబ్బయకూతురు మాలచ్చి సందేలనే బంతి పూలు కడతంటే ఎత్తికెల్తాని ఏం సెతు రాడిందనుకుండా!" అని కుశాల మీ నంటే, "ఆఁ, యీ బోడ్డానికి మొగు డుండాడాడ! అల్ల బక్కదూడ మెల్లో సుట్టటానికా దీనికి పూలూ!" అన్నాడు. ఏదీ మా లచ్చన్నట్టు. "కాత్తె మంచం మ్మీన కూకో యీడ అయింది వత్తన్నా గాని." అంది, తను బువదింటం దొబు దొబున కానిత్తా. "ఆఁ కూకుంటాలే?" అంటా ఏందో ఎతుకుతుండాడు. "యాడి కన్నా ఎల్తావెట్టా? మొన్ననంగా కుప్పె యటం అయితే యింగా బయటి కెల్లా ల్చిన పనేందీ? నిన్న రేత్తిరీ పొద్దు బొయ్యొత్తివే." అంటన్నది తను. "ఆఁ, అంతేనా! యిప్పుడ్రానూ" అంటా సల్లగా ఎల్లిపొయ్యాడు బసవయ్య బూసమ్మ నిడిసి.

"గుబులు మడిసి! రానీ యియ్యాల ఏంవున్నా వుంటది." అనుకుంటుబువదిని లెగిసి, యాడసరదాల్చినవి ఆడాడ సరిది, మంచమ్మీనకొచ్చి కూచుంది బూసమ్మ.

"రేత్తిళ్లు బయిట పనేందంటా యీ మడ్సికీ? ఆడ బజార్లో ఎవురుంటారు యీన్ని పలకరించటానికీ? సలిబుట్టి సత్తంటే! నిన్నరేత్తిరి యాడికెల్లాడో! కూకునికూకుని నిదరొచ్చే. పొద్దు బొయ్యొచ్చి పొండుకుండాడు గావాఁల-నిధరమయికంలో ఏం తెల్చుద్దీ-అంధికే యీ మడిసింజూత్తే రగిలేది. యియ్యాల అట్టగాదులే."

సల్లగా తలగడకింద అద్దాందీసిసూసుకుంటా ఆలోసిత్తా పొండుకుంది........

పదాలు పాడా లనిపిచ్చింది బూసమ్మకు, లచ్మాయన్న మాటలు గెపితికొచ్చి, యింటికప్పుకల్లి సూసింది బూసమ్మ. యానాదోళ్ళ నాటకంలో సెంచులచ్మి అగుపించింది బూసమ్మకు. "సెట్టూలెక్కగలవా నరహరి పుట్టాలెక్కగలవా నరహరి"—లెగిసి నిటారుగా కూకుంది బూసమ్మ, మంత్రకట్టుమీన లెగిసి నోరికి మల్లే........"నిన్న లచ్మాయి ఏమందీ?" తూ సిత్తకార్తి సచ్చినోళ్ళూ. పొద్దు వాలిందంటే చరి, సెంబుల్దీసుకు తయారుగుంటారు సోమాదికాడ." అనంది. యిమానికం రెక్కల మీన కూకున్నట్టయింది బూసమ్మకు. పానందీసి యీ మడ్సికి-ఆడకేం గుబులు మల్లలేదు గందా....సోమాదికాడి కెల్లావంటే కాడిరుగుద్దని నిన్న రత్తయ్య కూతుర్ని బాత్తుండాడు—ఏవిఁటికో!....

లెగిసి సల్లగా తలుపుదెరిసి సూసింది బూసమ్మ. ఎన్నెల తెల్లగావుంది....రత్తయ్యింటో సలీసప్పిళ్ళేదు...."రత్తయ్య కూతురింటో వుండదా?" .... ఎనిక్కిదిరిగి సూసింది బూసమ్మ. కాలీమంచం అగుపించింది. మల్లీ ముంగలకు సూసింది బూసమ్మ శాసవిడుత్తా. వూరెలపల సోమాదికాడ సెట్టకింద దిబ్బలమీన, ఎవురో సేతులు గలిపి ఎగుర్తుండట్టు-గలక్కుమంది బూసమ్మకు-యిక ఆడగూతురు బూసమ్మ నిల్సుద్దా—యిల్లు తాలం ఎయదు, దార్లో ఒంటరాడగూతుర్ని నిలేత్తారని తెలవదు, కుక్కలు బఁయ్ మంటయ్యనిపీదు, సల్లని ఎన్నెట్లో తాసుపావుఁలు యంత్రపీత లెదు రొత్తయ్యని లెక్కలేదు,—బఁయిన అలివేలు మంగతాయారుకు మల్లే ఎల్లి సోమాది దిబ్బలమీన సెట్టకింద ఎలిసి నిలిసింది బూసమ్మ, బుసలిడుత్తా. దిబ్బమీన దిబ్బదిగువన, పొదలసాటున పొదల లోతున, సెట్టసాటున సెట్టమీనల, సుడిగుండాల్దిప్పి ఎదికి సూసింది బూసమ్మ. బసవయ్య కాన్రాడు. రత్తయ్య కూతురు కాన్రాదు....యిగ అటనే బూవిఁ కొరిగింది బూసమ్మ, గుండు దగిల్న దూడబాతుకు మల్లే.

అట్టాటి సలి-వానుకు పుట్టిచ్చుద్ది ఎవురికయినా. లెగిసి కూకుంది బూసమ్మ వానుకుతా. తెల్లటి సేలల్లో నల్లటి కుప్పలు—అఁ, ఏం దదీ!—

కాత్తె లెక్కనే బసవయ సేనూ పంటకుప్పా వుండయి. పంటకుప్ప కెదురుంగా సేనుగెట్టుమీన ఎవురో ముసుగేసు కూర్కునుండారు.

"ఎన్నెట్టో సేలగెట్టుమీన దెయ్యాలు కూకునుంటయ్యా?"

ఆ కూకుండ యిగ్రిహం తలకాడ ఏందో సిన్ననుప్పుకు మల్లే ఎలుగురుండది.

"ఏందవ్వా యిదీ—!"

గాలివాల్న ఏందో తుపుక్కుమని పిచ్చింది బూసమ్మకు.

"సుట్టకాలుత్తా కూకుండాడు ఆడ ఎవుడో—ఎవుడో ఏందీ అట్ట తుబుక్కున వూసేది"—పిట్టకు మల్లే లెగిసెల్లి యిగ్రిహం ఎనకవాలింది బూసమ్మ——"యిదిగో-?" అంటా యిగ అట్టనే నిలబడిపోయింది మాట సాక్క.

"ఆఁయ్-!" మంటా పల్టీగొట్టి నిలబడ్డాడు బసవయ్యా, బూసమ్మనుజూసి బేజారయిపోతా.

"ఏందీపనీ?" అడిగేసింది బూసమ్మ.

"యుద్దెం"— అన్నాడు బసవయ్యా.

"చివం బెరిగిం దెట్టా?" అంది బూసమ్మ.

"దొంగలు--" అన్నాడు బసవయ్యా.

"పొడిశారా?" రగిలింది బూసమ్మకు.

"గిరాకి గదంటే-" సెబుతున్నాడు బసవయ్యా.

"గిరా కేందీ-?" పానీలే సెపుమంది బూసమ్మ.

"వొడ్డు-" సెబుతున్నాడు బసవయ్యా.

"వొ డ్డేందీ?" ఏందీ సెప్పే దంది బూసమ్మ.

"యుద్దెంలో ఒడ్డుకరిగే లెక్కన కూడుదింటావెట్టా—" దిదబబమన్నాడు బసవయ్యా.

"అయితే నూ అనేదేందీ?" అంది బూసమ్మ.

"పంట మాలావుపంట పండే-కుప్ప సూద్దా మనొత్తినీ-" అంటన్నాడు బసవయ్య".

"వొచ్చి అబనే కూకుండావేం?" అంది.


"నువొత్తావని వోడు కలగన్నాడూ!" అన్నాడు.

"ఎల్దాం పద."

"కాదన్నానా."

బూసమ్మ పెనివిటి బసవయతో యిల్లు సుకంగా సేరింది.

—మా. గోఖలే.



# కాలేజీ ప్రపంచం



[ఈ శీర్షిక క్రింద కాలేజీ అనుభవాలు ప్రకటిస్తాము —సం.]

## సోషియలిజం

యం. రామలింగారెడ్డి

చాలా రోజుల మాట. అవి నా ప్రథమ కాలేజీ రోజులు. అప్పట్లో నేననుభవించిన దుర్భర మనక్షోభ 'నాశత్రువులక్కూడా వద్దు' అనిపించింది. అదొక పెద్ద మహాపట్నం. తెలిసినవాళ్లు లేరు. అంతా అయోమయంగా వుంది. కాలేజీ విడిచి వెళ్లిపోదామా అనిపించింది కూడా. అయినా కొత్తకొత్త విషయాలెన్నో నా అనుభవంలోకి వచ్చాయి. అర్ధశరీరం కనుపించే ఆ 'హైహీల్డు' యానలను చూచినప్పుడు, మావూళ్లో మేము అనుకొనే దొరసాన్లు వీరేనేమో అనిపించింది. అబ్బాయిలు చాలామంది ఇటూఅటూ తిరుగుతూ సమయం దొరికినప్పుడల్లా—పని నిజంగా వుండదు లెండి!—అమ్మాయిలతో మాట్లాడుతూ వుండేవాళ్లు. నాకు చాలా ఆశ్చర్యమూ, అనుమానమూ, దాంతో 'జెలసీ' కలుగుతూ వుండేవి. ఒక్కరైనా నాతో మాట్లాడి వుంటేనా, మా కాలేజీవంటిది ప్రపంచంలో ఎక్కడాలేదని ఆంధ్రదేశమంతా చాటించేవాణ్ణి. ఇంతకూ మన ఖర్మమిట్లా వుందని గుటకలు మ్రింగుతూ వుండేవాణ్ణి. ఇట్లాంటప్పుడు నాకెంతో హాయిని ఆనందాన్ని ఇచ్చిన 'కస్తూరి'ని గురించి ఎంతైనా చెప్పవలసివుంది.... అనాడు, ప్రథమ పరిచయమప్పుడు, హస్తస్పర్శ కావించేప్పుడుండే చేతినిఎంతగట్టిగా వత్తింది! అబ్బా. అదంతా అనుకుంటే ఇప్పుడు మళ్ళీ కస్తూరి నొకమారు చూడాలనిపిస్తుంది. మా స్నేహిత సీనులన్నీ ఒకటి వెంబడి ఒకటినా మెదడులో తిరిగిపోతూ వుంటాయి.

*

మా కాలేజిలో చాలాసంఘాలు వుంటూ వుండేవి. అవి అప్పుడప్పుడూ ఎక్కడికైనా వినోదార్థం బయలుదేరేవి. ఒకసారి ఒకసంఘంలో—పేరు ఎందుకులెండి!—సభ్యుడ నయ్యాను. అది హంపికి 'Camp' చేసినప్పుడు నాకెక్కడలేని సంతోషమయింది. ఎందుకంటే దానికి మా కాలేజీనుండే కాకుండా నానారకాల కాలేజీలనుండి నానా రకాలవాళ్లు తయారౌతారట. ఇంతకన్నా ఇంకేముకావాలి? బయలుదేరి వెళ్లాను.

పుష్పాలెక్కడున్నా భ్రమరాల్ను

ఆకర్షిస్తాయి. 'కొనచెరుగు తగిలితే చాలు' అనుకొనేవాళ్లకూడా లేకపోలేము మాలో.... ఆహార విహారాదులు ఆడంబరంగా జరుగుతూన్నాయి. ఎక్కడి వాళ్ళక్కడ బాతఖానికి కూర్చున్నారు. నాకేమొ మనసు అదోమాదిరిగా వుంది. అక్కడ నాతో మనసిచ్చి మాట్లాడే వాళ్లు ఒకరూ లేరు—రాజు తప్ప—రాజుకూడా వానికి దొరికినవాళ్ళతో షికార్లుకొడుతూ నామాటే మరచిపోయాడు. 'నా మొఖం చూచేవాళ్లు ఎవరు లేకపోయిరే' అని అనుకుంటూ లోపల్నే విచారపడ్డాను.

ఆ సాయంత్రం బాగా టాయిలెట్ చేసుకొని అటూఇటూ చూస్తూ అట్లా బయలుదేరాను. ఈ పాడుకండ్లు వూరికే వుండనే వుండవు. ప్రతిదాన్ని చూడాలనుకొంటాయి. ఆ ప్రక్కకు చూస్తిని గదా, వాడున్నాడే, ఆరాజూ, ఒక మాంచి పదారేళ్ళ పడుచుతో కబుర్లుకొట్టూ వున్నాడు. నాకొక పెద్దడైలమా వచ్చింది. కళ్లు ఒక పక్కకు కాళ్లు ఒకప్రక్కకు పెరుకుతున్నాయి. ఇంతలో "అరే, రామూ, ఇట్లారా" అన్నాడు రాజు చిరునవ్వుతో. నాకుమట్టుకు కొంచెం సిగ్గేసింది కాని మనస్సుమట్టుకు అక్కడికి పొమ్మని చెప్తూవుంది. రాజు ఇంకా నవ్వుతూనే వున్నాడు. ఆ అమ్మాయి ముఖంతట్టు అట్లా చూశానుకదా, ఆమెకూడా చేతిగుడ్డచాటున ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వుంది—హైస్కూల్లో నా క్లాసుమేటు విశాలాక్షికూడా అంతే, పాపం!—అయినా ఈకాలం స్త్రీలకు అందులో స్టూడెంట్సుకు అవసరంలేందే చేతిగుడ్డలు మూతికెక్కుతాయి. పనిలేకున్నా పయిట సర్దుకుంటూరు లెండి. వాళ్ళదగ్గరకు పోయాను. పరిసరాన్నంతా ఇటుఅటు పరిశీలించి చూశాను. ఒకప్రక్కన అనేకవందల సంవత్సరములక్రిందట తేజోవంతమై జగద్విఖ్యాతినొందిన ఆంధ్రశిల్పం నేటి శిధిలావస్థలోకూడా తన నగ్నసౌందర్యాన్ని నలుదిక్కుల వ్యాపింపచేస్తూ వుంది. మరొకవైపు సంధ్యారాగారుణ కాంతులతో మిళితమై మెల్లగా ప్రవహించే వాయుతరంగాలు రంగుల రంగులతో రంజిస్తూన్న ఆమె పయిటను ఇటూఅటూ కదిలిస్తూఉన్నై. ఆ పడుచునుచూస్తూ మైమరచిపోయాను. "ఈమెపేరు కస్తూరి." అని రాజు అన్నంతవరకు నా మనస్సంతా గగనవీధుల్లో సంచరిస్తూ వుండిపోయింది.... ....ఆమెను నాకు పరిచయంచేశాడు. ఏమేమో చెప్పాడు. ఆమె చాలా 'సోషియల్' మనిషట. అందరూ అట్లానే వుండాలని వాదిస్తుందట. అసలు 'సోషియల్' గా వుండటమంటే నాకు తెలిసేదేకాదు ఆ రోజుల్లో. ఏమయితేనేమి? నామనస్సుమట్టుకు చాల వుప్పొంగిపోయింది. చాలా ధన్యుణ్నయినాననుకున్నా. ఆమెకూడా చాలా సంతోషించానని చెప్పింది. మృదువై వెచ్చనైన ఆమె కరస్పర్శ నన్ను పూర్తిగా పరవశుణ్ణి చేసింది. అబ్బా! ఎట్లాచూసింది నాతట్టు ఆ సమయంలో! ఇదే నేమో 'సోషియల్' గా వుండటమంటే అనుకున్నా.

★

మ్యాగ్ "హాస్టర్ డే" దగ్గరకొస్తూవుంది. అనేకులు వాళ్ళవాళ్ళ స్నేహితుల్ని ఆహ్వానిస్తున్నారు. కొందరిని చూస్తే



నాకు చాలా విచిత్రంగా కనబడింది. తమకు సరిగా పరిచయం లేకున్నా ఒక్కొక్క గరల్ స్టూడెంటును నలుగురైదుగురు 'ఇన్వైటు' చేయడం, వాళ్లు రానంటే 'డిస్ అపాయింటు' కావడం. వారి ముఖం కందగడ్డలాగై పోయేది అట్లాంటప్పుడు. వీరికేమి గ్రహచార మొచ్చిందిరా అనుకునేవాణ్ణి. అప్పటికి నాస్నేహితుణ్ణి ఒకాయన్ను అడిభాను అదేమిటని. అదే 'సోషియల్'గా ఉండట మంటే, అన్నాడా మహానుగావుడు. అయితే కస్తూరికూడా సోషియల్ మనిషేనే! నే నెందుకు ఆహ్వానించకూడదు. పైపెచ్చు సంతోషించవచ్చుకూడా, అని అనుకొని ఒక ఆహ్వానపత్రిక పంపాను.

'హాస్టల్ డే' వచ్చింది. అనేకమంది వస్తూవున్నారు. ఎక్కడచూచినా కోకిల స్వరాలే! ఏప్రక్కచూచినా రంగుల రంగుల దృశ్యాలే! నేనూ గంపడంత కండ్లేసుకొని కస్తూరికొరకు ఎదురుచూస్తున్నాను. సరిగ్గా టైముకు వచ్చింది.— పాపం, చాలాముందుగానే రావాలనుకుందట. కాని ముందుబండి తప్పిపోయిందట—'హలో' అంటే 'హలో' అనుకొని కరస్పర్శ చేసుకొన్నాము. ఇక ఆనాటి నా మనస్థితి చెప్పాలంటే ఇప్పుడు నాకు చాలా సిగ్గేస్తుంది. ఆ రోజు నాకొచ్చిన గౌరవం అంతా ఇంత కాదు. ఒక్క గౌరవమేమిటి? దాంతోపాటు గర్వంకూడా. ఎవరెవరో నాకు తెలీనివాళ్ళంతా నాచుట్టూ తిరగసాగారు. "హలో, రామూ"లు నామీద పూల బంతుల్లాగ లెక్కలేనన్ని పడినాయంటే నమ్మండి. డిన్నర్ నుండి లేచివచ్చినంత వరకు మాపయిన్నే అందరి కన్నులు. కస్తూరి ఏమైనా అనుకుంటుందేమోనని నేనొకప్రక్క వుడికివుడికి చచ్చాను. కడకు ఆసంగతి ప్రస్తావనకు వచ్చేటపుడు "అదే 'సోషియల్'గా వుండటమంటే" అని అంది కస్తూరి....సరే, ఇక సాగనంపుతూ వున్నా. "రామ్, నే నంటే నీ కంతప్రేమ! లేకుంటే నాకింత గౌరవం



ఎందుకుచేస్తావ్ ?" అని అంది కస్తూరి. వుత్తపిచ్చిపిల్ల అనుకున్నా మనసులో. నేనొక పిచ్చివాణ్నయింది నాకు అప్పుడు తెలీనేలేదు. ఇక శలవుతీసుకుంటున్నా. అబ్బా! అప్పటి ఆమెచూపులు తలుచుకుంటే ఇప్పటికూడా నాకు గాబరా ఎత్తుతుంది. తరువాత కొద్దిరోజులుదాకా నా స్నేహితులు కొందరు నన్ను హేళన చేయసాగారు. "చా, వాడికి 'సోషియల్'గా వుండటమంటే ఏమో తెలీదురా. (నిజానికి వాళ్ళనేదాంట్లో అసత్య మేమీ లేదు) లేకుంటే మన కెందుకు 'ఇంట్రడ్యూస్' చేయడూ ?" అనే మాటలు నేను వినేట్టుగానే అనేవాళ్లు.

★

ఇక ఆరోజునుండి నాచదువుకు బండ పడింది. నేనూ కస్తూరీ చాలామార్లు కలుసుకునేవాళ్ళం. సినిమాలు షికార్లు మించిపోయాయి. ఎవరిదేంపోతుంది? కష్టపడి పంపేది మానాన్న కదూ అక్కడ: ఇంగ్లీషు ఫిల్ములు ఇంగ్లీషు డాన్సులు అంటే కస్తూరికి చాలాప్రియం. అవి ఎంతో బాగున్నవని నాతో వాదించేది. ఆమాదిరి డాన్సులు మనమూ

నేర్చుకోవాలంట. అప్పటిగ్గానీ మనము 'కల్చర్డు' కామని వాదించేది. ఏమైతే నేమి. నన్నొక పిచ్చివాణ్ణిచేసి వెనకేసుకొనింది. ఒకరోజు "ప్రాంచద్భూషణ బాహుమూల రుచితో........" కౌగలించి నాతో. "రామ్, మనకింతకన్నా సుఖం ఏంకావాలి? ఎంతధనమూ, ఎంతచదువూ ఖర్చుచేసినా ఈ సుఖం వస్తుందా?" అన్నది. నిజమే. ఎట్లావస్తుంది!

వ్యవహారం శ్రుతిమించి రాగాన పడింది. తాను డాన్సులకు పొయ్యేది కాకుండా నన్నుకూడా రమ్మని బలవంత పెట్టసాగింది. ఒక మొగాడితో ఒక ఆడది, ఒకరినడుము చుట్టూ ఒకరిచేయి-ఛా! మహాఘోరమనిపించేది. ఒకరోజు అన్నాను "ఇట్లాటివన్నీ నాకు సరిపోవడంలేదని." "నువ్వు వుత్త అమాయకుడవోయి, రామ్" అంటూ నామెడ చుట్టూ చేయివేసి నా హృదయంపై వాలింది కస్తూరి. నిజం చెప్పొద్దూ? అప్పుడంతా మరచిపోయేవాణ్ణి.

పరీక్షలు అయిపోయాయి. చదివుంటేకదూ, రాసేదానికి? శెలవలకు ఇంటికిపోక తప్పలేదు. అక్కడవున్నన్నాళ్ళూ కస్తూరిమీదనే మనసు. పట్నానికి పరుగెత్తికెళ్దామా అన్పించింది. "శెలవల్లోఅన్నా మా కండ్లముందరలేకపోతే ఎట్లారా, నాయనా!" అని మాఅమ్మ అన్నప్పుడు నా హృదయం కరిగిపోయేది. తల్లికి ఒక్కకొడుకునై పుట్టేది కూడా కష్టమేననిపించింది........పరీక్ష ఫలితాలొచ్చాయి. క్షవరం—డబ్బుకు డబ్బూ చదువుకు చదువూ. ఇక కస్తూరి సంగతి చూద్దామా అంటే, జాబులు రాయటమే మానేసింది. "క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్"....అన్నమాటలోని సత్యం నాకు బాగా గోచరించింది.

తిరిగి కాలేజీకివెళ్లాను. కస్తూరికోసం ఎంతవెతికినా కనబడలేదు. నాకు చాలా సందేహం కలిగింది. అయినా ఏంచేస్తాం?........ఒకరోజు సాయంత్రం అట్లా బీచిలో పోతున్నాను. ఒకవైపు, విద్యుద్దీపకాంతులలో విలాసంగా నడుస్తుండే విలాసవతులను, మరొకవైపు చేతుల్లో చేతులేసుకొని పోయే యువకజంటల్ను చూస్తుంటే నాకెంతో అసూయ కలిగింది. ఉన్నట్లుండి నా ముందునుంచిపోయే ఒక రిక్షాను చూశాను. దాంట్లో ఇద్దరు ఇరుకిరుగ్గా కూర్చునిఉన్నారు. ఆమె ఎవరా అని సందేహం కలిగింది. కస్తూరి అయితే దొరతో ఎందుకు పోతుంది? అదీకూడా సోషియలేమో! కొంచెం త్వరగా పోయి రిక్షాను సమీపించాను. ఆమె ఎవరోకాదు. కస్తూరే! "కస్తూరీ," అని నాకు తెలీకుండానే అనేశాను. ఆమె నాతట్టు ఎగాదిగాచూసి కండ్లు తేలవేసింది. మళ్ళీ కొంచెం ధైర్యంతెచ్చుకొని, ముఖం చిట్లించి, "పోరా, విలేజీ బూర్" అని గొణిగి రిక్షావాణ్ణి త్వరగా వెళ్ళమని కసిరింది. దానిప్రక్కనున్నాడే, ఆ ఆంగ్లోఇండియన్ "నేనే గెల్చానురా" అన్నట్లు నాతట్టుచూశాడు. పాపం, ఇక కొద్దిరోజుల్లో వానిగతి ఏమయ్యేది వానికి తెలీ లేదు!........అంతే. అదే కడపటి చూపు. కానీ, ఇంతా జరిగినా, ఇప్పటికూడా ఆమెను నేను మరచిపోలేదు. మా'సరూ' ను వొప్పించి, చిట్టికి కస్తూరి అనిపేరు పెట్టాను. నేటికీ, మా సరూ "కస్తూరి రంగ రంగా........" అని జోల పాడుతూవుంటే ఆనాటి కస్తూరి నాకు జ్ఞప్తికి వస్తూవుంటుంది.

# ఒత్తిడి




రైళ్లకు




తిండికీ, కిరసనాయిలుకు




సినిమాలకు




కాలేజీలకు



ఈనాడు సినిమా పరిశ్రమా, సినిమాలూ మన నిత్య జీవితంలో ఒక ముఖ్య భాగమై కూరుచున్నై. ఇది పరిశ్రమ కాదనిగానీ, దీని సంస్కృతి మనకు అంటటంలేదనిగానీ మనం కళ్లుమూసుకు కూచోటానికి వీలులేదు. సినిమాలలో రావలసిన సంస్కరణ చాలా ఉంది— కాని అంతకుముందే ప్రేక్షకులుకూడ సంస్కరింపబడాలి. నాసిసరుకు అమ్ముడు పోతున్నంతవరకూ మంచి సరుకు ఎవ్వడూ తయారు చెయ్యడు. ఇది ఒక్క సినిమాకేకాదు ప్రతిదానికీ వర్తిస్తుంది. ఈనాడు విదేశాల్లో మొదటి తరగతి రచయితలూ, వైజ్ఞానికులూ, కళాకారులూ నటీనటులూ ఈ పరిశ్రమకు బాసటగా నిలిచిఉన్నారు. మన దేశంలోనూ పిలిం ప్రపంచంలో విపరీతమైన మార్పు రాబోతున్నది. ప్రజలు తమకు ఎటువంటి చిత్రాలు కావాలో కోరుతున్నారు. ప్రజలకు కావలసిన చిత్రాలు ఇవ్వవలసిన బాధ్యత ప్రొడ్యూసర్లమీదా, ప్రొడ్యూసర్ల సాధక బాధకాలు గమనించవలసిన బాధ్యత ప్రజలమీదా ఉంది. వీటి రెంటినీ సమన్వయంచేసి ఎవ్వరైనా వ్యాసాలు రాస్తే మేము ఈ శీర్షిక క్రింద సంతోషంతో ప్రకటిస్తాము.



'మాయలోకం'లో

:: వరలక్ష్మి ::



మాయా మచ్ఛీంద్రలో

:: కన్నాంబ ::



మాయా మఛ్చీంద్రలో

:: మాలతి ::



మాయలోకంలో

:: కాంతకుమారి ::



# నీలాటిరేవు

కనుపర్తి వరలక్ష్మమ్మ

వైశాఖ శుద్ధ త్రయోద. శిరాత్రి సుధాకరుడు మిసమిసలాడే తెల్లని సాంద్ర కిరణాలతో ప్రకృతినంతా వెండి మలామా చేస్తున్నాడు. రాఘవరావు చల్లని ఆ పండు వెన్నెల్లో ఆరు బయట పడక కుర్చీ వేసుకొని కూర్చుని ఏవో భావ గీతాలు పాడుకుంటున్నాడు. ఇంతలో రామచంద్రయ్య పంతులుగారి యింటికి పిల్లలతోగూడ విందుభోజనానికి వెళ్లిన రాజేశ్వరి గేటు తోసుకొని లోపలికి వచ్చి ఆరు బయటవేసి ఉన్న నవారు మంచంపై కూలబడి 'అమ్మయ్య'అన్నది.

ఏం పడవను బాగా పూటు చేసుకొనివచ్చి నట్టున్నావే? అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

నా మొఖం. భోజనానికి వెళ్ళి వస్తే సరి మీకిదో హాస్యం. మన యింట్లో యేమి తినకుండా రోజూ మాడుతున్నట్టూ యీరోజు భోజనానికి పోయి ఆలోపం తీరేటట్టుగా దిట్టంగా తిని వచ్చినట్టూ మాట్లాడుతారు. నిజానికి వాళ్ళ అవస్థచూస్తే రోజూ తినే అన్నమైనా తినేబుద్ధి వేయలేదన్నది రాజేశ్వరి.

ఏమి అవస్థ అన్నాడు రాఘవరావు.

ఆ పెండ్లివారే ఇచ్చిన వస్తువులు పుచ్చుకోక, పంపిన ఫలహారాలు తినక, వేళకు భోజనానికి రాక వాళ్లను ఏడ్పిస్తున్నారు. తొమ్మిది గంటలకు విందన్నారా? సరిగా మేము వేళకే వెళ్ళామా? వాళ్లు అప్పటికే వడ్డనంతా చేసి సిద్ధంగా ఉన్నారు. ఊరి పేరంటాళ్లంతా వచ్చారు. ఆ మగపెండ్లివారు మాత్రం రారు. వాళ్లు రాకుండా భోజనాలు సాగించడానికి వీరికి గుండెలు లేవు. అట్లా గంటన్నర కనిపెట్టుకుని కూర్చున్నాము. ఇక రామచంద్రయ్యగారూ, వారి భార్య యింకా వారి యింటికి వచ్చిన బంధువులూ ఆ పెండ్లికొడుకు వారి విడిదిచుట్టు ఎన్నిమార్లు తిరిగారో లెక్కలేదు. అట్లా తిరగగా తిరగగా చిట్ట చివరకు మొఖాలు ఎట్లాగో పెట్టుకొని వచ్చారు. డబ్బిచ్చి పగదెచ్చుకో బిడ్డనిచ్చి పగదెచ్చుకోమన్న సామెత యిదే గాబోలు. ఈ పిల్లలు ఒకటే కునికిపాట్లు, వద్దంటే మానరు. పోనీ లేచివద్దామంటే వాళ్ళేమనుకుంటారో అని సంకోచం—అని తన గోడవంతా వెళ్ళబోసుకొని రాజేశ్వరి, నా చేతిలో ఒక పత్రిక ఉన్నట్లయితేనా, అన్నది.

ఏమి చేశేదానవు? అన్నాడు రాఘవరావు.

గొప్పయింటి వివాహములని చెప్పబడే యిటువంటి పెండ్లిండ్ల వృత్తాంతాలు పత్రికలలో సుతరాము వేసేదాన్ని కాదు సరికదా లోకంతోపాటు కట్నాలు కానుకలు లాంఛనాలు పుచ్చుకుంటూ కన్యాదాతలను బహువిధాల పీడించే యీ వివాహాల్లో ఏలాటి గొప్పతనమూ లేదని నిశితంగా విమర్శించేదాన్నిగూడా నన్నది, రాజేశ్వరి కలుకుగా.

అంతేనా యింకా ఏమైనా...... అన్నాడు రాఘవరావు. అంతేగాదు కట్నం పుచ్చుకోకుండా వివాహమాడిన వీర యువకు లెవరైనా ఉంటె వారి చిత్రాలు ప్రకటించి వాని క్రింద వారి నామధేయాలు స్వర్ణాక్షరాలతో లిఖింపజేసి యుంచును. వారేగాదు వారితోబాటు ఆడబడుచు లాంఛనాలు పుచ్చుకోని ఆడబడుచులు, విద్యాపురాలి నడుతులంగుకోని విద్యాపురాళ్లు ఉన్నట్లైతే వారి చిత్తరువులుగూడా అతిసుందరంగా ప్రకటించి ఉందును. అన్నది రాజేశ్వరి ధీమాగా.

అబ్బో చాలా గొప్ప కోరికలు ఉన్నాయే కాని అటువంటివారున్నారా ఈ రోజుల్లో యెక్కడైనా? అన్నాడు రాఘవరావు.

ఉంటేనే, అన్నది రాజేశ్వరి.

"డబ్బుచే దెవరికి? కట్నాలుగాని కానుకలుగాని యిస్తామంటే సిరిరా మోకాలొడ్డుతారా?"

"ఇది సిరి అనడంకంటే మహా పాతకం యింకోటిలేదు. పాపం ఈ రామచంద్రయ్య పంతులుగారు చూచారా? సుక్షేత్రంవంటి మూడు ఎకరాల మాగాని భూమి అమ్మి అల్లుడికి ధారపోశాడు. ఆయనకూ ఫించెను రోజులు దగ్గర పడుతున్నాయా? ఆయన బ్రతుకెట్లా వెళ్ళాలి చెప్పండి."

"ఎవరికి అవసరమై యిచ్చాడు? బి. ఏ. గావాలె, ఎం. ఏ. గావాలె, డాక్టరు చదివినవాడు కావాలె, ఇంజనీరు చదివినవాడు కావాలె. ఈ భ్రాంతి లేకపోతే ఈడబ్బు కర్చులేకపోను గా."

"అవును అన్నవస్త్రాలిచ్చి పోషించగల అల్లుడు కావలె ననుకోడం తప్పా? అటువంటి అర్హత తనకు కలదుగదా అని అడిగితే యెంతైనా యిస్తారు గదా అని ఈ యిరుకుసమయంలో తా మెట్లాడినా సాగుతుంది గదా అని...ఒకటే ఏడ్పించడమా? పాపం రామచంద్రయ్య పంతులు నాల్గువేలు రొక్క మిచ్చాడు గదా అంతటితో ఆ కన్యాదాతను కరుణించి వదలగూడదమా? మళ్ళీ అలకలకనీ, అప్పగింతలకనీ, నడుతులకనీ లాంఛనాలకనీ, ప్రాణాలు తోడడమా? విధి నిషేధాలు లేవుగదా, చట్టాలు బాధించవుగదా, ఎన్ని అత్యాచారాలుచేసినా పోలీసులు జోక్యం కల్పించుకోరు గదా అని యిటువంటి అమానుష చర్యలు చేయడమా? ఇవి గొప్ప యింటి వివాహాలా? ఇట్టి రువిద్యాధికులైన వరులా? ఈ వివాహ వృత్తాంతాలు వినడానికే దుర్భరంగా ఉంటే యీ వార్తలను ఈ వధూవరుల చిత్తరువులను పత్రికలలో ప్రచురించి ఖరాబ్ చేయడమా? ఇది ఉత్తమమైన పద్ధతని నే నెంతమాత్రం ఒప్పుకోను సుమండీ."

తమకు చగువుకున్న అల్లుళ్ళే కావాలెనని ఆరాటపడడమూ, వాళ్ళ కాలేజీలచుట్టూ వాళ్ళ యిళ్ళచుట్టూ తిరగడమూ, మీకు యిన్ని వేలిస్తాము అన్ని వేలిస్తామని పోటీలుపడి పాటలు పాడి

డబ్బు కుమ్మరించడమూ, ఈ విధంగా చేస్తున్న కన్యాదాతలదేమీ తప్పు లేదా? ఇస్తామన్న సొమ్ము తీసుకుంటున్న వరులే దోషులా? నా దృష్టిలో ఇందులో పెండ్లికొమారులు గాని వారి తల్లి దండ్రులు గాని చేస్తున్న తప్పేమీ కన్పించడం లేదు."

"అమ్మో! ఎంత సబబుగా చెప్పావు రండీ; డబ్బిస్తేగాని పెండ్లి కాకపోయె; పిల్ల యుక్తవయస్సు వచ్చి యింట్లో ఉండె. కన్నె చెఱవిడిపించుకోక తప్పదాయె. కన్యాదాత డబ్బు యివ్వక ఏమిచేస్తాడు? మీరేమన్నా చెప్పండి యీ రోజుల్లో అల్లుళ్లకు ఇవ్వక విధిలేక తప్పనిసరి అయి కట్నాలు యిస్తున్న వాడేగాని బుద్ధిపూర్వకంగా సంతోషంగా యిస్తున్న మామగారొక్కడూ లేడు. అయినా కట్నాలలో తప్పిదము మీ కెట్లా తెలుస్తుంది లెండి. మీరూ మూడువేలు పలికినవారేగా? నోట్లుగాకుండా అచ్చ వెండిరూపాయలు, మూడు వేలూ అరిగినవి కాకుండా పూటా లేకుండా ఠంగ్ ఠంగ్‌న మ్రోగించిగాని మీ నాన్నగారు పుచ్చుకోలేదు. ఆపైన లాంఛనాల క్రింద వెయ్యి రూపాయలు వదిలించారు! తానెంతో జగమంతా గాదూ?"

"పాపం మీకీ అవస్థ ఎన్నాళ్లో లేదులే రావు కమిటీవారి హిందూ లా సవరణ చట్టము అమలులోకి వస్తే మీ బాధలు తీరిపోతాయి. ఆ చట్టం వచ్చినాక ఎవడైనా కట్నం పుచ్చుకున్నట్లయితే, ఆ డబ్బును వెంకటేశ్వర స్వామి ముడుపులాగా మూటగట్టి ఉంచి ఆ పెండ్లికొమార్తె మేజరుకాగానే ఆ సొమ్ము ఆమెకు ముట్టజెప్పాలెగా. కనుక యీ కట్నం తీసుకోడమెందుకు? దాచిపెట్టడమెందుకు? అప్పజెప్పడమెందుకు? అని పెండ్లికొమారుడుగాని అతని తల్లిదండ్రులుగాని యిక వరకట్నాల కాశించనే ఆశించరు. అంతటితో మీ పీడ వదిలిపోతుంది."

"ఆఁ ఇప్పుడు కంట్రోలు చేయబడుతున్న వస్తువులన్నీ యెంత నిజాయితీగా విక్రయింపబడుతున్నాయో అదీ అంతే. అన్నిటికీ బ్లాక్ మార్కెట్టు ఉండనే ఉన్నది గదా? యుద్ధం వచ్చిన తర్వాత మనవాళ్ళు బ్లాక్ మార్కెట్ వ్యాపారంలో బాగా ఆరితేరారు గూడాను. ఇప్పుడు అల్లుడికి అంత యిచ్చాము ఇంత యిచ్చామని గొప్పగా చెప్పుకోనైనా చెప్పుకుంటున్నారు. ఆనోటి మెదలాయింపైనా లేకుండా గుట్టుగా యిచ్చి వూరుకోవాలె."

"అన్నిటికీ అన్ని చెప్తావు గవర్నమెంటు శాసనంగూడా దానిని అడ్డుకోలేదంటావు? అయితే యిక కట్నాలు పొయ్యేమార్గమే లేదంటావా?"

"ఉన్నది."

"ఎట్లా?"

"కట్నాలలోని నైచ్యాన్ని, పరపీడనను యువజనులు తెలుసుకోవాలె, నిషేధించాలె."

"ఎట్లా తెలుసుకుంటారు."

"మహాత్మాజీ మాటిమాటికి అంటూ ఉంటారు చూడండి. అదే దీనికినీ. హృదయ పరివర్తన కలగాలె."

"అబ్బో!" అని రాఘవరావు పకపక నవ్వాడు.

# అబ్బ!

## నార్ల వెంకటేశ్వరరావు

అబ్బ!

ఉద్దేశం అంతర్జాతీయ రాజకీయాలను గురించి వ్యాసాన్ని వ్రాయాలని. యుద్ధాన్ని, దాని ఫలితంగా ఏర్పడిన వివిధ సమస్యల్ని విడిచిపుచ్చితే, నేడు అంతర్జాతీయ రాజకీయాలు దాదాపు శూన్యం. అంచేత "మహాభయానక సంగ్రామానంతరం యూరప్‌ఖండంలో మిత్రరాజ్యాలకు సంపూర్ణ విజయం సిద్ధించింది. ఇప్పుడిక...." ఇట్టి ధోరణిలో ఈ వ్యాసం బహుశా ప్రారంభమై వుండవలసింది. ఏమైనా, అంతర్జాతీయ రాజకీయాల సమీక్ష అనేసరికి పెక్కుమంది పాఠకులు ఇట్టి ఎత్తుగడనే ఆశిస్తారు.

కాని, నేను వ్రాయడానికి కూర్చుని, కాగితంపై కలం పెట్టేసరికి అప్రయత్నంగా దొర్లిన మొదటిమాట,—"అబ్బ" పొద్దస్తమానం పని చేసిచేసి పూర్తిగా అలిసిపోయిన నా అంగాంగం—నాలోని ప్రతి జీవకణం—విడిచిన నిట్టూర్పే నాకు తెలియకుండాకూడా నా కలం వ్రాసిన ఈ "అబ్బ" అయివుండాలి.

"అబ్బ" అనే మాటలోని గొప్పతనం అదే! అది మన ప్రవృత్తిలోనే అంతర్లీనమై వుంటుంది, అది మనతో పుడుతుంది; మనలో పుడుతుంది. నోరులేని పసిపాపకూడా "అబ్బబ్బబ్బబ్బ" అని అంటుంది. దాన్ని చూడగా భాషకు అసలు పునాదే ఈ "అబ్బ" అనే పదమేమో అని తోస్తుందికూడా.

పసిపాప "అబ్బబ్బబ్బబ్బ" అని కేరింతలాడుతూవుంటే, మేనమామ "నీ అబ్బ!" అని పరిహాస మాడవచ్చు. అయితే, అట్టిసమయంలో తన భాషా పరిజ్ఞానంకూడా ఈ "అబ్బబ్బబ్బబ్బ" తోనే ప్రారంభమైందని అతడికి గుర్తు రాదు. పైగా, ఈనాటికికూడా తన సమస్త మానసికావస్థలను ఈ పదప్రయోగంతోనే తాను వ్యక్తపరుస్తూవుంటాడని కూడా అతడికి స్ఫురణకురాదు. బాధకలిగితే, అతడు "అబ్బ" అని మూలుగుతాడు. కోపంవస్తే, "అబ్బ" అని గద్దిస్తాడు. విసుగుపుడితే, "అబ్బ" అని కసురుతాడు. దుఃఖంవస్తే, "అబ్బ" అని నిట్టూరుస్తాడు. కష్టాలుతీరితే, "అబ్బ" అని గుండెను తేలికపరుచుకుంటాడు. జుగుప్సాకరమైన దృశ్యంనుంచి "అబ్బ" అంటూ ముఖం తిప్పివేసుకుంటాడు. ఇంతేకాదు. అందమైనపువ్వు కనబడితే, "అబ్బ! ఎంత అందంగా

వుంది" అని మెచ్చుకుంటాడు. ఎండలో మాడిమాడి, నీడను చేరినంతనే, "అబ్బ! ఎంతహాయిగా వుంది" అని సంతోషిస్తాడు. ఆతరతను ప్రకటించడానికేమి, ఆశ్చర్యాన్ని ప్రదర్శించడానికేమి "అబ్బ" అనే అంటాడు. అవహేళన చేయగోరితే, ఈ పదాన్నే స్వల్పంగా మార్చి "అబ్బో!" అంటాడు. బాధలోగాని, కోపంలోగాని, విసుగుదలలోగాని తరతమ భేదాల్ను చూపించాలంటే "అబ్బబ్బ" అని అంటారు. ఇంతదూరం చెప్పడం దేనికి? అతడు "అబ్బ" పదప్రయోగంచేయని సందర్భాలు బహు స్వల్పం; దాదాపు లేవనే చెప్పవచ్చునేమోకూడా!

అయినాకూడా తాను ఇంతగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నానని అతడు అంగీకరించడు; అంగీకరించలేడు. "అబ్బ" పెదవులనుంచిరాదు; కడుపులోనుంచి వస్తుంది. దానిస్థానం నిఘంటువులలో కంటెమిన్నగా మానవుని ప్రవృత్తిలోనే. అంచేతనే దానిప్రయోగం ఆలోచనాపూర్వకంగా కాదు; సహజంగా. దాని వినియోగం ప్రయత్నఫలితంగా కాదు; సంకల్పానికి అతీతమైన శక్తుల ప్రేరేపణద్వారా.

ఎంత దీర్ఘసమాసాలైనా, ఎంతటి క్లిష్టసమాసాలైనా, అవి అన్నీ ఒక యెత్తు; ఇది ఒక్కటే ఒకయెత్తు. ఆ సమాసాలు ఎంత కృత్రిమమో, అంత పేలవం. ఇది ఎంత సహజమో, అంత అర్థవంతం. రచయితకు సరియైనపట్టులో వాడుకోవడం తెలిసివుండాలేగాని, "అబ్బ" అనే ఒక్క ముక్కముందు "అమందానంద కందళిత హృదయారవిందుడు" మొదలైనవి కేవలం దిష్టిపిడతలు కావా?

"అబ్బ" అనే పదంవలె "అమ్మ" అనేదికూడా మనతో పుట్టినదే; మనలో పుట్టినదే. దానివలె దీన్నికూడా ఎన్నో అర్థాలలో ఎంతో భావగర్భితంగా ఉపయోగించవచ్చు.

రసజ్ఞహృదయం వుండాలేగాని, "అమ్మ" అనే పదంలోగల మార్దవం, మాధుర్యం, కవిత్వం మరి ఏ పదంలో వుంది?

ఈ రెండింటితో పోల్చదగినట్టిది కాకపోయినా, "ఇది" సయితం ప్రత్యేకంగా ఎన్నదగినట్టిదే. వేరేమాట ఏది దొరక్కపోయినా, "ఇది" అక్కడ టంకంవలె అతుక్కుపోతుంది. ఇందుకు ఒక ఉదాహరణ చూడండి: "నాకు అసలే ఇదిగా వుండగా, నీవు మరింత ఇది చేశావంటే, నేను పూర్తిగా ఇదైపోతాను." ఈ వాక్యంలో "ఇది" వచ్చిన మూడుచోట్ల దానికి మూడు విడివిడి అర్థాలను చెప్పుకోవచ్చు.

ఇంత "ఇది" గా మనకు చక్కచక్కని మాటలుండగా, అయినచోట, కానిచోట సంస్కృత సమాసాలను వాడి తేట తెలుగును—అబ్బ!—ఎంత పాడు చేస్తున్నాము.

* * *

అమ్మ!

**ఇక్కడికి ఈ వ్యాసం ముగిసినట్టేనా?**

# ఫాసిజంయొక్క ఆఖరు పోరాటం

రా వు

జపాను, ఇటలీ, జర్మనీ దేశాలలో ఫాసిజం పండి పరిపక్వదశకు వచ్చిఉండటంవల్ల ఆ దేశాలలోనే దాని మారణం ప్రారంభమయింది. ఇటలీ జర్మనీల పతనం అయిపోయింది. జపానుకుకూడా పతనం తప్పదు. కాని అంతటితో ఫాసిజంయొక్క మారణం సంపూర్తికాదు.

మన దేశంలో అనేకమంది బ్రిటనునూ, అమెరికానూకూడా ఫాసిస్టు దేశాలకింద గడిస్తున్నారు. మరికొందరు రష్యానుకూడా ఈ జాబితాలో చేర్చుతున్నారు. కాని ఇది పొరబాటే. ఇటువంటి దురభిప్రాయం కలవాళ్లు గడిచిన యుద్ధాన్ని ఫాసిస్టులు ఫాసిస్టులమధ్య తగాదాగా భావిస్తున్నారు.

ఇదే బిచ్చగాళ్లమధ్య తగాదా అయిఉంటే హిట్లరు ఇంగ్లండును వదిలి రష్యామీదికి దూకటం తటస్థించదు. రష్యా ఇకముందు సామ్రాజ్యతత్వం అవలంబిస్తుందని జోస్యం చెప్పేవారు సహితం ఇంతవరకూ రష్యా కటువంటి తత్వం లేదనే ఒప్పుకుంటున్నారు. రష్యాతోచేరిన ఇతరదేశాలు అన్నివిధాలా బాగుపడ్డట్టు దాఖలాఉంది గాని భారతదేశంలాగా అధఃపతనం పొందినట్టు రుజువులేదు. అందుచేత జరిగినయుద్ధం బిచ్చగాళ్ల పోట్లాటకాదు. బ్రిటను అమెరికాదేశాలు ఫాసిజం అవలంబించదలిచినట్లయితే ఇన్నిదేశాలూ కలిసి రష్యాపైనే పడిఉండును. బ్రిటను అమెరికాలు రష్యాతోచేరి ఇటాలియను జర్మను ఫాసిజాన్ని నిర్మూలించటం జరిగిఉండదు.

**అయితే మరి యుద్ధంతో ఫాసిజం** ఎందు కంతరించదంటే దానికి కారణం ఉంది. బ్రిటను అమెరికాలు ఫాసిస్టు దేశాలు కానప్పటికీ ఆదేశాలలో ఫాసిజం బతకగలిగి ఉన్నది. ప్రజల రాజకీయ హక్కులు సంపూర్ణంగా నాశనమయిన చోట తప్ప ఫాసిజంతల ఎత్తలేదు. అది సమగ్రంగా ఉన్నచోట బతకనే లేదు. ప్రజల రాజకీయహక్కులు మధ్యస్తంగా ఉన్నచోట అది తలదాచుకుని ఉండగలుగుతుంది.

బ్రిటను అమెరికాలలో తలదాచుకుని ఉన్న ఫాసిజముకు ఈ యుద్ధంలో విజయం చేకూరిందనుకోవటంకూడా పొరబాటే. ఎందుచేతనంటే ఫాసిజం ఫాసిజాన్ని ప్రేమిస్తుంది. అవకాశం దొరకగానే ఫ్రెంచి ఫాసిస్టులు ఏం చేశారో అవకాశం దొరికితే బ్రిటిషు అమెరికను ఫాసిస్టులుకూడా ఆపనే చేసి ఉండేవారు. బ్రిటిషు అమెరికను ఫాసిస్టుల చేతులు కట్టేసి యుద్ధంలో విజయాన్ని లాక్కున్నది ఆ దేశాల తాలూకు ప్రజాశక్తులు.

అమెరికను ప్రజాశక్తి రూజవెల్టును నాలుగోసారి ఎన్నుకుని ఫాసిస్టు ప్రచారం యెడల తనకు గల నిరసనను చక్కగా రుజువు చేసుకున్నది.

అయితే అమెరికా బ్రిటను దేశాలలో తల ఎత్తిన ఈ ప్రజాశక్తి ఆ దేశాలలో ఉన్న పాసిజాన్ని నిర్మూలించటాని కెంత దూరం వెళుతుంది?

ఈ ప్రశ్నకు సమాధానం ఒక్క ప్రజాశక్తియొక్క భావిపరిణామంమీదనే ఆధారపడలేదు. ఆ దేశాలలో తలదాచుకున్న **ఫాసిజంయొక్క భావిప్రవర్తన మీదకూడా ఆధారపడి ఉంది.**

మొదట బ్రిటిషు అమెరికను ఫాసిజాన్ని తీసుకుందాం. ఫాసిజం ఇంతవరకని గిరిగీసుకుని అంతలో నిలిచిపొయ్యేదికాదు. ఇదివరకల్లా ఈ ఫాసిజం జర్మనీలోనే, ఇటలీలోనే, జపానులోనే సహితం వేళ్లువేసి ఉండింది. పెట్టుబడి సహకారంచేసీ, రహస్యపు ఏర్పాట్లుచేసీ ప్రపంచసంగ్రామం తెచ్చిపెట్టేదాకా పని చేసింది. ఆ యుద్ధమే ఆవేళ్లను కాస్తా తెగనరికి పెట్టింది. ఇక ఫాసిజం అమెరికాలోగానీ బ్రిటనులోగానీ సజీవంగా ఉండాలంటే అక్కడి ప్రజాశక్తులను జయించటానికి ప్రయత్నించకతప్పదు.

అదే ఫాసిజం యొక్క అఖరు పోరాటం.

ఈ యుద్ధానికిపూర్వమే బ్రిటనులోనూ అమెరికాలోనూ ఫాసిజం ప్రజాశక్తిని కవళించటానికి కొన్నిప్రయత్నాలు చేసి ఉండినసంగతి మన జనసామాన్యానికి తెలియదు. కాని ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఇకముందు ఫాసిజం చెయ్యిబోయే ప్రయత్నాలు మరీ విషమించి ఫాసిజాన్ని నివారణంచేసి తీరుతాయి.

"బ్రిటనుసామ్రాజ్యాన్ని విసర్జించితే మనం మాడి చచ్చిపోతాం,'' అనే ప్రచారానికి బ్రిటిషుప్రజలే సమాధానం చెప్పటం నేర్చుకుని, "భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలి," అని అలజడి సాగిస్తున్నారు.

సామ్రాజ్యతత్వమూ, వర్ణవివక్షతలూ మొదలైనవాటిద్వారా బ్రిటిషు ఫాసిజం బతికిఉండటానికీ పైకిరావటానికీ ఎన్ని ప్రయత్నాలుచేసినా అది పైకిరావటం ఇక కలలో వార్త.

కాని ఒక్క అలోచించదగిన విషయం మటుకుంది.

మన దేశంమాట ఏమిటి?

కప్ప ఉన్నంతకాలమూ పాములు బతికేఉంటాయి. ఫాసిజం మనలాటి దేశాలమీదనే పడి జీవిస్తున్నది. బ్రిటను మనని పరిపాలిస్తున్నదంటే మన రక్తం పీల్చి నూటికీ పదిమంది బ్రిటనులో బాగుపడ్డారు. మన ప్రజాశక్తి ఫాసిజాన్ని ఎక్కడా ఓడించలేదు. ఇది ప్రజాయుద్ధమని ఒప్పుకోవటానికే మనకు కుతికలమీదికొస్తున్నది. ఎవరేయుద్ధంలోగెల్చినా మనకు ముక్తిలేదని వాపోవటంవరకే మన కానందం. మనప్రజ పూర్తిగా మేలుకోలేదు. ఎవరో ఒకరిచేతి కీలుబొమ్మగా ఉండటంమించి మనకుతెలీదు, మనకు రాబొయ్యే స్వాతంత్ర్యం కేవలం హిందూ స్వాతంత్ర్యంగా ఉండాలో. హిందూముస్లిము స్వాతంత్ర్యంగా ఉండాలోకూడా మనం తేల్చుకోలేనిస్థితిలో ఉన్నాం.

మన కసలు ప్రజాశక్తిలో విశ్వాసమే లేదు. మనకు స్వాతంత్ర్యం రావటం బ్రిటిషు ప్రజా స్వాతంత్ర్యమనేదికూడా మనకు తెలీదు. వారు త్యాగంచేస్తే తప్ప మనకి స్వాతంత్ర్యం రాదనీ వారు "న్యాయానికి కట్టుబడి" త్యాగం చెయ్యకపోయినట్టయితే వారూ ఫాసిస్టులేననీ నమ్మటానికి సిద్ధంగా ఉన్నాం. అందుకనే ఈ యుద్ధంలో బ్రిటిషు అమెరికను ప్రజలు సంపాదించిన విజయాన్ని మనం అర్థం చేసుకుని ఆనందించలేక వాళ్లు మన శత్రువులనే ధోరణిలో ఉన్నాం.

మన దేశంలో ప్రజాశక్తి మేలుకుంటే తప్ప ఈ ధోరణి మారదు. మన ప్రజలు మేలుకోని పక్షంలో ఫాసిజం ప్రపంచమంతటా నశించినాకూడా ఇక్కడ యథేచ్ఛగా విహారం చెయ్యగలుగుతుంది.

# వరునకు కొన్ని కిటుకులు

'మంఖ'

పెళ్లి సంబంధాలు వస్తున్నాయా ? ఎందరు పిల్లల్నిచూసినా ఎవరూ నచ్చ లేదూ ? నీకు నిజంగా పెళ్లిచేసుకోవాలని ఉందీ! అయితే, విను. పిల్లని ఎంచు కోడంలో కొన్ని కిటుకులు చెప్తాను.

ముందు పిల్లని చూసుకొనిరా, ఈ క్రింది ప్రశ్నలు ఆన్సరు చేస్తున్నంత సేపూ, నీహృదయాన్ని అవతలపారెయ్, నీ మెదడునిమాత్రం ఉపయోగించు. కానీ ఒక షరా. ఈప్రశ్నలు నీఅంతట నువ్వే, ఎవరూ దగ్గరలేకుండా ఆన్సరు చెయ్యి. లేకపోతే నిన్ను నువ్వు మోసగించుకొనేం దుకు అవకాశాలు ఏర్పడవచ్చు.

కొన్నిజవాబులు నీకు తెలియకపోతే మైనసుమార్కులు మాత్రం వెయ్యకు. వాటికి సున్నా మార్కులు వెయ్యి. మార్కులు వేసేటప్పుడు నీకు రుచించి నంతమట్టుకే వెయ్యి. హెచ్చు ప్రాధాన్యం ఇవ్వకు. ఉదాహరణకి నీకు అందం అనవసరం అయితే కాంచనమాలకూడా సాధారణమైన అమ్మాయికన్నా హెచ్చు మార్కులు తెచ్చుకోలేదు.

అందం అన్నదాన్ని ఈ క్రిందివిధంగా విభజించవచ్చు. ఒడ్డూపొడుగూ, శిరోజాలు, కళ్లు, పళ్లూ, ముక్కు, రొమ్ము అనే ఆరింటికి ఆరెళ్లు పన్నెండు మార్కులు.

ఛాయకి రెండు మార్కులు.

గాత్రానికి రెండుమార్కులు. గాత్రం అంటే పాట సొంపు అని పొరపడకు. గొంతుక కొట్టొచ్చేటట్టు లేకపోవడం. లేక, మాట్లాడుతూఉంటే వేసవిలో నిమ్మనీళ్లలాగ ఉండడం మొదలైనవి దృష్టిలో పెట్టుకో.

ఆరోగ్యానికి పదిమార్కులు. ఇది నువ్వు ఖచ్చితంగా తూచలేకపోవచ్చు. అయితే వాకబుచేసిన విషయాలనిబట్టి బుర్రని ఉపయోగించి మరీ మార్కులు వెయ్యి.

కులగోత్రాలకి అయిదు మార్కులు. నీకు వీటిలో నమ్మకం లేకపోతే ఈ అయిదూ సాంప్రదాయంలో కలిపేయి.

సాంప్రదాయం. ఇందులో, అమ్మాయి తల్లితండ్రుల చరిత్ర, పుట్టుపూర్వోత్తరాలు, పిల్లతోబుట్టువులు, వాళ్లఆరోగ్యం ఇత్యాదులన్నీ వస్తాయన్న సంగతి మర్చిపోగూడదు. సాంప్రదాయానికి అయిదు మార్కులు.

చదువుకి మూడు మార్కులు. చాకలి పద్దువేసేందుకు సరిపోయే చదువో, లేక కళాపూర్ణోదయం అర్థంచేసుకొనేచదువో



"అబ్బాయీ! ఇటు ఒక అమ్మాయి పోవటం చూశావా?"

"చేతులో సంచీ, కాళ్ళకు ఎత్తు మడమల బూట్లూ—"

"ఆఁ, ఆఁ, ఆవిడే—"

"సన్నగా, ఎఱ్ఱగా—"

"ఆఁ ఆఁ, ఆ అమ్మాయే !"

"ఐతే నేను చూడలేదు."

---

నువ్వే ఆలోచించుకో. బజారుబిల్లులు, లాభనష్టాలు తెలుసుకునేదాకా చదువుకొన్నపిల్ల రామన్ ఎఫెక్టుమీద వుపన్యసించగల అమ్మాయికన్నా హెచ్చు మార్కులు తెచ్చుకోవచ్చు.

ఇంగితజ్ఞానానికి మూడుమార్కులు. ఇది చూపులకి వెళ్ళినప్పుడు ఆ అరగంట సేపూ అమ్మాయియొక్క ప్రవర్తననిబట్టి తెలుసుకోవచ్చు.

కట్నాలూ, కానుకలు, వీటికి రెండు మార్కులకన్నా హెచ్చు యివ్వవద్దు. వెయ్యి నూటపదహార్లూ, పట్టుబట్టలూ, వెండిచెంబులు పెట్టే సంబంధంకూడా నాదృష్టిలో హెచ్చుమార్కులకి నోచుకోలేదు.

ఇల్లు చక్కపెట్టుకోడం అల్లికపనులు మొదలైన గృహిణీ ధర్మాలకి చులాగ్గా ఓ పది మార్కులు.

ఇప్పటికి ఏభై పూర్తిఅయేయి. దాన్ని రెట్టించుకో నూరవుతాయి.

ఇక, పిల్ల పెయ్యి నాకుడిదయితే పాత భోగట్టాలు పరిశీలించి ఓరెండుమార్కులు తగ్గించు. పిల్ల గ్రంథకర్తఅయి బోలెడన్ని పుకార్లకి కారణం అయితే మరో రెండు మార్కులు కొట్టేయి. మీఅమ్మ కోడంత్రికం పెట్టేదయితే ఒక గ్రేసు మార్కు పారేయి. మీ కుటుంబం శుద్ధ చాంధసమై మీనాన్న అగ్నిహోత్రావధాన్లు అంత శాంతవంతుడైతే మరో గ్రేసు మార్కు ఇయ్యి.

చాలామంది పిల్లలు నూటికి అరవై డెభైమాత్రమే తెచ్చుకొంటారు. ఎనభైపైబడ్డ పిల్లఉంటే తక్షణం మీవాళ్ళతో మాట యిచ్చానని చెప్పు. తొంభై అయిదు పయిన మార్కులు తెచ్చుకొన్న అమ్మాయిని మర్చిపో. ఏవంటే ఆపిల్ల ఏ దేవకన్యో అయిఉండాలి.

## కబుర్లు

**క.స.**

సాధారణంగా మంచి కబుర్లరాయడైన మనిషి, అందరూ చెప్పుకొనేకబుర్లు కాక, కొత్తసంగతులు చెప్పాలి. అప్పుడే అతనిలో వున్న ప్రత్యేకత కనపడుతుంది. అతడు తక్కినవారిదృష్టినీ, మనస్సునూ కూడా ఆకర్షించగలుగుతాడు. అయితే, ఆ కబుర్లరాయడే, ఒక్కొక్కప్పుడు అందరూ చెప్పుకొనే కబుర్లలో తన గొంతుకూడాకలిపి, అందరూ మాట్లాడుకునే ఆ విషయాన్నిగురించి తనకు తెలిసిందీ, తనకు తోచిందీకూడా చెప్పవలసి వుంటుంది. అలాటి పరిస్థితి, కొన్ని ముఖ్యమైన సంగతులలో ఏర్పడుతుంది.

ప్రస్తుతం నాకు అలాటి ముఖ్యమైన సంగతి ఒకటి కనపడుతుంది. అది నాకు, మీకు, మన ఇరుగు పొరుగులకీ, మనరాష్ట్రానికీ, మన దేశానికీ, ప్రపంచానికీ కూడా సంబంధించిన విషయం,

ఏమిటో మీరు యీపాటికి ఊహించే వుంటారు. కొంచెం ఓపికపట్టి నాకబుర్లు కూడా వినండి.

లార్డ్ వేవెల్, భారతదేశంలోని రాజకీయ ప్రతిష్టంభనను ఒక కొలికికితెచ్చి అటు ఇంగ్లండు ప్రయోజనాలు చెడకుండా, ఇటు భారతీయుల రాజకీయ జీవితం మరీ భ్రష్టత్వం పొందకుండా యేదోవొక పద్ధతిమీద, దాదాపు నలభై కోట్ల ప్రజలూ, మూడువందలు భాషలూ గల ఈదేశంలో పరిపాలనను సాగించడానికి, పట్టుదలతో పూనుకున్నాడు. ఈ పట్టుదల అటు బ్రిటనుకూ, ఇటు కొంత వరకు మనకూ ఉభయతారకంగా పరిణమించవచ్చునని చాలామంది ఆశపడుతున్నారు. అలా జరగడం మంచిదే కూడా.

ఇటు కాంగ్రెసు తరపున మౌలానాగారూ, అటు లీగు తరపున జనాబ్‌గారూ ఒకనిర్ణయానికి వచ్చినట్లయితే, లార్డ్ వేవెల్ కృషి ఫలించినట్లే. అలా జరుగుతుందా, జరగదా అనే కబుర్లు, ప్రస్తుతం అట్టే లాభకరంకావు. అంత మనోరంజకమూ కావు. లార్డ్ వేవెల్‌కృషి ఫలించాలని ఆశిస్తూ, మన ఆశ సఫలమైతే ఏంజరుగుతుందో చెప్పుకుందాం. చెప్పుకోవడం మంటే, నేను 'ఆంధ్రజ్యోతి' ద్వారా మీకు చెప్పడం, మీరు చదువుకోడం. మీలో పరోపకార పారీణులెవరైనా వుంటే, చదువురానివారికి నాకబుర్లు వినిపించడం. దీనికి నా అభ్యంతరం ఏమీలేదు.

అసలుసంగతికి వద్దాం. లార్డ్ వేవెల్ కృషిఫలిస్తే మనసంగతి ఏమవుతుంది! మనంఅంటే, మనమూ, మన అరవ సోదరులూ నన్నమాట, ప్రస్తుతం, మన సోదరులు మనల్నివిడిచిపెట్టే సూచనలు ఏమీలేవు కనుక.

మనరాష్ట్రం, కాంగ్రెసు బలంగల రాష్ట్రం. అంటే స్వాతంత్ర్యవాంఛ ప్రబలంగావున్న రాష్ట్రమన్నమాట. అంచేత, అసెంబ్లీలో మెజారిటీగల కాంగ్రెసువారే మంత్రిత్వాలు పూర్తిగా, మునుపటిలాగనే నిర్వహించవచ్చు. ఒకవేళ, మళ్లీ ఎలక్షనులు పెట్టినదాకా ఇతరపార్టీలవారికి

కూడా కాస్త చోటుయిచ్చి, కొంతమందిని మంత్రుల్ని చెయ్యవచ్చును. ఇప్పటికప్పుడే, చెన్నపట్టణంలో జరుగుతున్న గూడుపుఠాణీలనుబట్టిచూస్తే, ఆ చోటిచ్చే ఆలోచనలు అట్టే కనపడడంలేదు, నా దృష్టికి. నాకు, మనోదృష్టికిగాని, నేత్ర దృష్టికిగాని, ఏమీ లోపం కలగలేదు.

కాబట్టి, అందరుమంత్రులూ కాంగ్రెస్ వారే అవుతారనే లెక్కలో మాట్లాడుకుందాం.

మొదటిమంత్రి మాట. ఏ రాష్ట్రానికయినా మొదటి మంత్రిని ప్రధానమంత్రి అనాలి, అంటున్నారు. ఆయన చెప్పినట్టు తక్కినవారు వినాలి. అందరికన్న ఆయన ముందు నిలుచుంటాడు. ముందు కూచుంటాడు. ఇదివరకు ఈబాధ్యతను శ్రీమాన్ రాజగోపాచారిగారు నిర్వహించారు. ఈసారి మనరాష్ట్రంలో మంత్రులు రావడం అంటే, ఢిల్లిలోకూడా మనవారు కొందరు మంత్రులు కావడం గనక, రాజగోపాలాచారిగారు అక్కడకి వేంచేస్తారని అంతా అంటున్నారు. జనవాక్యం కర్తవ్యం అంటారు ఆచార్యులవారు, అలాగే జరుగుతుంది. అలా జరక్కపోతే; మనమంతా దిమ్మరపోవాలసి వుంటుంది. ఏ పటేలుగారో, మహాత్ముడో అడ్డుపడి, "మీరు ఢిల్లీవస్తే, చెన్నపట్టణం మాటేమిటి?" అని బలవంతపెడితే, చెప్పలేముగాని, లేకపోతే రాజగోపాలాచారిగారు, ఆర్థికశాఖ కౌన్సిలరు (ప్రస్తుతం, వీరిని మంత్రి అనరు) గా ఢిల్లీలో వుండవలసిందే. అప్పుడు మనరాష్ట్రానికి ప్రధానమంత్రి ఎవరు?

ఇక్కడే గట్టిచిక్కు. ప్రకాశంపంతులుగారు బ్రహ్మాండమైన త్యాగంచేశారు. 'కాలుస్తా' నని సోల్జరు తుపాకియెత్తితే, 'కాల్చుకో' అని రొమ్ముచూపి, స్వాతంత్ర్య సమరంలో ముందడుగువేశారు. తాను నిర్వహించిన మంత్రిపదవిని, దీక్షతోను, ప్రజాక్షేమ బుద్ధితోను నిర్వహించారు. ఆయన ప్రధానమంత్రిగా వుండవలసిందే. డాక్టరు పట్టాభిగారో అని మీరు అడగవచ్చును. ఒక రాష్ట్రీపు మంత్రిపదవికి మించినవ్యక్తి డాక్టరుగారు. ప్రస్తుతం, మౌలానా తరవాత, కాంగ్రెసు అధ్యక్షులు కాబోతున్నారు. ఎలక్షన్లుజరిగి, మెజారిటీపార్టీ తరఫున కేంద్రప్రభుత్వం ఏర్పడేనాడు, అక్కడ వుండవలసినవారు డాక్టరుగారు. ఈ లోపల, వారు యీ రాష్ట్రానికి మంత్రిగా-ప్రధానిగా అయినా-వుండటం మంచిది కాదు.

పోతే, ప్రకాశంగారిమాట. ప్రకాశంగారిని వెనక్కునెట్టివెయ్యడానికి, చాలా కుతంత్రాలు కాంగ్రెసుడేరాలలో జరుగుతున్నట్లు నాకు తెలుస్తోంది. ప్రకాశంగారు ముసలివారట! కాంగ్రెసు రథాన్ని నడిపిస్తూవున్న గాంధీజీ, పటేలు, మౌలానా ఆజద్, రాజగోపాలాచారి, గోవిందవల్లభపంత్,-వీరంతా పడివయసులోవున్నారు కాబోసు! నిర్వహించడానికి సామర్థ్యం లేకపోయినా, ప్రధాన

మంత్రిపదవిమీద కన్నువేసుకుకూచున్న యువకులు, ప్రకాశంగారిని గురించి చాలా అసభ్యమైన ప్రచారం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆయువకులు తమ స్థానాన్నీ, తమఅనుభవశూన్యతనూ, ప్రజ్ఞాపరిమితినీ గ్రహించుకొని, యింకా కొన్నాళ్లు పెద్దల చాటునవుండి, పరిపాలనా విధానాన్ని అర్థంచేసుకొని, అప్పుడు ముందుకు రావడం శ్రేయస్కరం. ప్రధానమంత్రి పదవి విషయంలో అరవవారికీ, తెలుగు వారికీ పోటీరావడంలో వింతలేదు కాని, కొంతమంది అరవవారే, ప్రకాశంగారి త్యాగాన్నీ, ప్రజ్ఞనూగుర్తించి వారిపట్ల అభిమానాన్ని చూపుతూవుంటే, మన తెలుగువారు, ఆయనపట్ల ద్రోహం తల పెట్టడం, మనం తల వంచుకోవలసిన మాట, ప్రధాన మంత్రిపదవినిగురించి, నేను చెప్పగలసంగతి ఇంతే. మన ప్రకాశంగారిని రానివ్వండి. ఆయనే వచ్చేటట్టు చూడండి.

డాక్టరు సుబ్బరాయన్‌గారికి ప్రధాన మంత్రిత్వం పుచ్చుకుందామని ఉన్నట్టు తెలుస్తోంది. కాని, వారు మామూలు ప్రకారం 'లా' మినిస్టర్‌గానే వుంటే మంచిది. డాక్టరు రాజన్‌గారు 'హెల్త్' మినిస్టరుగ్గానే వుంటారు.

రామనాథంగారూ, మునిసామిపిళ్లె గారు కాంగ్రెసు మంత్రులుగా యిక వచ్చే సూచన కనబడదు కాబట్టి, మన తెలుగు హరిజనులలో బి. ఎస్. మూర్తిగారికి ఒక మంత్రిపదవి రావచ్చును.

ప్రకాశంగారు ప్రధానమంత్రి అయినప్పుడు, 'రెవిన్యూ' మంత్రిపదవి తెన్నేటి విశ్వనాధంగారిచేతికి రావడం మంచిది. మనతెలుగు యువక ఎం.ఎల్.ఏ. లలో, మంచి ప్రజ్ఞగలవారు విశ్వనాధంగారే. 'రెవిన్యూ' పార్లమెంటరీ శెక్రటరీగా మంచిసమర్థత కనపరచారు, ఆయననునమ్మి, ఆశాఖను ఆయనచేతిలో పెట్టవచ్చును.

ఇక గోపాలరెడ్డిగారు పూర్వపు అనుభవంతో కొత్తగా మళ్ళీ లోకల్‌బోర్డ్ అడ్మెనిస్ట్రేషన్ శాఖ తీసుకుంటే చాలా బాగా ఉంటుంది.

గిరిగారు తమ పూర్వపుపదవిలోనే వుంటారు. ప్రధాన మంత్రిత్వాన్నిగురించి వీరుకూడా కొంత ఆలోచించారనీ ప్రస్తుతం విరమించుకున్నారనీ, నాకు యెవరో చెప్పారు. నిజం కావచ్చు, అబద్ధంకావచ్చు. ఏమయినా, విరమించుకున్నాక చిక్కులేదు కదా. 'లేబరు' మంత్రిబాధ్యత, యుద్ధం జరిగినన్నాళ్లూ, ఆ తరువాతాకూడా చాలా గొప్పది. గిరిగారు యీ విషయంలో శ్రద్ధచూపడం చాలా యుక్తమైన విషయం.

మంత్రులుగా అరవవారు ఎవరువస్తారనే ఆలోచన మనకు ముఖ్యంకాదు. ఏమంటే వారిలో, ఎవరువచ్చినా మనకు ఒకటే.

# పడవలు


'వామనుడు'


నడవలేక పడవ ఎక్కాడని ఒకసారి ఒక పెద్దమనిషిని ఒక చిన్న మనిషి వెక్కిరించాడు. పడవ ప్రయాణాలు యీకాలంలో చాలామంది నవనాగరికులకు, బస్తీవాళ్ళకూ తెలియనే తెలియదు. కాలువలోని నీరు ఎటువైపు ప్రవహిస్తున్నదో అటువైపుగానే పడవ కూడ ప్రయాణంచేస్తున్నట్లయితే పడవ వేగంగానే పోతూంటుంది. నీటివాలు మీద పోతూన్న పడవకు తెరచాప ఎత్త నవసరంలేదు. తెరచాపకూడ ఎత్తితే పడవ మరీవేగంగా పోతుంది. అటు ఇటు ఊగులాడుతూ ఉయ్యాలలూగుతూంది. ప్రమాదవశంగా మునిగిపోతే పోవచ్చుకూడా. అందువల్ల వాలుపడవకు తెరచాప ఎత్తకూడదు. తాడుపట్టుకొని పడవనులాగితే చాలు. పడవనడక వడిగానే ఉంటుంది. కాని నీటిప్రవాహానికి ఎదురుగా పడవపోతున్నప్పుడు నడకవడి తగ్గుతుంది. వాలుమీదపోయే పడవ ఎదరపడవకంటే చాలా వడిగా పోతుంది. ఎదరపడవకు తెరచాపఎత్తినప్పుడు, నెత్తిమీద కుచ్చు తలపాగ చుట్టినంతగర్వం ఆపడవకు వస్తుంది. చాలాదూరంవరకు, రెండుమూడు మైళ్ళవరకు దర్జాగా తెరచాపకనిపిస్తూ ఉంటుంది. ఆ తెరచాపకొయ్య కొట్టకొన మీదనే స్టీమరులకు జాతీయపతాకం తగిలిస్తారు. తెరచాప తాళ్ళకన్నింటికీ పతాకాలు చిన్నవీ పెద్దవీ తోరణాలు లాగున తగిలిస్తారు. నావలకు ఆవిధంగా తగిలించినప్పుడు నావలను ముస్తాబు చేసినట్లుగా ఉంటుంది. ఈరోజువరకూ, స్టీమరుప్రయాణంలో ఉన్న గొప్పదనం రైలుప్రయాణానికి లేదు. కొత్తగా వచ్చిన విమాన ప్రయాణాలకు కూడా లేదు. జర్మనీవాళ్లు తమ విమానబలాన్ని గూర్చి ఎంత గొప్పగా చెప్పుకొన్నప్పటికీ, అది వారికి అక్కరకు రాలేదు. మనవారు గొప్పగా చెప్పుకొనేది నౌకాబలం. నౌకాబలంలో వారితో సమానంగా సవాలుచేయగల రాజ్యం పూజ్యం. అందుకనే బ్రిటిష్ సామ్రాజ్యం అఖిల ప్రపంచ వ్యాప్తమైంది. అనేక సముద్రాలమీద వారికి ఆధిపత్యం ఉంది. ప్రపంచ సముద్రమార్గాలలో ఆయువుపట్టులవంటి జిబ్రాల్టరు, సూయెజు, సింగపూరు, హాంకాంగు, కేప్‌టవున్, ఏడెన్, మాల్టా, ఇవన్నీ వారివశంలో ఉన్నాయి. ఏసముద్రం మీదచూచినా వారి వర్తకనావలే తిరుగుతున్నాయి. జర్మనీ వాటిరాజ్యం మెట్టమీదనే యుద్ధం చేయగలిగింది గాని సముద్రంమీద సాహసించలేకపోయింది. అగస్త్యులవారు సముద్రాలన్నీ ఆపోశనంపట్టారని పురాణాలలో చెప్పారు. ఆంగ్లేయులు ఈనాడు సముద్రాలన్నీ ఆపోశనం పట్టి అజేయులుగా ఉన్నారు. వేలకొలది టన్నులబరువును ఎక్కించుకోగల స్టీమరును కూడా మామూలు వ్యావహారిక ఇంగ్లీషు భాషలో "బోటు" అనే పిలుస్తారు.

“లండనునుంచి బొంబాయికి ఎక్కి వచ్చిన బోటు పి. అండ్. ఓ. కంపెనీ వారిది” అని అంటారు. మన కాలువల మీదతిరిగే పడవనుకూడా బోటు అనే అంటాము. అటువంటి పెద్ద స్టీమరులను కూడా ఇంగ్లీషువారు ముద్దుగా “పడవలు” అనిపిస్తారు. అయినప్పటికీ ఆంగ్లేయులకు పడవలమీద ఉన్న గౌరవ భావం వాటిమీదఉన్న అభిమానం తదితరములమీద వేనిమీదా లేదు. భగవంతుని సృష్టిలో, ఆంగ్లేయులదృష్టిలో సముద్రానికి మించిన వస్తువు లేదు. మానవసృష్టిలో ఆంగ్లేయుల దృష్టిలో పడవకంటె ప్రతిభావంతమైనవస్తు విం కొకటిలేదు. మెట్టమీద చూపించే పరాక్రమం ఒక పరాక్రమం కానే కాదు. నీటిమీద మేటిననిపించుకోవాలి. పడవనెక్కాలి. ప్రవాహాలు దాటాలి. సముద్రాలు తరించాలి.

ఆంధ్రుల నావలు ఒకప్పుడు జావా సుమాత్రా బోర్నియో ద్వీపాలవరకు వెళ్లాయి. కాంభోజరాజ్యం (కాంబోడియావరకు) వెళ్లాయి. అక్కడ ఆంధ్రులబావుటా ఒకప్పుడు ఎగిరింది. పడవ ఎక్కలేక నడిచేరోజులు వారికి వచ్చాయి. ఇప్పుడు వారిప్రతిభ వారిని విడిచినరోజులు ఇవి. పడవలేక పడవ ఎక్కడంకాదు. పడవ ఎక్కలేక నడపడం ఇది. ఊరుపేరులేకుండా కాలం గడపడం. ఎప్పటికైనా తిరిగి ఇండియా నుంచి భారతీయనౌకలు బయలుదేరాలంటే ఏకోస్తానుంచి బయలు దేరుతాయి? తూర్పుకోస్తానుంచి బయలు దేరాలిగాని పడమటికోస్తానుంచికాదు. విశాఖపట్నంలోనే నౌకలను నిర్మించడానికి అద్భుతమైన సౌకర్యాలు అందిచ్చినట్లుగా ఏర్పడియున్నాయి. భారతదేశపు నౌకలను నిర్మించడానికి అంతకన్నా అనుకూలమైన స్థావరం ఇంకొకటి భారతదేశంలో ఇంకెక్కడా లేదు. ఆంధ్రుల నౌకాదళం తయారు కావాలి.

ఇవన్నీ గొంతెమ్మకోరికలు. ఆ కోరికలు యీడేరవలెనంటె, మనమందరం ఒక్కపడవలో ఎక్కడం ముందుగా నేర్చుకోవాలి.






సముద్రాల రాఘవాచార్యులు

వ్యవహారభాష విరివిగా అభివృద్ధి చెందుతున్న యీ కాలంలో శబ్దప్రయోగార్థాలకు ప్రజావ్యవహారమే శరణం. అందువల్ల భాషాసేవకులు అతిశ్రద్ధగా ఈ విషయాన్ని ఆలోచించవలసివుంది. ఒక్కమండలంలో మాటాడినట్టు మరో మండలంలో మాటాడరు. ఒక ప్రాంతంలో ఒక శబ్దానికున్న అర్థం మరొక మండలంలో మరోవిధంగా వుంటుంది. ఈ విధంగా పెరిగిన ఇద్దరువ్యక్తులు ఒకచోట కలుసుకుంటే-వారిసంభాషణ.-వారిరచనలు ఒకరికొకరు అతివిచిత్రంగా భావిస్తారు. ఏ భిన్నభాషకు చెందినట్లో కూడా తలుచుకుంటారు. ఈక్రొత్తదనం లేకుండా సులభంగా తెలుసుకోవాలంటే-ఉభయులను భాషామూలకంగా దగ్గిరికి తీసుకునిరావాలి. ఆయా మండలాలలో విశిష్టంగానూ-నూతనంగానూ కనిపించే మాటలు-భిన్నార్థంలో వాడుకునేమాటలు సంగ్రహించి గ్రంథస్థంచేసి క్రమంగా ప్రచారంలోకి తీసుకురావాలి. ఈవిధాన ఈ మాటలు సంగ్రహించుకుంటూవస్తే ఏ మహానుభావుడో వ్యావహారికభాషా నిఘంటువువ్రాసే సుముహూర్తం కలిగిననాడు-ఎంతో సంతోషిస్తాడు, పని చాలా సులభంచేశారని. ఈనాడు కొంతచిక్కు తీసివేశారని సహృదయులైన పాఠకులు ఆశీర్వదిస్తారు. వ్యవహారభాషా వికాసంలో ఈ కార్యక్రమం మరో ముందడుగు. ఈ ప్రయత్నానికి నన్ను ప్రోత్సహించిన ఒకటి రెండు సంగతులు మనవి చేస్తున్నా.

ఒకసారి విజయనగరంనుంచి మా యింటికో బంధువు వచ్చాడు. సాయంకాలం ఇద్దరు ముస్తాబై ఒకమిత్రుణ్ణి చూడాలని బయలుదేరాం. తీరా వాకిట్లోకి రానిచ్చి ఆతడు నావేపు తేరిపారచూసి "వోణీ వేసుకురా బావా" అన్నాడు. నాకేమీ తోచిందికాదు. మొగవాళ్ళ వోణీలు వేసుకోవడమేమిటి?. పరిహసిస్తున్నాడనుకున్నా.

మా ప్రాంతంలో-కృష్ణాతీరంలో-వోణీలంటే వచ్చీరాని వయసుపిల్లలు పరిణీలు కట్టుకుని పైనవేసుకునే పైటలకు పేరు.

మాపిల్లకు చెల్లెలికి. నేనెన్నోకొనితెచ్చా వోణీలు. అదివేసుకుంటే వీధి భాగవతంలో హాస్యగాడిలా కనిపించనూ.


నవ్వు వచ్చింది. తమాయించుకుంటూ "మాదేశంలో మగవాళ్లు వోణీలు వేసు కోరండీ" అన్నాను. ఆయన నిర్ఘాంత పోయారు. ఒక్కక్షణం ఆలోచించి- "పరిహాసంకాదు బావా. పైన పంచెవేసు కునిరమ్మనే నాభావం. మాదేశాన మే మట్లాగే వాడతాం అన్నాడు సవరించు కుంటూ - వివరించుకుంటూ. ఇక నవ్వే శాను. మాప్రక్కల ఆడపిల్లలు వేసు కునే పైటలనే వోణీలంటాం-మొగవాళ్లు వేసుకునేవి ఉత్తరీయాలంటాం - చదువు కోనివాళ్లు పైపంచెలంటారు. అది మీ జిల్లాలో ప్రత్యేకతేమో నన్నాను.

ఆయనగారు తల పంకిస్తూ ఒకొక్క చోట ఒక్కొక రకంగా ఉంటుందని అన్నారు. ఈసంగతే మాటాడుకుంటూ మిత్రునింటిలో ప్రవేశించాం. 'తొందర పడకండి' అంటూ మామిత్రుడు మా సంభాషణలో ప్రవేశించి-మా రాయల సీమలో ఉత్తరీయమనేమాట చాలా అరు దుగా వాడుతామనీ—వల్లే మాకు ఎక్కువ వాడుకనీ చెప్పారు. మా వైపున పెళ్లి కూతురు ఒడికట్టుకు వల్లె అంటారనీ దానిమీదినించే వల్లెవాటు వచ్చి ఉండ వచ్చనీ చెప్పాను.

చివరికి విశాఖవోణీ - గోదావరి ఖం డువా - కృష్ణఉత్తరీయం - రాయలవల్లె ఒక్కటేననీ-ఆడా మగా తేడాలేకుండా వక్షస్థలాన్ని క్రమ్ముకుంటూ భుజాలమీది నుంచి వ్రేలే పంచె కివిపేర్లనీ తేల్చు కున్నాం.

ఇటీవల వొకసారి ఇల్లాంటి సంద ర్భమేవచ్చింది. ఒకమిత్రుడు వాళ్ళవూళ్లో జరిగిన చిత్రకథసువర్ణిస్తూ - నలుగురూ వచ్చి చుట్టుముట్టేవరకు దాన్ని "కంజం" లో దాచిపెట్టాడండూ కథ సాగించాడు. మాకేమీ అర్థంకాక ఆయన ముఖంవంక చూశాము. అప్పుడామిత్రుడు వివరిం చాడు, కంజమంటే నేలకొట్టని. ఆ తర వాత మరోనాడు ఒక చిత్తూరు మిత్రు నితో మాట్లాడుతూండగా ఈ పదాన్నే ఆయన ఉపయోగించాడు. దీనికి వారి వ్యవహారంలో ధాన్యంపోసుకునే గాదె అని అర్థమట. చిత్తూరువారు "ఖనిజం" అంటారు. కడపవారు "కమిజం" అం టారు. అదే మరికొంత పైకిపోయే టప్పటికి "కంజం" అయిపోయింది. ఇప్పటికీ ఆప్రాంతాల యిండ్లలో నేల కొట్లు కట్టించుకుంటారు ధాన్యంవగైరా దాచుకోటానికి. పూర్వం తీరవాసులు కూడా యిలాటివి కట్టించుకునేవారే. నవనాగరకతవచ్చి-క్రొత్తపంపిణీయిళ్లూ- "లంబరు రూమ్సు" వచ్చింతరవాత నేల కొట్లు మాయమైపోయినవి. వాటితోబాటు ఆ మాట కూడా మరిచిపోయినారు కొందరు. వస్తువు ఉంటేగా మాటలు తెలియటానికి.

సధ్య నే చెప్పవచ్చిందేమంటే-వివిధ మండలాలలో వ్యవహారంలో ఉండి— గ్రంథస్థంకాని మంచి తెలుగుమాటల్ని మరుపుదగులకుండాను - ఎవరు ఏ సంద ర్భంలో ఉపయోగించినా. అపార్థమూ - అర్థంకాకపోవడం జరక్కుండానూ తెలుగు వారందరికీ పరిచయం కలిగేటట్టు చూడ మని. ఈ సధ్యనుకూడా ఒకరొకరు ఒక తీరుగా వ్యవహరిస్తారు. ఇంతకూ-అనే అర్థంలో నేను వాడాను. కొంతమంది "సధ్యవాడు మాపెద్దమ్మకొడుకండీ" అం టే విన్నాను.వీరివాడుకలో- 'అచ్చంగా' అన్నభావం బోధపడుతుంది.—ఇలాగే మీరు విన్నమాటలుకూడాకొన్ని చెప్తారా?




ఆరోజుల్లో హుగ్లీ బ్రాంచి స్కూలు హెడ్‌మాస్టరుగారు ఆ స్కూలుకు రత్నత్రయమని ఏ ముగ్గురు విద్యార్థులకయితే పేరు పెట్టారో వారు ముగ్గురూ మూడు ఊళ్ళనించి, ఒక క్రోసుదూరం నడిచివచ్చేవాళ్లు. వారి ముగ్గురికీ ఎంత స్నేహం ఉండేది!-ఒక్కనాడుకూడా వారు ముగ్గురూ, దోవలో ఉన్న బోడి మర్రిచెట్టుక్రింద కలవకుండా స్కూలుకు వచ్చేవారు కాదు. ముగ్గురి గ్రామాలూ హుగ్లీ నదికి అవతలేను. జగదీశుడు సరస్వతి నది వొంతెనదాటి దిఘరా గ్రామంనించీ, వనమాలీ రాసవిహారులు పక్కపక్కనే ఉన్న కృష్ణపుర, రాధాపురాల్నించీ వచ్చేవారు. జగదీశుడు మిగతవారికన్న మేధావి; కాని వారికంటే బీదవాడు. అతనితండ్రి పురోహితుడు. పౌరోహిత్యంచేసి కుటుంబం గడుపుకువస్తున్నాడు. వనమాలి బాగా ఉన్నవాడు. లోకులు అతని తండ్రిని కృష్ణపురం జమీందారు అనేవారు. రాసబిహారి స్థితికూడా బాగానేఉంది. భూమీ పుట్రా, గొడ్డూ గోదా, తోటా దొడ్డీ—పల్లెటూళ్ళో ఏవేవి ఉంటే సంసారం హాయిగా గడిచిపోతుందో—అన్నీ ఉన్నై. ఇన్ని ఉండీకూడా ఆ కుర్రవాళ్లు పట్నంలో ఇల్లు తీసుకోక, ఎండ అనకుండా, వాన అనకుండా ఇంతదూరం రోజూ నడిచివచ్చి చదువుతున్నారంటే, దీనికి కారణం ఆ రోజుల్లో తల్లిదండ్రులు ఈశ్రమ ఒకశ్రమక్రింద లెఖ్ఖకట్టేవారు కాదు; పైగా ఇంతమాత్రమైనా కష్టపడంది సరస్వతీదేవి వశ్యంకాదని ఒక నమ్మకం ఉండేది వారికి. ఏకారణమైనా కానివ్వండి, వారు ముగ్గురూ ఈ విధంగానే స్కూలుఫైనలు పాసయారు. అదే బోడి మర్రిచెట్టుక్రింద కూర్చుని, అదే చెట్టును సాక్షిగా పెట్టుకుని రోజూ ప్రతిజ్ఞ చేసేవారు—జీవితంలో తాము

ఎప్పుడూ చీలమనీ; ఎన్నటికీ వివాహం చేసుకోమనీ; ముగ్గురూ ప్లీడరు పరీక్ష పాసయి ఒకే ఇంట్లో ఉంటూ, ప్రాక్టీసుమీద వచ్చినడబ్బు ఒకే పెట్టెలో వేసి దేశ సేవకు వినియోగిద్దామనీ అనుకునేవారు.

ఇవీ వారి చిన్ననాటి కలలు. కాని కలలుకాకుండా, సత్యమైనదేదో, అది ఎలా పరిణమించిందో ఇక్కడ క్లుప్తంగా చెప్తాను. వీరి స్నేహపాశం బి. ఏ. క్లాసులో మొట్టమొదట కొంచెం సళ్లు వదిలింది. ఆ రోజుల్లో కలకత్తాలో కేశవ చంద్రసేన్ ప్రభ దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆయన ఉపన్యాసాలు మహా ఉద్రేకంగా ఉండేవి. ఈ పల్లెటూరి కుర్రవాళ్లు ముగ్గురూ వాటి ధాటికి తట్టుకో లేకపోయారు—కొట్టుకుపోయారు. కాని జగదీశుడు వనమాలీ, రాసవిహారీలమాదిరి ప్రత్యక్షంగా దీక్షతీసుకుని బ్రహ్మసమాజంలో చేరలేదు. కొంచెంతాచ్చారం చేయటం మొదలు పెట్టేడు. ఇతను అందరికంటే తెలివిగలవాడే కాని ఇతనిది దుర్బలమైన మనసు. అదీగాక అప్పటికి ఇంకా ఆతనితండ్రి పౌరోహిత్యంచేస్తూ బ్రతికే ఉన్నాడు. కాని మిగతా వారిద్దరికీ ఆ అడ్డు (పీడ) లేదు. కొంతకాలం క్రిందటే వనమాలి తండ్రి చనిపోవటంవల్ల అతను కృష్ణపురానికి జమీందారయాడు. రాసవిహారికూడా ఇప్పుడు రాధాపురంలో ఉన్న అతని ఆస్తికి ఏకఛత్ర సామ్రాట్టు. కాబట్టి కొద్ది రోజుల్లోనే వారిద్దరు మిత్రులూ బ్రాహ్మకుటుంబాల్లో వివాహంచేసుకుని విదుషీ భార్యలను వెంటబెట్టుకుని స్వగ్రామాలు చేరుకున్నారు. కాని పేద జగదీశుడికి ఆ అదృష్టం లేకపోయింది. రెండు మూడు సంవత్సరాలు కష్టపడి లా చదివి పాసై, ఒక బ్రాహ్మణగృహస్థు కన్య, పదకొండు సంవత్సరాలపిల్లను వివాహమాడి ధనార్జనకోసం అలహాబాదు వెళ్ళిపోవలసి వచ్చింది. కాని ఇక్కడ ఉన్నవారికి—కలకత్తాలో ఏది తేలికగా కనిపించిందో—గ్రామంలోకి వచ్చేవరకు అదే కఠినమై కూర్చున్నది. కోడలు అత్తవారింటికి వచ్చి తలమీద ముసుగులేకుండా ఉండటం, చెప్పులూ మోజాలూ వేసుకుని బజార్ల వెంట తిరగటం—ఆ ఊరివారికే కాదు, చుట్టుప్రక్కల ఐదారు గ్రామాలవారికి కూడా తమాషాగా ఉండి, జనం తండోపతండాలుగా ఈ చిత్రం చూడటానికి రా మొదలు పెట్టారు. ఊరంతా విడ్డూర్యంగా చెప్పుకోవటం మొదలుపెట్టారు. ఇలాంటి స్థితిలో మరేమీ గతిలేనివాడు తప్పితే ఆ ఊళ్లో ఎవడూ భార్యను పెట్టుకుని ఉండడు. వనమాలికి డబ్బు లోటులేదు. అందుకనే అతను ఊరువదిలి కలకత్తా వచ్చి, జమీందారీమీద వచ్చే ఆదాయంమీదే ఆధారపడకుండా వేరే వ్యాపారం కూడా పెట్టాడు. కాని రాసవిహారి ఆదాయం కొద్ది. అంచేత అతనూ, అతని భార్యా గ్రామస్థుల వాక్యబాణాలన్నీ సహించి ఆ ఊళ్లోనే 'వెలి'గా ఉండటం మొదలుపెట్టారు. కాబట్టి ఈ ముగ్గురు మిత్రుల్లో ఒకరు అలహాబాదులోనూ ఒకరు రాధాపురంలోనూ, ఒకరు కలకత్తాలోనూ ఉండటంచేత వారు వెనకచేసిన ప్రతిజ్ఞ,

పెళ్ళిచేసుకోకుండా, ఒక ఇంట్లోనే ఉంటూ, ఒక పెట్టెలోనే డబ్బువేసి దేశోద్ధరణచేయటం, ప్రస్తుతం ఆగిపోయింది. ఇక ఏబోడి మంత్రిసెట్టు అయితే వీరికి సాక్ష్యమున్నదో అది వీరెవ్వరిమీదా కంప్లెయింటు చేయలేదు—లోపల నవ్వుకుని ఊరుకున్నది. ఇలా చాలాకాలం గడిచింది. ఈ మధ్యను కదాచిత్తుగా ముగ్గురు మిత్రులూ ఎప్పుడన్నా కలుస్తూ ఉండేవారు; చిన్ననాటి స్నేహం వారిలో పొత్తిగా పోలేదు. జగదీశునికి కొడుకు పుట్టినప్పుడు, ఈ సువార్త వనమాలికి రాస్తూ ఇలా వ్రాశాడు—'నీకు కూతురు పుడితే నా కొడుక్కు చేసుకుని నేను చిన్ననాడు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను. నీ దయావల్లనే నేను వకీలునై హాయిగా బతుకుతున్నానన్నది నేనెప్పుడూ మరిచిపోలేదు.'

వనమాలి దానికి జవాబుగా వ్రాశాడు:—'నీకొడుకు చిరంజీవి కావాలని నే నాశీర్వదిస్తున్నాను. కాని, నాకు కూతురుకలిగే ఆశ ఏమీలేదు. ఒక వేళ మంగళకరుని ఆశీర్వాదంవల్ల నాకు కలిగితే నీకు తప్పక ఇస్తాను.'

ఈ ఉత్తరం రాసి వనమాలి లోలోపల నవ్వుకున్నాడు. ఎందుకంటే రెండేళ్ళకుపూర్వం అతని బాల్యమిత్రుడు రాసవిహారికి కొడుకు పుట్టినప్పుడు అతను కూడా ఇట్లాగే వ్రాశాడు. వ్యాపారంలో ఇప్పుడతను బాగా సంపాయించాడు. అంచేత అందరూ అతని పిల్లనే కోడలుగా తెచ్చుకోవాలనుకుంటారు.

- 2 -

రెండుమాసాలూ, మూడుమాసాలనాటి మాట కాదు. పదిహేను సంవత్సరాలు గడిచిన తర్వాత సంగతి చెప్పుతున్నాను. వనమాలి ముసలివాడయ్యాడు—కొన్ని సంవత్సరాలనించి మంచంలో తీసుకుంటూ, ఇక ఇందులోనించి లేవవలసిన అవసరంకూడా ఉండదేమోనని అనుకోసాగాడు. అతను మొదటినించీ భగవత్పరాయణుడూ, ధర్మభీరువూ. చావుఅంటే అతనికి భయంలేదు. తన ఏకైక పుత్రిక విజయకు వివాహంచేసే అవకాశం కలగలేదనే అతనికున్న దిగులెల్లా. ఆనాడు మధ్యాహ్నం హఠాత్తుగా విజయ చెయ్యి తనచేత్తో తీసుకుని అతను అన్నాడు:

"అమ్మా! నాకు కొడుకులులేరనే దిగులులేదు. నువ్వే నాసర్వస్వం. ఇంకా నీకు పద్దెనిమిదేళ్లు నిండలేదు; ఐనా ఇంతపెద్ద ఆస్తి నీమీద వదిలిపెట్టి పోవటానికి నేనేమీ భయపడటంలేదు. నీకు తల్లిలేదు, అన్నలేడు, ఆఖరికి పినతండ్రికూడా లేడు. అయినా ఈ ఆస్తికి ఏమీ ముప్పంరాదని నాకు తెలుసు. పోతే నీకు ఒక్కమాట చెప్పాలి-జగదీశుడు ఏమైనా చేయనీ, ఎలాంటివాడైనా కానీ. అతను నా బాల్యమిత్రుడు. అప్పుక్రింద అతనిఇల్లూ వాకిలీ ఎప్పుడూ అమ్మించమాకు. అతనికి ఒకకొడుకు ఉండాలి—నేనైతే కంటితో చూడలేదు, కాని చాలా బుద్ధిమంతుడని విన్నాను. తండ్రిచేసిన తప్పుకోసం అతన్ని నిరాధారుణ్ణి చేయవద్దు—ఇదే నా తుదికోరిక."

విజయగొంతు దుఃఖంతో పట్టుకుపోయింది:—"మీ మాట నే నెప్పుడూ కాదనను, నాన్నా! జగదీశబాబు బ్రతికి ఉన్నంతకాలం వారిని నీ మాదిరిగానే గౌరవంగా చూస్తాను. కాని వారు లేనప్పుడు వృథాగా అంత ఆస్తి వారి కొడుక్కు ఎందుకు వదిలిపెట్టాలి? అతన్ని మీరూ కంటితో చూడలేదు; నేనూ యెరుగను. అతను నిజంగా విద్యావంతుడై యేఉంటే తండ్రి ఋణం తప్పక తీర్చ గలుగుతాడు" అన్నది.

వనమాలి కుమార్తె ముఖంవంక కన్నెత్తిచూసి—"ఋణంకూడా కొద్దిగా లేదుగా తల్లీ? కుర్రవాడు, తీర్చలేకపోతే?" అన్నాడు.

"తీర్చలేనివాడు కుపుత్రుడు. అటువంటివాళ్ళకు మనం సహాయపడకూడదు, నాన్నా!" అన్నది విజయ.

సుశిక్షిత, తేజస్విత అయిన తన కన్యను వనమాలి బాగా ఎరుగు. అంచేతనే ఈ ప్రసంగం ఎక్కువదూరం సాగనివ్వలేదు. ఒక్కమాటు నిట్టూర్చి ఇది మాత్రం అన్నాడు:—"అన్నిపనులూ భగవంతునిమీద భారంవేసి నీకు కర్తవ్యమని తోచింది చేయి, తల్లీ! నిన్ను ప్రత్యేకించి బలవంతపెట్టి నీదగ్గరనించి ఏమాటా తీసుకోవటం నాకిష్టంలేదు" అని ఇంకోమాటు నిట్టూర్చి-"నీ వెరగవు తల్లీ! నువ్వు పుట్టగానే, ఈ జగదీశుడు మనిషి అని అనిపించుకునే రోజుల్లో, నిన్ను తన కొడుక్కు ఇవ్వమని అడిగాడు. నేనుకూడా మాట ఇచ్చాను" అని ఉత్సుక దృష్టితో విజయవంక చూశాడు.

విజయ చిన్నతనంలోనే మాతృహీన కావటంవల్ల తల్లీ తండ్రీ తనుగానే ఉన్నాడు వనమాలి. అందుచేతనే విజయ తండ్రిదగ్గర తల్లిదగ్గర మాదిరిగా మారాము వెయ్యటానికికూడా వెనకాడేది కాదు.


"నువ్వు పైమాటకు అన్నావేగాని మనస్ఫూర్తిగా మాటివ్వలేదుగా, నాన్నా?" అన్నది విజయ.

"ఎందుకని తల్లీ?"

"అలా ఇచ్చిఉన్నట్టయితే ఒక్కమాటు అయినా కంటితో చూసేవాడివి కాదా?"

"కుర్రవాడు తల్లి మాదిరిగానే దుర్బలుడనీ-డాక్టర్లుకూడా అతను చిరకాలం బ్రతుకుతాడనే బరవాసా ఇవ్వలేదనీ-రాసవిహారి చెప్పేవరకు నేను, అతను దగ్గరలో ఉంటున్నప్పటికీ పిలిపించి చూడలేదు. అప్పుడతను ఈ కలకత్తాలోనే ఒక మెస్‌లోఉండి బి. ఏ. చదువుతుండేవాడు. ఆ తర్వాత నేను మంచానపడి అతని సంగతే మరిచిపోయాను. కాని, తల్లీ! ఇప్పుడు నాకు తెలుస్తున్నది, అప్పుడు నేను చాలా పొరపాటు చేశానని. అయినా, నేను నీకు నిజం చెప్పుతున్నాను విజయా, అప్పుడు నేను జగదీశునికి మనస్ఫూర్తిగానే మాట ఇచ్చాను" అని కొంచెం ఆగి మళ్ళీ మొదలుపెట్టాడు:

"జగదీశుడు ఇవ్వాళ జూదరి అనీ, త్రాగుబోతు అనీ, ఎందుకూ పనికిరాని వాడనీ అందరూ ఎరుగుదురు. కాని ఒకప్పుడు ఈ జగదీశుడే మా అందరికంటే బుద్ధిమంతుడూ, శీలవంతుడూను. అతని చదువును గురించి నేను చెప్పటంలేదు, తల్లీ! చదువుకున్నవారు చాలామంది ఉండవచ్చును; కాని అలా ప్రాణమిచ్చి స్నేహంచేసేవాణ్ణి నేనెక్కడా చూడలేదు; ఈ ప్రేమే అతనిపాలిట శాపమయింది. అతని లోపాలు యెన్నో నాకు తెలుసు; కాని, అతను భార్యాశోకంతో పిచ్చివాడయినాడని తెలిసినప్పుడు, నాకు నీతల్లి జ్ఞాపకంవచ్చి, అతన్ని లోలోపల గౌర



వించకుండా, శ్రద్ధ చూపించకుండా ఉండలేకపోయేవాణ్ణి. అతని భార్యకూడా సాక్షాత్తు లక్ష్మి. ఆమె చనిపోయేముందు నరేన్నుదగ్గరకు పిలిచి-'నాయనా! భగవంతునిమీద అచంచలమైన విశ్వాసముండుగాక! అని ఆశీర్వదిస్తున్నాను' అని చెప్పిందట. నేను విన్నదాన్నిబట్టి తల్లి ఈ ఆశీర్వాదం వృధాకాలేదని తెలుస్తున్నది. నరేన్ ఆ చిన్నవయసులోనే భగవంతుని తల్లితో సమానంగా ప్రేమించటం నేర్చుకున్నాడు. ఇది చేయగలిగినవాడికి ప్రపంచంలో ఇంకా కావలసింది ఏముంది, తల్లీ?"

"ఇకేనా ప్రపంచంలో చేయగలిగిన వాటిలోకెల్లా ముఖ్యమైంది, నాన్నా?" అని అడిగింది విజయ.

చావుకు సిద్ధంగా ఉన్న ముసలివాని పాడికళ్లు తడిఅయినవి. అతను రెండు చేతులూ చాపి విజయను హృదయానికి హత్తుకుని-"ఇదే అన్నిటికంటే గొప్ప కార్యం తల్లీ! ఈ ప్రపంచంలోనూ, ఈ ప్రపంచానికి బయటా-అసలు విశ్వంలో ఇంతకంటే గొప్పపని ఏమీలేదు. విజయా, నువ్విది ఏనాడైనా స్వయంగా చేయ

గలుగుదువో లేదో తెలియదు. కాని, అలాచేయగలిగిన వారిముందు భక్తితో తల వాల్చగలుగుదువని- నేను కూడా చనిపోయే ముందు నిన్ను ఆశీర్వదిస్తున్నాను" అన్నాడు.

ఆనాడు తండ్రి రొమ్ముమీద బోర్లగా పడుకున్న విజయకు కొత్త అనుభూతి కలగసాగింది. ఎవరో ప్రకాశవంతమైన, మధురమైన దృక్కులతో తండ్రి హృదయంలోనించి తన హృదయంలోకి చూస్తున్నట్టుగా ఆమెకు తోచింది. ఈ అపూర్వమైన, పరమాశ్చర్యకరమైన అనుభూతి ఆనాడు ఆమెను క్షణకాలం సమ్మోహితను చేసింది. వనమాలి అన్నాడు:

"కుర్రవాడి పేరు నరేన్. అతను డాక్టరు పరీక్ష పాసయాడు కాని ప్రాక్టీసు చేయటంలేదని వాళ్ళనాన్న చెప్పాడు. అతను ఈ దేశంలో ఉన్నట్టయితే పిలిపించి అయినా చూసేవాణ్ణి."

"ఇప్పుడతను ఎక్కడ ఉన్నాడూ?" అని అడిగింది విజయ.

"వాళ్ల మామదగ్గర-బర్మాలో. జగదీశుడి దగ్గరనించి ఇప్పుడతని విషయాలన్నీ మనం కనుక్కోలేము. కాని అతను ప్రలాపన ధోరణిలో అన్న వాటినిబట్టి చూస్తే కుర్రవాడు తల్లి సుగుణాలన్నీ పొందాడని తెలుస్తుంది. ఎక్కడుంటే ఏం, భగవంతుడతనికి చిరాయు విచ్చాలని నా ప్రార్థన!" అన్నాడు వనమాలి.

కను చీకటిపడింది. నౌకరు లాంతరు తీసుకువచ్చి, విలాసబాబు వచ్చాడనే వార్త చెప్పిపోయాడు.

"అయితే తల్లీ, క్రిందికిపో. నేను కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటాను." అన్నాడు వనమాలి.

విజయ తండ్రితలక్రింది బాలీసులు సర్ది, కాళ్లవైపునున్న శాలువా రొమ్ము వరకూ కప్పి, లాంతరు వెలుతురు కళ్ళమీద పడకుండా చాటుచేసి, క్రిందికి దిగిపోయినమీదట వనమాలి శుష్కవక్షస్థలంనుంచి దీర్ఘమైన నిట్టూర్పొకటి వెలువడింది! ఆనాడు విలాసుడు వచ్చాడనే వార్త వినేవరకు కుమార్తె ముఖంమీద అరుణకాంతి కనపడింది. అది వృద్ధుడైన తండ్రికి బాధనే కలిగించింది.

విలాసవిహారి రాసవిహారి కొడుకు. అతను ఈ కలకత్తాలో చాలా కాలం నించిఉంటూ ముందు ఎఫ్.ఏ. తర్వాత బి.ఏ. చదువుతున్నాడు. వనమాలి బ్రహ్మసమాజంలో కలిసినప్పటినించీ అంతగా వాళ్ళఊరు వెళ్లేవాడు కాదు. వ్యాపారంలో డబ్బు వృద్ధికావటంతోపాటు ఊళ్లో జమీందారీకూడా పెరిగింది. కాని, అది అంతా చూసేభారం తన బాల్యమిత్రుడైన రాసవిహారీమీద వదిలాడు. ఆ సంబంధంలోనే విలాసుడు ఈ యింటికి రావటం పోవటం మొదలుపెట్టాడు. కాని తర్వాత అది ఏసంబంధంక్రింద పరిణమించిందీ ముందు తెలుస్తుంది.

—తరువాయి వచ్చేసంచికలో.

# వేయగూడని ప్రశ్నలు

ఇండియా నానా జాతులకూ, నానా మతాలకూ పుట్టినిల్లు. అంచేత అది స్వాతంత్ర్యానికి పనికిరాదట. మరి బర్మాలో ఇన్ని జాతులూ ఇన్ని మతాలూ లేవుకదా అది స్వాతంత్ర్యానికి ఎందుకు నోచుకోలేదూ ?

* * *


ఇండియా ప్రభుత్వం పొట్టకు కరువొస్తే అధికపంటలు పండించమని ప్రచారం చేసింది. మరి బట్టకు కరువొచ్చినప్పుడు చరఖా వడకమని ప్రచారం చెయ్యదేం ?

* * *

కమ్యూనిష్టులు పత్రికల్లో అల్లరిచేసి కాంగ్రెసువాళ్లని జైళ్లనించి వదిలించుకొచ్చారట. అడక్కూడదుగాని, ఈ పనిచేసింది వాళ్లని కర్రలతో మోదటానికేకాదు గదా ?

* * *

కమ్యూనిష్టులు పాలసీ మార్చుకున్నప్పటినించీ హిందూముస్లిమ్ ఐక్యత కావాలనీ, పాకిస్తాన్ రావాలనీ ప్రచారం చేస్తున్నారు. అడక్కూడదుగాని హిందూముస్లిమ్ ఐక్యత కుదిరితే పాకిస్తాన్ ఎందుకూ ?



# ముసలమ్మ

**మనోజ వసు**

ఏడుగంటలవుతూ ఉండగా ముసలమ్మ ఇంటికి తిరిగి వచ్చింది. మార్గక్లేశం వల్ల ఆమె మనసేమీ బాగాలేదు. ముసలయ్య ఇంకా కఠినమూ, దుర్గమమూ, జటిలమూ అయిన మార్గాన శ్రమ అనేది లెఖ్ఖచెయ్యకుండా నడుస్తూ నేఉన్నాడు. ముసలయ్యను దోవలో తోడులేకుండా వదిలిపెట్టి వచ్చినందుకు ఆమె మనసు యేలాగో ఉంది. ఆమె తన దురదృష్టాన్నీ, తెలివి తక్కువనీ నిందించుకుంటూ సంసారం సాగించటం మొదలు పెట్టింది...ఇంటికిచేరి కొంచెం మార్గాయాసం తీర్చుకోగానే దోవలో జరిగిన సంఘటనలన్నీ జ్ఞాపకం వచ్చి గిజగిజలాడటం మొదలు పెట్టింది. ఆమె మనసంతా ముసలయ్యమీద నే. అరవై సంవత్సరాలనించీ కలిసి ఉన్న జీవన సంగిని ఎడం కావటంవల్ల ముసలయ్య ఎంత బాధ పడుతున్నాడో! ఆయన కళ్ళజోడూ, ఆయన కట్టుడుపళ్ళూ, ఆయన మేకపాలూ—

ముసలమ్మ మంచివి చూసి రెండు మేకల్ని సంపాయించింది. వాటిని జాగ్రత్తగా మేపేది, వాటివీపు దువ్వేది. అరుగుమీద తనచేత్తో వడికిన నూలుతో నేసిన ఖద్దరు దుప్పటిపరిచి దిగంతాల వంక దృష్టి సారించేది. బాదంపప్పు పగలగొట్టి పళ్ళెంలో బాగా సర్దేది- ఎండు ఖర్జూరపు కాయలుకూడా! ఆమె మనసు నిరుత్సాహ పడేది. దూరాన ఎవరో 'జయజయ రఘుపతి సీతారాం' అనే పాట పాడుతున్నట్టు వినిపించేది.

సీతను పోగొట్టుకున్న రాముని దుఃఖం తలుచుకుని ముసలమ్మ కన్నీరు కార్చేది.


కొడుకు మహాదేవ్ పరుగెత్తుకుంటూవచ్చి-"అమ్మా! బాపూను పిలవమంటావా?" అని అడిగేవాడు.

ముసలమ్మ మొదట విహ్వలఅయి- "ఆఁ" అనేది. కాని ఆమరుక్షణానే తన్నుతాను సంబాళించుకుని-" వద్దు, నాయనా! నా ఈమామూలు సౌఖ్యంకోసం, వారి వ్రతానికి అడ్డురాను. వారికి ఎన్నికర్తవ్యాలు! కర్తవ్యం సుఖంకంటేకూడా ఎంతో గొప్పది,-అనే కదా వారు నాకీ అరవై సంవత్సరాల నించీ నేర్పింది. నేను బాగా అర్థం చేసుకోలేకపోయాను. వారికి విశ్రాంతి కలిగించాలని చాలా ఆదుర్దాపడేదాన్ని; వారి బక్కచిక్కిన అలిసిన శరీరంవంక చూస్తే నాకడుపులో దేవినట్టుఉండేది. వారిపనికి అడ్డురావాలని ఎన్నోసార్లు ప్రయత్నించాను; కాని ప్రతిమాటూ నేనే ఓపోడియేదాన్ని. నాకు తెలుసు వారిపని పూర్తికాగానే ఈ ముసలిదాని దగ్గరికే పరుగెత్తుకొస్తారని-ఒక్కక్షణం కూడా ఆలస్యంచేయరని. నేను వారి ప్రతి జీవకణంలోనూ కలిసిపోయాను నాయనా! నన్ను పోగొట్టుకున్నందువల్ల వారిప్పుడు తక్కువ బాధపడుతున్నారా!

"అమ్మా! నీవు చాలా అస్థిరురాలవైనావు!" అన్నాడు మహదేవ్.

ముసలమ్మ జాగర్తగా కొంగున కట్టిన కుంకుమభరిణె చేతికితీసుకుని మందహాసం చేసి—"అభ్యాసం, నాయగా! అభ్యాసదోషంవల్ల కష్టంగా ఉంటుంది. లేకపోతే వారిపనికి అడ్డువచ్చేపాటి ధైర్యమా నాకు," అనేది.

ముసలమ్మ మళ్ళీ మనస్సును స్థిరపరుచుకుని చరఖావడకటానికి కూర్చుంటుంది-ఇక్కడకువస్తే ధోవతులు దొరకక ముసలయ్య ఎక్కడ ఇబ్బంది పడతాడోనని.




[నమ్మక మున్నవారికి మాత్రమే]

(అశ్వని, భరణి, కృత్తిక 1పా)




ఈ నెలలో మీరు ఇబ్బందులు దాటి సుఖ సూచనలను చూస్తారు. ఇంతవరకు మీరు ఇంటిలోనూ, వ్యవహార రంగంలోనూ చాలా చికాకుపడి ఉన్నారు. ఈ నెల 10 తేదీ తర్వాత ఆ పరిస్థితి మారిపోతుంది. కాని మీరు మీ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ చూపకపోతే ఇబ్బంది వస్తుంది. కాలం బాగున్నదిగదా అని కనబడ్డ ప్రతివారితో కలహాలకు దిగకండి. 14 తేదీ తర్వాత కుటుంబంలో ధన వ్యయం ఎక్కువ అయినా ధనాదాయం బాగుంటుంది గనుక బాధలేదు. కోర్టు వ్యవహారాలు ఎటూ తేలవు.

స్త్రీలకు : స్వల్పవిషయాలకు వివాదాలు పెంచవద్దు. జరీబట్టలు, పసుపుపచ్చని అంచులుగల వస్త్రాలు కొనకండి. 22, 23 లలో చోరభయం, సంచారం, బంధువులలో కలతలు, ధన నష్టం.

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా)




సూర్యోదయం కాబోయే ముందు అరుణ కాంతులు కనిపిస్తవి కదా? అలాగే మీకు కొద్ది కాలంలో సర్వోత్తమమయిన శుభయోగం కలగబోతున్నదన్న విషయం ఈ మాసంలోనే మీకు తెలుస్తుంది. బంధువుల నిమిత్తం ధనవ్యయం అధికం అవుతుంది. ఒక సమయంలో మీరు ఒంటరి అయిపోయినట్లుగా మీకు కనబడవచ్చు కాని, అధైర్యపడవద్దు; ఈశ్వరుడు మీకు అండగా ఉంటాడు. పుణ్యక్షేత్రాలు దర్శిస్తారు. వృత్తి, ఉద్యోగాలలో స్థిమితం చిక్కుతుంది.

స్త్రీలకు: పిల్లల ఆరోగ్యం గురించి జాగ్రత్తగా చూచుకొనండి. పగడాలు, కెంపులు ప్రధానంగా ఉండే ఆభరణాలుగాని, ఎర్రని అంచులుగల వస్త్రాలుగాని మీరు కోరవద్దు. కుటుంబంలో చుట్టాల తాకిడి ఎక్కువయి శ్రమ ఎక్కువ. 20 నుంచి 23 వరకు ప్రయాణాలకు బాగా లేదు. కుటుంబంలో అనారోగ్యం.

(మృగశిర 3, 4 పా, ఆర్ద్ర, పునర్వసు. 1, 2, 3 పా)




ఈమాసం అంతా అనుకూలంగానే కనబడుతుంది. మధ్యలో ఎన్ని శ్రమలు, ఎన్ని ఆటంకాలు కలిగినా చివరకు విజయం కలిగి తీరుతుంది. శుక్రుడు చాలా శుభకరంగా ఉన్నాడు. దేహారోగ్యం, మనస్సు స్థితి తృప్తికరంగా ఉంటవి.

శత్రువులు తమ ప్రయత్నాలు సాగించినా మీరే వారికి తగినశాస్తి చెయ్యగలుగుతారు. తొందరపడి వాగ్దానాలు చేస్తే నెరవేర్చటానికి అవస్థపడతారు. వృత్తి ఉద్యోగాలలో ధనమూ, పదవీ వృద్ధి కావటానికి అవకాశం ఉంది.

స్త్రీలకు: గృహపరిస్థితులు చాలా ప్రశాంతంగా ఉంటవి. విలువగల వస్త్రాలు, అలంకారాలు లభిస్తవి. ఇంటికి వచ్చిన బంధుమిత్రుల పొగడ్తలు పొందుతారు. నలుపురంగు ప్రధానంగా ఉన్న చీరలు, రవికలు కోరండి. 5,26, 27, లలో ఆప్తులతో నిష్ఠూరం, వృత్తిలో భయం, వృథా సంచారం.

(పునర్వసు 4 పా: పుష్యమి, ఆశ్రేష)




నేర్పుతో కార్యసాధనకు ప్రయత్నించండి. అల్పులకు అలుసు యిస్తే వారు నెత్తికెక్కుతారు.

చాలా కాలంనాడు ప్రారంభించినా ఇంతవరకు నెరవేరకుండా ఉన్నపనులు కొన్ని ఈనెలలో మీ ప్రయత్నంలేకుండానే నెరవేరుతవి. కార్యభారం ఎక్కువ కావటంవల్ల దేహశ్రమ అధికం అవుతుంది. అనుకోనిఖర్చులు అనేకం వచ్చిపడితే అందుకు ధనంఎట్లా వస్తుందని దిగులుపడండి; నారుపోసినవాడు నీరుపోయడా? డబ్బు దానంతట అదే సమకూరివస్తుంది. ఒకసమయంలో వృత్తిఉద్యోగాల విషయమై పైవారితో తీవ్రంగా మాట్లాడవలసి వస్తుంది. కాని తొందరపడవద్దు. సంఘసేవ 'ధర్మకార్యాలు.' ప్రయాణము మొత్తము మీద అనుకున్నట్లే సాగుతవి. ఇరుగు పొరుగువారితో చిన్న కలహాలువచ్చేటట్లున్నవి.

స్త్రీలకు : ఆభరణాలంకారాలు కొనడానికి పట్టుదలవద్దు. కుటుంబవిషయంలో మీమాటే నెగ్గుతుంది. పురుషునిమీద విసుగుదల చూపవద్దు.

20 నుంచి 24 వరకు: స్పెక్యులేషన్లో దిగితే నష్టం. ధనఇబ్బంది, నీచులతో కలహం.

(మఖ, పుబ్బ, ఉత్తర, 1 పా.)




ఈనెల మధ్యలో ఉష్ణప్రకోపంవల్ల ఆరోగ్యం చెడే సూచన ఉంది. ఆహార విహారాలలో నియమంగాఉంటే చాలావరకు మంచిది. మీరు ఎవరి

నైతే సందేహిస్తున్నారో వారు మీమీద చాల విశ్వాసంతో ఉన్నారనే విషయం గ్రహించకపోతే వృత్తిఉద్యోగాలలో బోల్తాపడతారు. ఎటువంటిస్థితి వచ్చినా కోర్టుగడప త్రొక్కవద్దు. మీరు ప్రయాణంచేయడానికి సందేహిస్తారుకాని ప్రయాణంచేయడమే లాభకరం. ఈశ్వరారాధన చేయండి. గతమాసంలోకన్నా విశేష ధనలాభం విస్తుంది.

స్త్రీలకు: కుటుంబంలో మీరు, మీ నుంచి మిగతావారు ఆనందం అనుభవస్తారు. మీవల్లనే కుటుంబగౌరవం నిలుస్తుంది. పిల్లలఆరోగ్యం గురించి శ్రద్ధవహించండి. దట్టంగా గళ్ళువుండే వస్త్రాలను తరచుకట్టవద్దు. 7, 8, 21 తేదీలలో ప్రయత్నము కలిసిరాదు. స్త్రీలతో కలహం.

(ఉత్తర 2, 3, 4 పా. హస్త, చిత్త 1, 2, పా.)




కార్యరంగానికి దిగకుండా భూమికీ ఆకాశానికీ ఉచ్చులు వేసే ఆలోచనలు చేస్తూకూర్చుంటే కొంతైనా ప్రయోజనముండబోదు. మీశక్తి సామర్థ్యాలకు తగినట్లు శుభయోగం కలగడానికి ఈనెల 13, 14 తేదీలతరువాత రెండుమూడు మంచి అవకాశాలువస్తవి. అవి వినియోగపడకపోతే ఆలోపం గ్రహాలదికాదు. ఉద్యోగవృత్తి వ్యాపారాలు మందంగా కనబడినా ఆదాయంలో లోపంఉండదు, అధికారులవద్దనుంచి అభిమానపూరితమైన ఉత్తరాలు వస్తవి. ఆయుధాలతోనూ, రసాయనాలతోనూ చెలగాటలాడవద్దు.

స్త్రీలకు: మనసులో ఉన్న మంచితనం మాటల్లోకూడా చూపిస్తే దేవతలకన్నా ఎక్కువగా పూజింపబడతారు. చాతుర్యంఉంటే ఆభరణాలు లేకుండానే అందంగా కనబడతారు. నానా రంగులతో చిక్కిరిబిక్కిరిగాఉండే వస్త్రాలు మీ మనశ్శాంతిని చెడకొడుతవి. 8, 9, 12, 13 లలో నూతన కార్యాలేవీ ఆరంభించవద్దు. మిత్రులతో విందులు.

(చిత్త 3, 4 పా. స్వాతి, విశాఖ. 1, 2, 3 పా)



కష్టసుఖాలు కావడికుండలు అనే విషయం గుర్తుంచుకొని సమభావంతో ఉంటే అంతగా బాధపడవలసిన అవసరం లేదు. ఈ నెలలో కొంతకాలం వరకూ ధన విషయం సాధారణంగా ఉంటుంది. ఈ సమయంలోనే కొన్ని పెద్ద ఖర్చులుకూడా వచ్చిపడతవి. ఈశ్వరుని దయవల్ల సమయంలో సర్దుబాటు అవుతుంది. వృత్తి ఉద్యోగాలలో లోగడచేసిన కొన్ని పొరపాట్లు ఇప్పుడు బయటకు రావడంవల్ల ఇబ్బంది కలుగుతుందేమోననే భయానికి అవకాశం ఉన్నా సత్యానికీ ధర్మానికీ కట్టుబడితే మీకు ఏలాటి అపకారమూ జరు

గదు. దూరంనుంచి ఆప్తులు వస్తారు.

స్త్రీలకు: గృహ కృత్యాలలో ఉపేక్షాభావం వహించవద్దు. అవసరమైన ఆలోచన అడగకుండానే చెప్పండి. వస్త్రాభరణాలు కొనడానికి ఈ మాసం అంత యుక్తంకాదు. తెల్లని వస్త్రాలు ధరించడంవల్ల మీమనసు సదా ఆనందంగా ఉంటుంది. 10, 14, 23 లలో విలువగల వస్తువులు కొంటారు. ధనలాభం, తీర్థక్షేత్ర గమనం.

(విశాఖ 4, పా. అనూరాధ, జ్యేష్ఠ)




మీరు ఎంత ప్రజ్ఞావంతులయినా కాలానికి ఎదురీది చూడడం వల్ల లాభంలేదు. భారమైన కార్యాలుపైన పెట్టుకొంటే చివరదాకా నెరవేరుతవని చెప్పలేను. కుటుంబంలో భార్యాపిల్లల ఆరోగ్యం సరిగా ఉండదు. అధికారులతో కూర్చిన వ్యవహారాలలో అనుకూలత రాలేదని ఆయాసపడి లాభం లేదు. వృత్తి ఉద్యోగాల పరిస్థితి సాధారణంగా ఉంటుంది స్పెక్యులేషన్ వంటి పనులలో దూరవద్దు.

స్త్రీలకు : కుటుంబంలో ఖర్చులవద్ద కలతలువస్తవి. ధనబాధ్యతపైన పెట్టుకోవద్దు. దూరంలోఉన్న స్నేహితురాండ్రు ఇంటికివస్తారు. గౌరీపూజచేసుకొనండి. పసుపు పచ్చనిపూలు గులాబీ వన్నె వస్త్రాలు మీ మనః కష్టాలను తొలగిస్తవి.

11, 22, 23, తేదిసిలలో ఆప్తక్షేమం తెలుస్తుంది. కార్యసిద్ధి, పండితగోష్ఠి.

(మూల, పూ. షాఢ, ఉ. షాఢ, 1 పా.)




మీరు హాస్యం మాట్లాడినా దానిలోనుంచి ఏదో ఒక కలహకారణం కల్పించడానికి మీ ప్రతికక్షులు కనిపెట్టుకొని ఉంటారు. అయినా మీరు ధైర్యంతో ఎదుర్కొంటే శత్రువులు ఏమీ చేయలేరు. వృత్తివ్యాపార విషయాలలో అకస్మాత్తుగా కొన్ని మంచి అవకాశాలు రావటంవలన గడచిన 1, 2, మాసాలలో కలిగిననష్టం తీరిపోతుంది. సాంఘిక కార్యాలు పైనపెట్టుకొంటే గౌరవంగా తృప్తికరంగా నెరవేరడం కష్టం. స్థిరాస్తికోసం ప్రయత్నాలు అనుకూలిస్తవనే నమ్మకంలేదు. మిమ్ములను అర్థంచేసుకోలేక మీఇంటిలోనివారే మీమాటను పెడచెవిని పెడతారు. కానివారిపట్ల మీరు నిరాదరణ చూపవద్దు. ధనానికి శ్రమగానే ఉంటుంది.

స్త్రీలకు: ఈనెల ఏవిషయంలోనూ పట్టిపట్టి పురుషుని మనసు నొప్పించవద్దు. అది మీమనస్సుకే నొప్పి. సాటి స్త్రీలలో మర్యాదపొందుతారు. మరీ ఎరుపుగా ఉండే వస్త్రాలుకాని పుష్పా

లుకొని అధికంగా ధరించడం అంత మంచిదికాదు. 1, 2, 3 తేదీలలో ధన లాభం, 19-న అధికారులవల్ల ఆదరం, మిత్రసహాయం.

(ఉ. షాఢ, 2, 3, 4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2, పా)




తెల్లనివన్నీ పాలేనని అనుకుని వర్తిస్తే ఒకప్పుడు పొరపాటుపడడం జరుగుతుంది. యోగ్యత పూర్తిగా తెలియకుండా ఎవరితోనూ మైత్రిచేయవద్దని గ్రహస్థితి సూచిస్తున్నది. అంత గాశ్రమలేకుండానే చాలాపనులు నెరవేరిపోతవి. ధనవిషయంకూడా గత 2 మాసాలకంటే మేలుగా ఉంటుంది. ఒకనీచుడు కొందరు దుర్మార్గులసాయంతో మీతోకలహించి అగౌరవం చేయాలనిచూస్తాడు. మీరు ప్రజ్ఞ ఉపయోగించి తగిన ప్రతిచర్యచేయండి. ఒక ముఖ్యబంధువు వద్దనుంచి విషాదవార్త తెలుస్తుంది. సంఘసేవ మొదలయిన కార్యాలు సౌమ్యంగా నెరవేరుతుంది.

స్త్రీలకు: పురుషునివల్ల పుత్రులవల్ల ఆనందంలభిస్తుంది. విందు భోజనాలు మొదలయినవి మీచేతిమీదుగా జయప్రదంగా జరుగుతవి. నీలవస్త్రాలు, నీలపుష్పాలు కలహాలకు దుఃఖానికీ సూచనగనుక విడిచిపెట్టండి. 10, 12, 25, 29 తేదీలు అకస్మాద్ధనలాభం, బంధువులతో కలహం.

ధనిష్ఠ 3, 4 పా. శతభిషం. పూ. భాద్ర 1, 2, 3 పా)




లోపల ఎంత బాధ ఉన్నా ముఖంలోనూ మాటల్లోనూ ఆ బాధను ప్రకటించి ఇతరుల వద్ద చులకన కావద్దని నా సలహా. మీరు మర్యాదకోసం పెనుగులాడుతున్న కొద్దీ కొత్త బరువులు నెత్తినవేసి కార్యసాధన చేసుకోడానికి కొందరు స్వార్థపరులు మీవెంట పడుతారు. మంచితనానికైనా పరిమితి ఉండాలనే విషయం జ్ఞాపకం ఉంచుకొని కొస్త సుఖపడండి. వృత్తి ఉద్యోగాలలో మీ ఆలోచనలకు విరుద్ధమైన వాతావరణం ఏర్పడుతుంది కాని మెలకువతో ప్రవర్తించడంవల్ల లాభకరంగానే ఉంటుంది. అసమర్థులకు సలహాలు చెప్పి నిరుత్సాహ పడవద్దు.

స్త్రీలకు: ఆడంబరాలకుపోయి ధనవ్యయంచేసుకొని చివరకు మంచి పేరు రాలేదని చికాకు పడడంకంటె మొదట్లోనే ఉదాసీనంగా ఉండటం మంచిది. కుందనము, పగడము వేసిన ఆభరణాలు మీకు సంతోషాన్నిఇస్తవి. వెండి రంగుచారలు పూలుగలవస్త్రాలు మంచివి

కావు. 9, 10, 28, 29 లలో అనుకోకుండా ప్రయాణం, వస్త్రాలంకారాది లాభం, సంఘంలో గౌరవం.


(పూ. భాద్ర 4 పా. ఉ. భాద్ర, రేవతి)




“చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవ” అనే సామెత మీకు ఈ మాసంలో అనుభవానికి వస్తుంది. వృత్తివ్యాపారాలలో కొన్ని సమయాలలో మీ అంచనాకు మించిన లాభం వస్తుంది. కొన్ని సమయాలలో మీ శ్రమకు ఎంతో తక్కువగా ఫలితం కనబడుతుంది. ఆప్త బంధువులతో ధన విషయంలో పేచీలు ఏర్పడే సూచన ఉంది. సాధ్యమయినంతవరకు సహనం వహించి మంచివాడనిపించుకోడం ఉత్తమం. కోర్టు కచేరీలలో అనుకూలత కలుగుతుంది కాని ధనవ్యయం అధికం. స్వల్ప అనారోగ్యం చేస్తుంది.

స్త్రీలకు: గృహంలో ఏర్పడే చిన్న కలతలకు బేజారు కావద్దు. ఇంటికి వచ్చిన బంధువులను ఆదరంతో గౌరవించండి. పుష్పాలు, వస్త్రాలు తెల్లనివి, పసుపు పచ్చనివి అందమును ఆనందమును ఇస్తవి. 14, 15 తేదీలలో శుభవార్త, ధనాదాయం, మిత్రులవల్ల లాభం.


—భాస్కరాచార్య.



# ఆంధ్రజ్యోతి పజిల్స్

## రచయిత: శ్రీ. శ్రీ.

[ప్రస్తుతం వినోదంకోసమే. ఇంకా విత్తంమీద కాంక్ష లేదు.]




అడ్డము:

1. తలలేని ప్రజాకవి.
3. బాబూరావు పశేలులో ఏముంది ఊదటానికి?
5. పచ్చడికి పనికివచ్చేకాయ.
6. ఏం విచిత్రం :
7. సినిమాడైరెక్టర్ల బుజాలు వదిలి పత్రికాసంపాదకుల నెత్తిమీద కూర్చున్న ఒకతార.
8. లెంపమీదపడి పేరు తెచ్చుకునేవి.

9. ఒకజాతి.

11. తినగా తినగా తీపి.

13. నిరంకుశోపాఖ్యానంలో వ్యభిచారం.

14. ఒకజాతి వెర్రి.

15. (నాలుగు నిలువుకు) పర్యాయపదం.

16. ఆననాకార రహిత మజ్జాకీమేను.

18. ఒక ఋషి.

20. మధుర పదార్థం.

21. కిరీటాల మధ్య శిరోజాల మెరుగు.

22. ఏటుచూచినా అభినయమే.

నిలువు:

1. ఈమెపని (పదమూడు అడ్డు.)

2. ఆదిమధ్యాంత రహితుడైన వికటకవి.

3. పిల్లలనిద్రకు మందు.

4. నిశ.

5. నిశాంతం.

6. వాలకం.

7. అరిషడ్వర్గములలోనిది.

8. సది.

10. ఇతనిపాచిక పారకపోవటమంటూ ఉండదు.

12. స్త్రీ.

13. కవిరాజమనో.........

14. 'మిగిలినవే!' వెనక్కితిప్పి శిగ తరగాలి.

17. ఆయమ మగడు.

18. పింజారీ వెధవలు దాటేశారు.

19. బావుటాకి అటూ ఇటూ.

20. పాడదగ్గ తిరుగుటపా.

(సొల్యూషన్ వచ్చేసంచికలో)

B. N. K. Press, ఆచారప్పన్ వీధిలో బి. నాగిరెడ్డిగారిచే ముద్రింపబడి
బి. ఎన్. గుప్తగారిచే ప్రకటించబడింది.